శనివారం
08-10-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 107
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గిరిజనం గుండెచప్పుడు దేముడు 7లో
ఆర్ఎస్ఐ తిరుగుబాటుకు మార్గదర్శి ఎన్కే కృష్ణన్
గిరిజన రైతాంగ మహోజ్వల పోరాటం

తగ్గని వాన జోరు

- మూడు రోజులుగా ఎండచూడని జనం
- పత్తి, మిర్చి పంటకు తీవ్ర నష్టం
- మరో రెండు రోజులు ఇదే పరిస్థితి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: తెలుగు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. దసరా పండగ రోజు నుంచి ఎడతెరపి లేని వర్షాలు కురుస్తుండడంతో జనజీవనం అతలాకుతలమవుతోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపిస్తున్నాయి. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విజయవాడ నగరంలో వీధులు జలమయం కావడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. శుక్రవారం కూడా ఏపీ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అధిక వర్షపాతం నమోదైంది. మూడు రోజులుగా ఎండ పొడ చూడని పరిస్థితి నెలకొంది. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో అత్యధికంగా పండించే వాణిజ్య పంటలైన పత్తి, మిర్చి దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. పత్తి మొదటి కాపు చేతికొచ్చే సమయంలో వరుస వర్షాలు రైతును చావు దెబ్బతీశాయి. మిర్చి కూడా పూత, పిందె దశలో ఉంది. అత్యధిక పెట్టుబడితో కూడిన ఈ పంట పొలాలన్నీ ఉరకలెత్తుతున్నాయి. వాతావరణ శాఖ అంచనా ప్రకారం మరో రెండు రోజులపాటు ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలపడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏపీలోని ఆరు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, మిగితా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. బయటకు వెళ్లే ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో మద్దిలేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. భీమవరం, పెనరవాయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుందూ నీటిమట్టం మరింత పెరిగిపోతోంది. దీంతో పోలీసులు, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.

పౌరహక్కుల పరిరక్షణకు

నోబెల్ శాంతి

న్యాయవాదితో పాటు రెండు సంస్థలకు దక్కిన పురస్కారం

ఓస్లో : ఈ ఏడాది నోబెల్ శాంతి పురస్కారం బెలారస్ మానవహక్కుల కార్యకర్తతో పాటు రష్యా, ఉక్రెయిన్‌కు చెందిన సంస్థలను వరించింది. బెలారస్ హక్కుల కార్యకర్త ఆలెస్ బిలియాట్స్కీ, రష్యాకు చెందిన మానవ హక్కుల సంస్థ 'మెమోరియల్', ఉక్రెయిన్ కేంద్రంగా పనిచేసే 'సెంటర్ ఫర్ సివిల్ లిబర్టీస్'కు ఈ అవార్డును నార్వేయన్ నోబెల్ కమిటీ అధ్యక్షుడు బెరిట్ రీస్ ఆండర్సన్ శుక్రవారం ప్రకటించారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, శాంతి కోసం విజేతలు పాటుపడినట్లు తెలిపారు. మూడు పొరుగు దేశాల శాంతి స్థాపన కృషికి ఈ అత్యున్నత పురస్కారం లభించిందని విలేకరులతో మాట్లాడిన ఆమె అన్నారు. బెలారస్, రష్యా, ఉక్రెయిన్‌లలో మానవ హక్కులు, ప్రజాస్వామ్యం, శాంతి కోసం ముగ్గురు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని, వారిని గౌరవించాలని నార్వేజియన్ నోబెల్ కమిటీ కోరుకుంటుందని అండర్‌సెన్ తెలిపారు. ప్రస్తుతం జైల్లో ఉన్న బిలియాట్స్కీని తక్షణమే బెలారస్

- మిగతా 2 లో

శాశ్వత రిజిస్ట్రార్‌గా సూర్యదేవర నియామకం రద్దు

మాజీ సీజేఐ ఉత్తర్వులను తోసిపుచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఎన్వీ రమణ తన పదవీకాలం చివరిలో తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు రద్దు చేసింది. శాశ్వత రిజిస్ట్రార్‌గా ప్రసన్న కుమార్ సూర్యదేవర నియామకాన్ని రద్దు చేసింది. సూర్యదేవరను ఆలిండియా రేడియో (ఏఐఆర్) వార్తా విభాగానికి తిరిగి పంపగా ఆ ఉత్తర్వులు సెప్టెంబరు 30 నుంచి అమలయ్యాయి. న్యూస్‌రీడర్‌గా, తెలుగు అనువాదకునిగా ప్రసార భారతి నుంచి తన కెరీర్‌ను సూర్యదేవర ప్రారంభించారు. 2004-09లో లోక్‌సభ మాజీ స్పీకర్ సోమనాథ్ చటర్జీ కార్యాలయంలో ఓఎస్‌డీ (ఆఫీసర్ ఆప్ స్పెషల్ డ్యూటీ)గా; 2009-15లో రాజ్యసభ అప్పటి చైర్మన్ హమీద్ అన్సారీ కోసం పనిచేశారు. 2015లో ఢిల్లీ శాసనసభ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వానికి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మధ్య వారధిగా

- మిగతా 2 లో

ఐక్యతతోనే బీజేపీకి అడ్డుకట్ట

- ఫాసిస్టు చర్యలను తిప్పికొట్టాలి
- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌తో హక్కులకు ముప్పు
- కాషాయదళంపై పోరుకు ఐక్య కార్యాచరణ
- సీపీఐ సదస్సులో మేధావుల ఉద్ఘాటన

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆర్ఎస్ఎస్, బీజేపీ ఫాసిస్టు చర్యలను అడ్డుకోకపోతే భావప్రకటనా స్వేచ్ఛతో పాటు అనేక హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని మేధావులు హెచ్చరించారు. దేశాన్ని ప్రమాద పరిస్థితుల్లోకి నెడుతున్న ఈ శక్తుల ప్రచారానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. మత విద్వేషాలు రెచ్చగొడుతున్న బీజేపీని అడ్డుకునేందుకు ఐక్య కార్యాచరణతో ముందుకు సాగాలని, అందుకు కవులు, కళాకారులు, రచయితలు, మేధావులు కదనరంగంలోకి దిగాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర సమితి అధ్వర్యంలో 'దేశంలో పరిణామాలు-మేధావుల విశ్లేషణ' అనే అంశంపై హైదరాబాద్ మగ్దూంభవన్‌లో శుక్రవారం సదస్సు జరిగింది. సదస్సుకు సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షత వహించగా సురవరం సుధాకరరెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు.

తినే తిండిపైనా బీజేపీ పెత్తనం: సురవరం

ప్రజలు ఏమి తినాలో...ఏ బట్టలు ధరించాలో... ఏమి ఆలోచించాలో కూడా బీజేపీ, ఆర్ఎస్ఎస్ నిర్ణయిస్తున్నాయని సీపీఐ పూర్వ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి అన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలన్నారు. రాజ్యాంగానికి కొంత వెసులుబాటు, పౌర హక్కులు, మానవహక్కుల కోసం డిమాండ్ చేయవచ్చునని, ప్రతిఘటనా పోరాటాలకు అవకాశం ఉంటుందని అన్నారు. ఫాసిజాన్ని ప్రతిఘటించకుండా కొందరు మేధావులు మౌనంగా ఉన్నారని, మరికొందరు లొంగిపోయారని, అయినప్పటికీ చాలామంది గొంతు విప్పుతున్నారని చెప్పారు. మౌన మేధావులను రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు సంఘటితం చేయాలని సూచించారు. ప్రతిపక్ష

- మిగతా 2 లో

అంత్యక్రియలు

" జాతస్య హి ధ్రువో మృత్యుః ధ్రువం జన్మ మృతస్యచ ।
తస్మాదపరిహార్యే ర్థేన త్వం శోచితుమర్హసి ॥



జననం: 9.9.1949
మరణం: 7.10.2022

కీ॥శే॥ మాగుంట సుధాకరరెడ్డి గారు
ప్రముఖ వ్యాపారవేత్త, సినీనిర్మాత, చెన్నై

ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి గారి తమ్ముడు మరియు మా అన్న గారైన మాగుంట సుధాకరరెడ్డి గారు తేది: 07-10-2022 శుక్రవారం మధ్యాహ్నం 1-41 ని॥లకు చెన్నైలో స్వర్గస్తులైనారని తెలియజేయుటకు చింతించుచున్నాము. మాగుంట కుటుంబ వ్యాపార, రాజకీయ ఉన్నతికి అహర్నిశలు శ్రమించి మార్గదర్శకులుగా నిలిచిన మాకు దైవ సమానులైన కీ॥శే॥ మాగుంట సుధాకరరెడ్డి గారి అంత్యక్రియలు తేది: 8-10-2022 శనివారం మధ్యాహ్నం 3-00 గం॥లకు చెన్నై నుంగంబాక్కం కాలేజీ రోడ్‌లోని 18- సుబ్బారావు అవెన్యూ నందలి మా స్వగృహము నుండి అంతిమయాత్ర బయలుదేరునని తెలియజేయడమైనది. బాధాతప్త హృదయాలతో...

తమ్ముడు: మాగుంట శ్రీనివాసులురెడ్డి
పార్లమెంట్ సభ్యులు, ఒంగోలు.
మరియు మాగుంట కుటుంబ సభ్యులు

ఇదీ లోకం!

గొంతులో కిచ్ కిచ్..
గొంతులో కిచ్ కిచ్.. ఏం చేయను.

మరో పేరు మార్పు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిగా విజయనగరం మహారాజా ఆస్పత్రి

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్రంలో వ్యవస్థలు, సంస్థల పేర్ల మార్పుల తాకిడి విజయనగరం జిల్లానూ తాకింది. విజయనగరం మహారాజ జిల్లా ఆసుపత్రి పేరును మార్చడమే ఇందుకు కారణం. ఇప్పటి వరకు మహారాజ జిల్లా ఆసుప్రతి పేరును కాస్తా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా ప్రభుత్వం మార్పు చేసింది. టీడీపీ హయాంలోనే వైద్య కళాశాల రావడం, అందుకు జిల్లా కేంద్ర ఆసుపత్రి ప్రాంగణాన్ని కళాశాలకు ఎంపిక చేశారు. అయితే అప్పట్లో ప్రభుత్వం అంతగా దృష్టి పెట్టక పోవడంతో కళాశాల పనులు కొలిక్కి

- మిగతా 2 లో

గ్రీస్‌లో కార్మికుల భారీ ఉద్యమం

ఏథెన్స్ : గ్రీస్ ట్రేడ్ యూనియన్ ఉద్యమం నవంబర్ 9న దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమైంది. భారీ సమావేశాలతో, వందలాది యూనియన్‌లకు ప్రాతినిధ్యం వహిస్తూ గ్రీస్‌లోని క్లాస్ యూనియన్‌లు నవంబర్ 9 నాటి జాతీయ సాధారణ సమ్మెకు సిద్ధమయ్యాయి. ఏథెన్స్‌లో స్పోర్టింగ్ అరేనాలో పీఏఎమ్‌ఈ, ట్రేడ్ యూనియన్‌లు, డబ్ల్యుఎఫ్‌టీయూ బ్యానర్‌లతో "నవంబర్ 9న జరిగే సార్వత్రిక సమ్మెకు ప్రతి ఒక్కరూ వేచి ఉండకండి, సహించవద్దు" అనే నినాదంతో కూడిన బ్యానర్‌లను అన్ని రంగాలకు చెందిన వందలాది ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు స్వాగతించారు. నవంబర్ 9న ఏథెన్స్‌లో తలపెట్టిన ఈ ర్యాలీని ఉదయం 10.30 గంటలకు నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఫాసిస్టు శక్తులందరినీ జైల్లో పెట్టాలని డిమాండ్ చేస్తూ, వారిని విడుదలకు చేస్తున్న ప్రయత్నాలను ఖండిస్తూ యూనియన్లు నూతన ఉద్యమాన్ని నిర్వహించాలని కూడా నిర్ణయించాయి.

కార్మిక సంఘాలు, యూనియన్ వాదులు నెలల తరబడి పని ప్రదేశాల్లో పెద్ద పోరాటాలు చేస్తున్నపటికీ తమ డిమాండ్లునెరవేరని కారణంగా దేశవ్యాప్త సమ్మెకు పూనుకున్నట్లు యూనియన్ నాయకులు తెలిపారు. నిర్మాణ రంగ కార్మికులు, నౌకాశ్రయ ఉద్యోగులు, ఆరోగ్యకార్యకర్తలు ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కొత్త పోరాటాలకు దిగుతున్నారు. ఇటలీ, ఫ్రాన్స్, డెన్మార్క్ కార్మికులు గ్రీస్‌లో జరిగే దేశవ్యాప్త సమ్మెకు సందేశాలద్వారా మద్దతు పలికారు.

15 మిలియన్ల అఫ్గాన్‌లకు ఆహార కార్యక్రమం

కాబూల్: అఫ్గాన్‌లో కొనసాగుతున్న ఆహార అభద్రత మధ్య, ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పీ) మార్చి 2023 వరకు ప్రతి నెలా 15 మిలియన్లకు పైగా ప్రజలకు ఆహార సహాయం అందించేందుకు సిద్ధమైంది. అఫ్గాన్‌లో నెలకొన్న ఆర్థిక సంక్షోభంపై ప్రపంచ ఆహార కార్యక్రమం తీవ్రం ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా, యూరప్ సహా ఇతర ప్రపంచ దేశాలు ఆయా దేశాల్లో నెలకొన్న యుద్ధ సంక్షోభాన్ని పరిష్కరించడంతోపాటు అఫ్గాన్‌లోని15 మిలియన్లకు పైగా ప్రజలకు ఆహార సహాయం అందించాలని నిర్ణయించింది. అఫ్గాన్‌లోని పేద ప్రజల పంపిణీకి ఉక్రెయిన్ నుండి 80,000 టన్నుల గోధుమలను కొనుగోలు చేస్తామని ప్రపంచ ఆహార కార్యక్రమం ఇప్పటికే పేర్కొంది. అయితే, దేశంలో మౌలిక సదుపాయాలు, నిరుద్యోగం, అధిక ధరల కారణంగా

ఎటువంటి సహాయం అందడం లేదని, అంతర్జాతీయ సహాయంలో పారదర్శకత లోపించిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. "మాకు సాయం అందలేదు. మాకు సహాయం కావాలి అని కాబూల్ నివాసి బిస్మిల్లా అన్నారు. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో అఫ్గాన్‌లోని 15 మిలియన్ల మందికి వచ్చే ఆరు నెలల పాటు నెలవారీ ఆహారం, పోషకాహార సహాయాన్ని అందించేందుకుగాను ప్రపంచ ఆహార కార్యక్రమం క్రింద 1.1 బిలియన్లను కోరింది. అఫ్గాన్‌లో '19 మిలియన్ల మంది ప్రజలు ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు, 25 మిలియన్ల మంది ప్రజలు పేదరికంలో ఉన్నారు, 5.8 మిలియన్ల మంది వరదలు, భూకంపాల వల్ల ఇళ్లు కోల్పోయి దికుకతోచని స్థితిలో ఉన్నారు. అఫ్గాన్‌లో పెరుగుతున్న సంక్షోభం చిన్న సంస్థలను తీవ్రంగా దెబ్బతీసింది. అమ్మకాల కొరత, వినియోగదారుల ఉత్పత్తుల డిమాండ్‌లో విపరీతమైన క్షీణత కారణంగా ప్రైవేట్ కంపెనీలు సగానికి పైగా తమ ఉద్యోగులను తొలగించాయి.

గ్రీసు జలాల్లో రెండు నౌకల మునక: 22 మంది మృతి

కైతిరా : గ్రీస్‌లో వలసదారులను తీసుకువెళు తున్న రెండు నౌకలు మునిగిపోయిన ఘటనలో 22 మంది మృతిచెందారు, డజన్ల కొద్దీ తప్పిపోయారు. రెండు వలస పడవలు మునిగిపోవడంతో నీటిలో శిథిలాల మధ్య మృతదేహాలు చిక్కుకుపోయాయని అధికారులువెల్లడించారు. సుమారు 40 మందితో ప్రయాణిస్తున్న ఈ నౌకలు మునిగిపోవడంతో 16 మంది ఆఫ్రికన్ యువతుల మృతదేహాలు, ఒక యువకుడి మృతదేహాన్ని గుర్తించారు. వీరిలో పది మంది మహిళలను రక్షించగా, మరో 13 మంది వలసదారులు గల్లంతైనట్లు కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు. ""మహిళలు అందరూ ఆఫ్రికన్ దేశాలకు చెందినవారు, 20 ఏళ్లు పైబడిన వారుగా తెలుస్తోంది. కైతిరా టర్కీకి పశ్చిమాన 400 కిలోమీటర్లు (250 మైళ్ళు) దూరంలో ఉంది. గ్రీస్‌ను దాటి ఇటలీకి వెళ్లేందుకు గాను స్మగర్లర్లు ఎక్కువగా ఈ మార్గాన్ని అనుసరిస్తుంటారు. సముద్రంలో వలసదారుల భద్రతపై గ్రీస్, టర్కీల మధ్య వివాదం జరుగుతోంది, చాలా మంది వలసదారులు సమీపంలోని టర్కీ నుండి గ్రీస్‌కు చేరుకుంటారు. మరోవైపు సెయిల్ బోటు ఒకటి కైతిరా జలాల్లోని రాయిని ఢీ కొట్టడంతో విరిగిపోయింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు.

మరో పేరు మార్పు

(మొదటిపేజీ తరువాయి)

రాలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 16 వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. అందులో విజయనగరం వైద్య కళాశాల కూడా ఒకటి. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు కూడా వైద్యకళాశాలను ప్రతిష్ఠాత్మకంగానే తీసుకున్నారు. వచ్చే ఏడాది నుంచి తరగతులు కూడా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి పేరు మార్పు చర్చనీయాంశంగా మారింది.

మార్చాల్సింది పేర్లు కాదు... ప్రభుత్వాన్ని: టీడీపీ

విజయనగరం రూరల్: మార్చాల్సింది పేర్లు కాదు.. ప్రభుత్వాన్ని అని వైసీపీని ఉద్దేశించి టీడీపీ నాయకులు ఘాటు వ్యాఖ్యలు చేశారు. మహారాజ ప్రభుత్వాసుపత్రి పేరును.. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిగా మార్చడంపై టీడీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. ఈ మేరకు విజయనగరం జిల్లా కేంద్రాసుపత్రి వద్ద శుక్రవారం పెద్దఎత్తున నిరసన తెలిపాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. ఇప్పటికే హెల్త్ యూనివర్సిటీ పేరును మార్చిన ప్రభుత్వం, నేడు మహారాజ ప్రభుత్వాసుపత్రి పేరును మార్చి ప్రజల మనోభావాలను దెబ్బతీసిందని టీడీపీ నేతలు విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం చేతకాక పేర్లు మార్చి కాలయాపన చేస్తున్నారని ఆగ్రహించారు. ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న ఆలోచనతో అప్పటి పూసపాటి వంశీయులు ఈ ఆసుపత్రి నిర్మించారని గుర్తు చేశారు. కానీ నేడు ఆసుపత్రి వేదికగా వైసీపీ ప్రభుత్వం రాజకీయాలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. పేరు మార్పునకు నైతిక బాధ్యత వహిస్తూ తక్షణమే మంత్రి బొత్స, స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో తుగ్లక్ చర్య: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : విజయనగరంలో ఉన్న మహారాజా ఆసుపత్రి పేరు తొలగింపు మరో తుగ్లక్ చర్య అని టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం ట్వీట్ చేశారు. హెల్త్ యూనివర్సిటీకి ఎన్టీఆర్ పేరు తొలగించి ప్రభుత్వం తీవ్ర విమర్శల పాలైంది. నాడు మాన్సాస్ ట్రస్ట్, సింహాచలం దేవస్థానం చైర్మన్ పోస్టుల నుంచి అశోక్ గజపతి రాజును ఇలాగే తప్పించి కోర్టుతో చీవాట్లు తిన్నారు. అయినా మీ వైఖరిలో మార్పు రాలేదు. ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తీసుకుంటున్న నిర్ణయాలపై సీఎం జగన్ ఎప్పటికైనా వెనక్కి తగ్గాల్సిందేనన్నారు.

జగన్ పాలనా దుస్థితికి ఈ ఘటనలే ఉదాహరణ

రాష్ట్రంలో పాలనా దుస్థితికి, ప్రభుత్వ వైఫల్యాలు సామాన్యుడి జీవితాలను ఎలా చిద్రం చేస్తున్నాయో చెప్పడానికి ఇవి నిదర్శనమంటూ చంద్రబాబు మరో ట్వీట్ ద్వారా కొన్ని ఘటనలు ఉదాహరించారు. కాకినాడ జిల్లా జె తిమ్మాపురంలో అసుపత్రికి వెళుతున్న పసిబిడ్డ గుంతల రోడ్డులో ప్రాణాలు కోల్పోయింది.

ప్రభుత్వ కాంట్రాక్ట్ బిల్లులు మంజూరు కాక...క్యాన్సర్ బాధితుడైన తండ్రి వైద్యానికి డబ్బులు లేక వేదన పడుతున్న లేపాక్షి మండలం వెంకటశివప్ప ఘటన, రాష్ట్ర ఆదాయం గాడిన పడిందన్న సీఎం, వారం రోజులు అయినా రిటైర్డ్ ఉద్యోగులకు పెన్షన్ ఇవ్వలేకపోవడం వంటి ఘటనలే ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రజలను బాదేస్తున్న పన్నులు ఎటుపోతున్నాయి....లక్షల కోట్ల అప్పులు ఏమవుతున్నాయి? ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

దిల్లీ మద్యం పాలసీ కేసు

మరోసారి ఈడీ దాడి

దిల్లీ, పంజాబ్, హైదరాబాద్‌లోని 35 ప్రాంతాల్లో సోదాలు

న్యూదిల్లీ/చండీగఢ్ : దిల్లీ మద్యం పాలసీలో అక్రమాలు జరగాయన్నా ఆరోపణల పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. శుక్రవారం దిల్లీ, పంజాబ్, హైదరాబాద్‌ల్లో 35 ప్రాంతాల్లో తాజాగా మరోసారి దాడులు నిర్వహించింది. ఈ రాష్ట్రాల్లో మద్యం కంపెనీలు, పంపిణీదారులు, సరఫరా వ్యవస్థతో సంబంధం ఉన్న ప్రాంతాల్లో ఈ సోదాలు చేపట్టింది. ఆయా ప్రాంతాల్లో సోదాలు నిర్వహించేందుకు దిల్లీ ప్రధాన కార్యాలయం నుంచి దర్యాప్తు సంస్థ బృందాలు తెల్లవారుజామున బయలుదేరి వెళ్లాయి. పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్, లూధియానా, చండీగఢ్‌ల్లో దాడులు నిర్వహించింది. పంజాబ్‌లోని మద్యం కాంట్రాక్టర్ల పై ఈ దాడులు చేపట్టింది. మద్యం వ్యాపారి దీప్ మల్హోత్రాకు చెందిన వేర్వేరు ప్రాంతాల్లో సోదాలు జరిగాయి. అతని కంపెనీ దిల్లీలో అనేక మద్యం విక్రయ దుకాణాలను వేలం వేసి నడుపుతోంది. ఈడీ బృందం ఒకటి శుక్రవారం ఉదయం ఫరీద్‌కోట్‌లో మద్యం వ్యాపారి దీప్ మల్హోత్రా, అకాలీ దళ్ మాజీ ఎమ్మెల్యే నివాసాలకు చేరుకుంది. మహిళా అధికారి నేతృత్వంలోని ఈడీ బృందం ఉదయం 8 గంటల సమయంలో కంటోన్మెంట్ రోడ్డులోని నివాసానికి చేరుకుని సోదాలు ప్రారంభించింది. ఈడీ సిబ్బంది ఈ సమయంలో ఇంటి లోపలికి ఎవరినీ అనుమతించలేదు. దీప్ మల్హోత్రా రెండు సంస్థల్లో భాగస్వామిగా ఉన్నట్లు తెలుస్తోంది. మూడు గ్రూపులకు దిల్లీలో మద్యం విక్రయించేందుకు లైసెన్సులు లభించాయి. కాగా హైదరాబాద్‌లో నాలుగు చోట్ల ఈడీ సోదాలు జరుగుతున్నాయి. జూబ్లీహిల్స్, కూకట్‌పల్లితో పాటు మరో రెండు చోట్ల అధికారులు వివిధ పత్రాలను తనిఖీ చేస్తున్నట్లు సమాచారం.

సమయాన్ని వృథా చేస్తున్నారు : కేజ్రీవాల్

దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కేంద్రం పై విమర్శలు గుప్పిస్తూ, ఈడీ దాడులను 'చెత్త రాజకీయాలు'గా అభివర్ణించారు. 'మనీశ్ సిసోడియాకు వ్యతిరేకంగా 500కి పైగా దాడులు నిర్వహించారు. మూడు నెలలకు పైగా సీబీఐ, ఈడీ అధికారులు 24 గంటలూ పని చేస్తున్నారు. మనీశ్ సిసోడియాకు వ్యతిరేకంగా ఒక్క సాక్ష్యం అయినా గుర్తించారా. ఏమీ దొరకలేదు. ఎందుకంటే ఏమీ చేయలేదు' అని కేజ్రీవాల్ హిందీలో ట్వీట్ చేశారు. 'వారి చెత్త రాజకీయాల కోసం అనేక మంది అధికారుల సమయాన్ని వృథా చేస్తున్నారు. అలాంటప్పుడు దేశం ఎలా పురోగమిస్తుంది?' అని ఆయన ప్రశ్నించారు. మద్యం పాలసీలో మనీలాండరింగ్ కేసుకు సంబంధించి సీబీఐ ఎఫ్‌ఐఆర్ అధికార ఆప్, బీజేపీ మధ్య తాజా వివాదానికి దారితీసింది. ఇందులో దిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, కొంతమంది దిల్లీ ప్రభుత్వ అధికారులను నిందితులుగా పేర్కొన్నారు. కొనుగోలుదారులను ఆకర్షించడానికి రిటైలర్లు పెద్ద రాయితీలను అందించే విధానంలో భారీ అవినీతి జరిగిందని బీజేపీ ఆరోపించింది. అయితే తమ విధానం అవినీతిని అరికట్టడమే లక్ష్యంగా పెట్టుకుందని, రాజకీయ లక్ష్యాల కోసం బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆప్ ఆరోపిస్తోంది. ఈ కేసులో అనేక దఫాలుగా దాడులు నిర్వహించిన దర్యాప్తు సంస్థ మద్యం వ్యాపారి సమీర్ మహేంద్రుడిని గత వారం అరెస్టు చేసింది. ఆప్ కమ్యూనికేషన్స్ చీఫ్, ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా సన్నిహితుడు విజయ్ నాయర్‌ను సీబీఐ అరెస్టు చేసిన ఒక రోజు తర్వాత అతని అరెస్ట్ జరిగింది. దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా సీబీఐ విచారణకు సిఫార్సు చేసిన నేపథ్యంలో గత ఏడాది నవంబర్ 17 నుంచి అమలు చేసిన దిల్లీ మద్యం పాలసీని అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం ఈ ఏడాది జులైలో రద్దు చేసింది. ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టాన్ని కలిగించడం ద్వారా ప్రైవేట్ మద్యం వ్యాపారులకు లబ్ధి చేకూర్చాలనే ఏకైక లక్ష్యంతో ఈ విధానాన్ని అమలు చేశారని సక్సేనా ఆరోపించారు. ఈ కేసుకు సంబంధించి లెఫ్టినెంట్ గవర్నర్ 11 మంది ఎక్సైజ్ అధికారులను కూడా సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంలో ఎక్సైజ్ శాఖకు ఇన్‌ఛార్జ్‌గా ఉన్న మనీశ్ సిసోడియా పాత్రనూ అందులో ప్రస్తావించారు. ఈ క్రమంలోనే దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగి దేశవ్యాప్తంగా దాడులు నిర్వహిస్తున్నాయి.

సూర్యదేవర నియామకం రద్దు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. 2016లో అప్పటి దిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ (ఎల్‌జీ) నజీబ్ జంగ్ జారీ చేసిన ఉత్తర్వులతో ఏఐఆర్‌కు బదిలీ అయ్యారు. సూర్యదేవర తొలగింపునకు అసెంబ్లీ స్పీకర్ రాం నివాస్ గోయల్ వ్యతిరేకించారు. అసెంబ్లీ పనితీరులో ఎల్‌జీ జోక్యం తగదన్నారు. దిల్లీ ఎన్‌సీటీ శాశ్వత కార్యదర్శిగా సూర్యదేవర నియామకాన్ని గోయల్ ప్రతిపాదించారు. కాగా ఎల్‌జీగా బాధ్యతలు స్వీకరించిన అనిల్ బైజల్ కూడా జంగ్ నిర్ణయంతో ఏకీభవించడంతో ఈ వ్యవహారం దిల్లీ హైకోర్టుకు వెళ్లింది. ఒక అధికారి బదిలీ విషయంలో వ్యవహరించిన తీరుకుగాను గోయల్‌కు కోర్టు 2017లో మొట్టికాయలు వేసింది. సూర్యదేవరపై క్రమక్షశిక్షణా చర్యలకు ఏఐఆర్ పూనుకుంది. మాతృసంస్థలో చేరకపోవడం, 'సైడర్ ఆఫీస్, నార్ ప్రాఫిట్' అనే వ్యాసాన్ని ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో రాసిన క్రమంలో ఈ చర్యలకు ఉపకరించింది. సూర్యదేవరపై క్రమశిక్షణ చర్యలు తీసుకోకుండా స్టే విధించాలని గోయల్ ఫిర్యాదు చేయగా కోర్టు తిరస్కరించింది. దీంతో తన కేసును సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) కి తీసుకెళ్లేందుకు సూర్యదేవర విఫలయత్నం చేశారు. అయివే వరుసబెట్టి చేసిన డిపార్ట్‌మెంటల్ అప్పీళ్లతో ఆరోపణలను తప్పించుకోగలిగారు. 2021లో ప్రసార భారతీ సంయుక్త డైరెక్టర్‌గా సూర్యదేవర నియమితులైనప్పుడే ఆయనకు మీడియా బాధ్యతలను మాజీ సీజేఐ రమణ కట్టబెట్టారు. మూడేళ్ల కోసం అదనపు రిజిస్ట్రార్ హెూదాలో మీడియా కన్సల్టెంట్ స్థాయి ఓఎస్‌డీగా సూర్యదేవర నియమితులయ్యారు. సీజేఐగా జస్టిస్ రమణ పదవీ కాలం చివరి వారంలో ఈ నియామకం జరిగింది. శాశ్వత సభ్యునిగా కోర్టులోకి ప్రవేశించిన సూర్యదేవర ఆపై రిజిస్ట్రార్ ర్యాంకు అధికారి అయ్యారు. ఇప్పుడు ఆయన నియామకం రద్దు కావడంతో ప్రసార భారతీకి తిరిగి వెళ్లారు.

కేటగిరి-బి లోనూ...

కంప్యూటర్‌కే గిరాకీ

రూ.2లక్షల వరకూ ఫీజు

మెకానికల్, సివిల్‌కు ఆదరణ నిల్

10తో రిజిస్ట్రేషన్లకు డెడ్‌లైన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంజినీరింగ్ యాజమాన్య కోటా (కేటగిరి-బి) సీట్లలోనూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్‌ఈ) సీట్లకు డిమాండ్ పెరిగింది. తొలి విడత ఏపీఈఏపీసెట్-2022 కౌన్సెలింగ్‌లో సీఎస్‌ఈ, ఈసీఈ సీట్లపైనే అభ్యర్థులు ఆసక్తి చూపారు. పేరొందిన కళాశాల నుంచి దిగువ స్థాయి కళాశాలల్లో సైతం సీఎస్‌ఈ, దాని అనుబంధ బ్రాంచీలనే ఎంచుకున్నారు. ఎక్కడా సీఎస్‌ఈ, అనుబంధిత బ్రాంచీలు ఖాళీగా లేవు. చాలా మంది సీఎస్‌ఈ ఆశించి భంగపాటుకు గురయ్యారు. రెండో విడత కౌన్సెలింగ్ కోసం వేచిస్తున్నారు. మరో వారం రోజుల్లో రెండో విడత కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. కన్వీనర్ కోటా కంటే మూడు రెట్లుగా కేటగిరి-బి సీట్లకు ఫీజులు వసూలు నిర్ధారించారు. పేరొందిన కళాశాలల్లో సీఎస్‌ఈ, ఐటీ, దాని అనుబంధ రంగాల బ్రాంచ్‌లకు కన్వీనర్ నిర్ధారించిన ఫీజు రూ.60వేలు ఉండగా, దాని కంటే మూడు రెట్లు అనగా రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు ఫీజులు నిర్ధారించారు. మిగిలిన ఈసీఈ లక్షా 25వేలకే ఖరారు చేశారు. మిగిలిన కళాశాలల్లో అంతకంటే తక్కువగా ఉంది. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ (ఇఇఇ), మెకానికల్, సివిల్ ఇంజినీరింగ్ సీట్లకు అంతగా డిమాండు లేనందున రూ.70వేలకే నిర్ధారించారు. యాజమాన్య సీట్లలోనూ అత్యధికంగా సివిల్, ఇంజినీరింగ్ సీట్లు మిగిలిపోయాయి.

కన్వీనర్ నిబంధనలకు దూరం

కేటగిరి-బి సీట్ల ఎంపికలో చాలా కళాశాలలు కన్వీనర్ నిబంధనలు పాటించడం లేదని తెలిసింది. కన్వీనర్ నిబంధనల ప్రకారం కేటగిరి-బి ఎంపికలో ఇంటర్ మార్కులు, ఏపీఈఏపీసెట్ ర్యాంకులు, జేఈఈ మెయిన్స్ స్కోరింగ్‌ను పరిగణలోకి తీసుకోవాలి. రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాల్లో బి.కేటగిరి కింద భర్తీకిగాను ఈనెల 10వ తేదీతో గడువు ముగియనుంది. అఖిల భారత సాంకేతిక విద్యా సంస్థ గుర్తింపు పొందిన ప్రతి ఇంజినీరింగ్ కళాశాలల్లో బి.కేటగిరి, ఎన్‌ఆర్ఐ కేటగిరి కింద 30 శాతం సీట్లను ప్రభుత్వం భర్తీ చేసుకునేలా అవకాశం కల్పించింది. ఇందులో బి.కేటగిరీకి 15శాతం, ఎన్‌ఆర్‌ఐకు 15శాతం కోటా విధించింది. ఎన్‌ఆర్‌ఐ అభ్యర్థులు లేకుంటే, వారి స్థానంలోని సీట్లనూ బి.కేటగిరి కింద భర్తీ చేసుకునేలా వెసులుబాటు కల్పించింది. ఈ సీట్ల ప్రక్రియ మొత్తం మెరిట్ ఆధారంగా నిర్వహించాలని ఏపీఈఏపీసెట్ కన్వీనర్ దిశానిర్దేశం చేసింది. ఆయా అభ్యర్థుల ఇంటర్ మార్కులు/ఏపీఈఏపీసెట్ ర్యాంకు/జేఈఈ మెయిన్స్ స్కోరింగ్‌లలో ఏదొకటి పరిగణలోకి తీసుకుని ప్రతిభా జాబితాను ఆయా కళాశాలల యాజమాన్యం రూపొందించాలి. ఈ కోటాలో సెప్టెంబరు 28వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభమై, ఈనెల 10వ తేదీతో ముగియనున్నాయి. 15వ తేదీన ఎంపిక జాబితాను ప్రకటించాలి. జాబితాలో పేర్లున్న అభ్యర్థులంతా ఈనెల 17వ తేదీలోగా వెబ్ పోర్టల్‌లో డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు రాని అభ్యర్థులంతా బి.కేటగిరి సీట్లపై దృష్టి సారించారు.

వెబ్‌సైట్లో ఖాళీల వివరాలు

కేటగిరి-బి సీట్ల వివరాలను వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచారు. ఉస్మానియా యూనివర్సిటీ(ఓయూ), ఆంధ్రా యూనవర్సిటీ(ఏయూ), శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్వీయూ), స్టేట్ వైడ్ (ఎస్‌డబ్ల్యు), ప్రభుత్వ, ప్రైవేట్, సెల్ఫ్ ఫైనాన్స్‌కు చెందిన 187 కళాశాలల్లో కేటగిరి-బి సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిని ప్రతిభ ఆధారంగా జాబితాను రూపొందించాలని ఏపీఈఏపీసెట్ కన్వీనర్ దిశానిర్దేశం చేసినప్పటికీ, చాలా కళాశాలలు బేఖాతరు చేస్తున్నట్లు తెలుస్తున్నాయి. తొలి విడత కౌన్సెలింగ్ ప్రారంభం కాకముందే, విద్యార్థులను కేటగిరి-బి కింద సీట్లను భర్తీ కోసం కళాశాలల యాజమాన్యం అడ్వాన్స్ తీసుకున్నట్లు సమాచారం. అందులో చాలా మంది విద్యార్థులకు ఇతర కళాశాలల్లో కన్వీనర్ కోటా కింద సీట్లు పొంది, వెళ్లేందుకు సిద్ధమవగా, వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తొలుత కేటగిరి-బీలో నమోదైన కళాశాలల యాజమాన్యం నుంచి ఒత్తిడి వస్తోంది. తమ కళాశాలలోనే చేరాలంటూ పట్టుపడుతున్నారు. కేటగిరి-బి జాబితాను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసేలా కన్వీనర్ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

కర్ణాటకలో ఓలా, ఉబర్, ర్యాపిడోపై నిషేధం!

బెంగళూరు: యాప్ ఆధారిత ఓలా, ఉబర్, ర్యాపిడో కంపెనీలకు కర్ణాటక ప్రభుత్వం షాకిచ్చింది. రాబోయే మూడు రోజుల్లో ఆటో సర్వీసులను నిలిపివేయాలని ఆదేశించింది. చార్జీలు అధికంగా వసూలు చేస్తున్నారంటూ వినియోగ దారుల నుంచి ఫిర్యాదులు అందడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మొదటి రెండు కిలోమీటర్ల వరకు రూ.30 ఛార్జి వసూలు చేయాలి. ఆపై ప్రతి రెండు కిలోమీటర్లకు రూ.15 చొప్పున తీసుకోవాలి. అయితే, ఈ యాప్స్ తొలి రెండు కిలోమీటర్లకే రూ.100 వరకు ఛార్జ్ చేస్తున్నట్లు వినియోగదారుల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో నిబంధనలకు విరుద్ధంగా ఆటో రిక్షాలను నడుపుతున్నారంటూ ఆయా కంపెనీలకు ప్రభుత్వం నోటీసులు పంపింది. మూడు రోజులు సేవలను నిలుపుదల చేయాలని ఆదేశాలిచ్చింది. రవాణా శాఖ నిబంధనల ప్రకారం కేవలం కార్లను మాత్రమే ట్యాక్సీలుగా నడపాలి. ఆటో రిక్షా సేవలను అందించడం నిబంధనలకు విరుద్ధం.

పౌరహక్కుల పరిరక్షణకు నోబెల్ శాంతి

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండు చేశారు. యుద్ధ నేరాలు, మానవహక్కుల ఉల్లంఘనలు, అధికార దుర్వినియోగం గురించి డాక్యుమెంట్ చేయడానికి వారు కృషి చేశారు.. శాంతి, ప్రజాస్వామ్యం కోసం పౌర సమాజం ప్రాముఖ్యతను సంయుక్తంగా ప్రదర్శించారు అని అన్నారు. శాంతి పురస్కారగ్రహీతలు వారి దేశాలలో పౌర సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తారని, ప్రాథమిక హక్కులను పరిరక్షిస్తారని చెప్పారు. ఇప్పటికే వైద్య శాస్త్రం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, సాహిత్య రంగంలో నోబెల్ విజేతల పేర్లను ప్రకటించారు. నోబెల్ పురస్కారం రూపేణ విజేతలకు 10 మిలియన్ స్వీడిష్ క్రౌన్లు (9 లక్షల డాలర్లు)ను అందజేస్తారు. స్వీడిష్ ఆవిష్కరణకర్త, ఇంజినీర్, వ్యాపారవేత్తగా పేరుగాంచిన ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి అవార్డును ప్రదానం చేయడం ఆనవాయితీ.

ఐక్యతతోనే బీజేపీకి అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ పార్టీలు కలిసే పరిస్థితి లేదని, కాంగ్రెసేతర ప్రతిపక్షాలు కలవాలని కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు పార్టీల మధ్య అవగాహన సాధ్యం కాదని, ఎందుకంటే ప్రతిపక్ష పార్టీలలో ఎవరికి వారే ప్రధాని అభ్యర్థులని చెప్పారు. గతంలో యునైటెడ్ ఫ్రంట్ లాగా ఎన్నికల తరువాత అవగాహన సాధ్యమని చెప్పారు. సమస్యలపై విద్యార్థి, యువజన, మహిళా సంఘాలు పోరాటాలు కొనసాగించాలని, హిందూత్వ కార్డుకు వ్యతిరకంగా ప్రజలను చైతన్యపరచాలని, దేశంలో మార్పు కోసం ప్రతిఘటనా పోరాటం చేయాలని, ఇలా ముప్పేట దాడి చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. ప్రజాపోరాటాల ద్వారానే బీజేపీ వ్యతిరేక కూటమి ఏర్పాటు సాధ్యమని, ఇందులో వామపక్షాలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.

పోరాటానికి ఇదే చివరి అవకాశం: శ్రీనివాస్

ప్రజలను యంత్రాలుగా మార్చి, వారే ప్రభుత్వాలకు సమ్మతి ఇచ్చే విధంగా జరుగుతున్న పరిణామాలను ఇప్పుడు కాకపోతే ఎప్పటికీ ఆపడం సాధ్యం కాదని, పోరాటం చేయకుంటే కనీసం సమావేశాలు పెట్టుకునే పరిస్థితి కూడా ఉండబోదని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. ఇదే చివరి అవకాశమని, దీనిని ఉపయోగించుకోకపోతే ఈ కాలం ఒక గొప్ప అవకాశాన్ని కోల్పోతుందని హెచ్చరించారు. ఫాసిజంలో సామాన్యులపై జరిగే దుర్మార్గానికి వారే సమ్మతిని ఇస్తారని తెలిపారు. నల్లధనం కోసమే నోట్లు రద్దు చేశామని పాలకులు చెప్పారని, ఎంత నల్లధనాన్ని వెలికితీశారో ఇప్పటికీ చెప్పలేదని ఆయన అన్నారు. వ్యవస్థపైనా, వ్యక్తులపైనా జరిగే దాడులకు సమ్మతి ఉన్నట్లు మనుషులు మారిపోతున్నారని తెలిపారు. మన భావజాలాన్ని, విశ్వాసాలను సమూలంగా మార్చేస్తారని, మైనారిటీలపై దాడులు చేస్తున్నారని, మైనారిటీల నుంచి మెజారిటీ ప్రజలకు ప్రమాదం ఉందంటూ హిందువులను అభద్రతకు గురిచేస్తూ పాలకులు విభజనకు పాల్పడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజలకు వ్యతిరేకత ఉన్నప్పటికీ, మోదీపై ప్రజలకు ద్వేషం ఉండదని, ఆయన ఏది చేసినా దేశం కోసమనే నమ్ముతున్నారని, ఇది ఫాసిజానికి దారితీస్తుందన్నారు. అభ్యుదయ, ప్రగతిశీల, వామపక్ష భావాలు కలిగినవారు ప్రతిస్పందిస్తున్నారు తప్ప...అవతలి వారు రాజకీయ కథనాన్ని అందిస్తున్నారనేది గుర్తించాలని అన్నారు. ఇది కేవలం రాజకీయ, ఆర్థిక సమస్య కాదని, సాంస్కృతిక, మనుషుల మధ్య విశ్వాసానికి సంబంధించిన అంశాలుగా గుర్తించాలన్నారు. రాజకీయ పార్టీలైతే కొన్ని సమస్యలు రావొచ్చునని, మేధావుల స్థాయిలో విశాల వేదిక ఏర్పాటు చేసి, రాజకీయ పక్షాలకు మార్గదర్శనం చేయాల్సిన అవసరం ఉన్నదని కె.శ్రీనివాస్ పేర్కొన్నారు.

ప్రధాన మీడియాలో వార్తలు రావు: శ్రీనివాస్‌రెడ్డి

కార్పొరేట్ సంస్థలకు వ్యతిరేకంగా ప్రధాన పత్రికలు, టీవీలలో ఒక్క వార్త కూడా రాదని ప్రజాపక్షం ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. దేశంలో ప్రస్తుతం ఉన్న ప్రధాన వార్తాపత్రికలు, వార్తా ఛానళ్లు, ఆన్ డిజిటల్ మీడియా సంస్థల్లో మెజారిటీ మీడియా అంబానీ, ఇతర బడా కార్పొరేట్ చేతుల్లోనే ఉన్నాయన్నారు. 1990లలో సరళీకృత ఆర్థిక విధానాల ప్రవేశం తరువాతనే మీడియాలో ప్రైవేటు, విదేశీ పెట్టుబడుల ప్రాబల్యం పెరిగిపోయిందన్నారు. వాస్తవాలను ప్రజలకు చూపించేందుకు ఇప్పటికీ కొందరు సోషల్ మీడియా ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారని, నిబద్ధత, పట్టుదల, ధైర్యం ఉంటేనే అది సాధ్యమని చెప్పారు.

కళ్లు తెరవని కేంద్రం: డి.పాపారావు

ఆర్థిక సరళీకృత విధానాలతో ప్రపంచం మొత్తం మునిగిపోయినా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరవడం లేదని ప్రముఖ ఆర్థిక విశ్లేషకుడు డి.పాపారావు అన్నారు. ఆర్థిక సరళీకరణ విధానాలు అవలంబించిన అమెరికా, పశ్చిమ దేశాలు దివాలా తీశాయన్నారు. బీజేపీ సిద్ధాంతాలు ధనికులు, పెట్టుబడిదారులు, బహుళజాతి కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయని విమర్శించారు. అది కూడా ఒకరిద్దరు ఆశ్రిత పెట్టుబడిదారులకు అనుకూలంగానే విధానాలు ఉన్నాయని, దీంతో ఇతర పెట్టుబడిదారుల నుండి తిరుగుబాటు వస్తుందన్నారు. ముంబైలో విద్యుత్ కాంట్రాక్టును అదానీకి కేటాయించడంపై టాటాలు కేసు వేసిన విషయాన్ని ఉదహరించారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ప్రజలలో కొనుగోలు శక్తి తగ్గిపోయిందని, పేదలు, సామాన్యులకు కొనుగోలు శక్తి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కింది వాళ్లు లేకుంటే పైవాళ్లు ఉండరనే విషయాన్ని పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. మధ్య తరగతి, కార్మిక వర్గాన్ని ప్రభుత్వం వదిలేసిందని విమర్శించారు. ఇలాంటి నిర్ణయాలతో నిరుద్యోగం పెరుగుతుందని, ఆర్థిక అసమానతలు పెరిగిపోతాయని తెలిపారు.

నిధుల కోసం సర్పంచ్‌ల ఆందోళన

విశాలాంధ్ర-తాడేపల్లి: రాజ్యాంగం ప్రకారం స్థానిక సంస్థలకు రావాల్సిన నిధుల కోసం పంచాయతీ సర్పంచ్‌లు రోడ్డెక్కారు. ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.8వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించింది. విద్యుత్ బకాయిల పేరుతో జమ చేసుకోవడానికి జీఓలు జారీ చేసింది. పంచాయతీల అనుమతి లేకుండా తీసుకున్న ఈ చర్యను వ్యతిరేకిస్తూ...మళ్లించిన మొత్తాన్ని విడుదల చేయాలని కోరుతూ పదేపదే చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం బేఖాతరు చేసింది. దీంతో మరోమార్గం లేక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి శుక్రవారం తాడేపల్లిలోని పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయానికి వందలాది మంది సర్పంచ్‌లు చేరుకున్నారు. వీరితో మాట్లాడి సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు దానికి భిన్నంగా వ్యవహరించారు. ఏం చేస్తారో చేసుకోండి అంటూ సర్పంచ్‌లను కనీసం కార్యాలయంలోకి కూడా రానీయకుండా పోలీసులతోఅడ్డుకున్నారు. బలవంతంగా అరెస్ట్‌లుచేసి లారీల్లో తరలించారు. దీంతో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తమకు నిధులు ఇవ్వాలని, లేనిపక్షంలో పదవుల నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని సర్పంచ్‌లు ముట్టడించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న పోలీసులు సర్పంచ్‌లను అడ్డుకున్నారు. నిధుల విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు కదిలేది లేదంటూ సర్పంచులు కృష్ణమోహన్, చిలకలపూడి పాపారావు, మనోహర్, సాంబశివరావు, అప్పిరెడ్డి, శ్రీకాంత్, ఝాన్సీ, ఉమాదేవి, అల్లాభక్షు, సీతారామిరెడ్డి, శ్రీనివాసరావుతోపాటు 100 మందికిపైగా రోడ్డుపైనే బైఠాయించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ సచివాలయాల నుండి ప్రజలకు డబ్బులు వేస్తున్నామని చెబుతున్నారని, కానీ పంచాయతీల్లో రోడ్లను పట్టించుకోవడం లేదని, ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు ఇవ్వబోమని చెబితే అసలు పోటీయే చేసేవాళ్లం కాదని, ఎన్నికల్లో గెలిచిన తరువాత ఇప్పుడు ఇలా చేయడం ఏమిటని ప్రశ్నించారు. సొంత నిధులతో ప్రభుత్వ కార్యక్రమాలు చేయలేమని, చెత్త ఎత్తేవాళ్లకు కూడా నిధులు లేకపోవడంతో వారూ రెండు నెలలుగా పనులకు రావడం లేదని సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ నిధులు ఇవ్వకపోతే పంచాయతీల్లో పనులు ఏమీ చేయొద్దని ఆదేశాలన్నా ఇవ్వాలని కోరారు. అదీ సాధ్యం కాకపోతే ప్రత్యేక అధికారులను పెట్టుకుని పాలన చేసుకోవాలని డిమాండు చేశారు. తమను పదవుల్లో నుండి తొలగించాలని కోరారు. ఆ సమయంలో అక్కడకు చేరుకున్న పంచాయతీరాజ్ అసిస్టెంట్ కమిషనర్ సర్పంచ్‌ల సమస్యలు వినడానికి బదులుగా 'ఏం దబాయిస్తున్నారా... డబ్బులు ఇవ్వకపోతే ఏంటి? ఏం చేస్తారో చేసుకోండి' అంటూ మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలకు నిరసనగా కార్యాలయంలోకి దూసుకెళ్లేందుకు సర్పంచ్‌లు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా రోడ్డుపైకి లాక్కొచ్చి లారీల్లో ఎక్కించారు. కొంతమంది సర్పంచులైతే ప్రభుత్వ తీరుకు నిరసనగా స్వచ్ఛందంగా అరెస్టు అయ్యి తమ నిరసన వ్యక్తం చేశారు. అరెస్టు చేసిన వారిని మంగళగిరి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

సర్పంచ్‌ల అరెస్టు తగదు: శ్రీనివాసరావు

గ్రామ పంచాయితీలకు కేటాయించిన నిధులను వెంటనే పంచాయితీలకు బదిలీ చేయాలని డిమాండ్ చేస్తూ, ఆందోళనకు దిగిన సర్పంచ్‌లను అరెస్టు చేయడాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల నిధులను మళ్లించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

రాత్రి 11 గంటల వరకు మెట్రో సర్వీసులు

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్ మెట్రో సర్వీసుల వేళలను పొడిగించారు. ఇక నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. ఈనెల 10వ తేదీ నుంచి ఈ సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉండనున్నట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం చివరి మెట్రో రాత్రి 10:15 గంటల వరకే అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని 11 గంటల వరకు పొడిగించడంతో.. ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా వాట్సాప్ ద్వారా మెట్రో ప్రయాణానికి సంబంధించిన టికెట్ బుక్ చేసుకునే సేవలను ఇటీవలే ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఎల్ అండ్ టీ హైదరాబాద్ మెట్రో రైలు సీఈఓ, ఎండీ కెవీబీ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.

రోడ్లు బాగు పడాలి

- మార్చి 31, 2023 తుది గడువు
- ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం పక్కాగా అమలు
- అన్ని మున్సిపాల్టీల్లో చెత్త శుద్ధికి చర్యలు
- ప్రతి నియోజకవర్గంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ లేఔట్
- పురపాలక సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్రవ్యాప్తంగా వచ్చే ఏడాది 31వ తేదీకల్లా రోడ్లన్నీ బాగు చేయాలని ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారులకు గడువు విధించారు. ప్రస్తుతం వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున పట్టణాలు, నగరాల్లో రోడ్ల పరిస్థితిని పరిశీలించి, వాటికి కూడా తక్షణ మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖపై క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నగరాల్లో పరిశుభ్రత, వేస్ట్ మేనేజ్‌మెంట్, మురుగునీటి శుద్ధి, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్, నగరాలు, పట్టణాల్లో సుందరీకరణ పనులు, పచ్చదనంపెంపు, టిడ్కో ఇళ్లు, వైయస్సార్ అర్బన్ క్లినిక్స్, జగనన్న స్మార్ట్‌టౌన్‌షిప్స్ తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... రహదారుల అభివృద్ధితోపాటు మున్సిపాల్టీల వారీగా చెత్త శుద్ధిచేసే ప్రక్రియలో ఉన్న సౌకర్యాలు, వసతులు, మురుగునీటి శుద్ధి వంటి అంశాల్లో కల్పించాల్సిన మౌలికసదుపాయాలపై నివేదికలు తయారు చేయాలని సూచించారు. ప్రతి మున్సిపాల్టీలో వ్యర్థాల శుద్ధి ప్రక్రియల అమలు తీరును పరిశీలించాలన్నారు. గార్బేజ్ స్టేషన్ల కారణంగా పరిసరాల్లోని ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఏమాత్రం ఉండకూడదని స్పష్టం చేశారు. ఇలాంటి చోట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వహణలో ఎలాంటి స్వచ్ఛ ప్రమాణాలు పాటిస్తున్నామన్నదానిపై అవగాహన కల్పించాలన్నారు. గార్బేజ్ స్టేషన్ల నిర్వహణలోనూ అత్యుత్తమ విధానాలు పాటించాలని, మురుగునీటి శుద్ధి, వేస్ట్ మేనేజ్‌మెంట్‌లలో ప్రతి మున్సిపాల్టీ సంపూర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. కృష్ణానది వరద ముంపు రాకుండా యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం రిటైనింగ్ వాల్ నిర్మించిందని, ఆ గోడ వెంబడి మురుగునీరు చేరకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే రిటైనింగ్ వాల్ బండ్‌ను చెట్లు, విద్యుత్ దీపాలు, ఏర్పాటుచేసి అందంగా తీర్చిదిద్దాలని చెప్పారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలను రాష్ట్ర ప్రభుత్వం నిషేధించినందున దీన్ని సంపూర్ణంగా అమలు చేయడానికి సంబంధిత వ్యాపారులతో కలెక్టర్లు సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్లాస్టిక్ నుంచి క్లాత్ వైపు మళ్లడానికి కావాల్సిన ఆర్థిక వనరులను సమకూర్చుకునేందుకు వారికి సహాయం చేయాలని, అవసరమైతే వారికి రుణాలు ఇప్పించాలన్నారు. అలా ఇప్పించిన రుణాలను సకాలంలో కట్టేవారికి ప్రభుత్వం నుంచి వడ్డీ రాయితీ కల్పించాలని అధికారులకు సూచించారు. జగనన్న కాలనీల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాలను తప్పక ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.పెద్ద కాలనీలు నిర్మాణం పూర్తయ్యే కొద్దీ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన దిశగా ముందుకు సాగాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో తాగునీరు, డ్రైనేజీ, కరెంటు ఏర్పాటుచేసి తర్వాత మురుగునీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. విజయవాడ నుంచి గన్నవరం ఎయిర్ పోర్టుకు వెళ్లే రహదారికి ఇరువైపులా, వీటితర్వాత విశాఖపట్నంలో సుందరీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కార్యక్రమంపై శ్రద్ధపెట్టాలని, ప్రతి నియోజకవర్గానికి ఒక లే అవుట్‌ను తీర్చిదిద్దాలని చెప్పారు. ఈ సమీక్షా సమావేశంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ సమీర్ శర్మ, పురపాలక పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ పి.సంపత్ కుమార్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఏపీయూఎఫ్ఐడీసీ ఎండీ లక్ష్మీషా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏపీకి 11 అవార్డులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్ర ప్రభుత్వం ఇటీవలే ప్రకటించిన స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో ఏపీ ఏకంగా 11 అవార్డులను గెలుచుకుంది. రాష్ట్రంలోని మునిసిపాలిటీలు, నగర పాలక సంస్థలకు ఈ అవార్డులు రాగా దిల్లీలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో ఆయా పురపాలికల అధికారులు, ప్రజా ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. వాటిని తీసుకుని 11 పురపాలికలకు చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు శుక్రవారం తాడేపల్లి వచ్చారు. అవార్డులను పట్టుకుని వారంతా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిశారు. అధికారుల చేతుల్లోని అవార్డులను చూసి జగన్ సంతోషం వ్యక్తం చేశారు. ఒకే ఏడాది రాష్ట్రానికి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 11 అవార్డులు రావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని, భవిష్యత్తుల్లో రాష్ట్రానికి మరిన్ని అవార్డులు తీసుకుని రావాలని సూచించారు. పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, మరో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మునిసిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీలో 3,254 ప్రొసీజర్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేద ప్రజలకు మేలు చేకూరేలా రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15 నుంచి ఆరోగ్యశ్రీ కింద 3,254 ప్రొసీజర్లకు పెంచనున్నట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. విజయవాడ ఆర్‌అండ్‌బీ భవన్‌లో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంత ఖర్చయినా పేద వాళ్లకు వైద్యం అందించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో కేవలం 117 ప్రొసీజర్లకే పెంచిందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ప్రభుత్వం ఏటా రూ.2 వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, ఈ మూడేళ్లలో రూ.6 వేల కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. నాడు 942 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రారంభించారని గుర్తు చేశారు. మెరుగైన వైద్యం అందించడంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. రూ.8 వేల కోట్లతో కొత్తగా 17 వైద్య కళాశాలలను ఆధునీకరించామని తెలిపారు. రాష్ట్రంలో పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, వైసీపీ హెల్త్ క్లినిక్, అర్బన్ హెల్త్ సెంటర్లు, తల్లీబిడ్డ ఆరోగ్య కేంద్రాలు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీ తదితర వాటి ద్వారా వైద్యం అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. వైద్య రంగాభివృద్ధికి జగన్ ప్రభుత్వం చేస్తున్న కృషిని ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. ఈ సమావేశంలో వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, కమిషనర్ జె.నివాస్, ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మూడు రాష్ట్రాల బిల్లు తీసుకురండి

బహుజన జేఏసీ బాలకోటయ్య ఎద్దేవా

సీఎం జగన్‌కు లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర ముఖ్య మంత్రి, మంత్రులు ఉవ్విళ్లూరుతున్నట్లు మూడు రాజధానులు కట్టుకోవడానికి మూడు రాష్ట్రాల బిల్లు తీసుకురావాలని ఎద్దేవా చేస్తూ అమరావతి బహుజన జేఏసీ కన్వీనర్ పోతుల బాలకోటయ్య శుక్రవారం సీఎం జగన్‌కు లేఖ రాశారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు, మహిళలు చేస్తున్న అరసవల్లి పాదయాత్రను పురస్కరించుకొని మీరు, మీ మంత్రి వర్గ అనుచరులు రాజధాని పైనా, తద్వారా మధ్యాంధ్ర ప్రాంతం పైనా దాడికి, విష ప్రచారానికి శ్రీకారం చుట్టారు. అమరావతి నిర్మాణం జరిగితే, లక్షల కోట్లు అమరావతిలోనే ఖర్చు చేయాలని, అమరావతి ఒక్కటే బాగుపడుతుందని, అమరావతి ప్రాంత రైతులు స్వార్థపరులని, ఇతర ప్రాంతాలు బాగుపడితే చూసి ఓర్వలేరన్న రీతిలో మంత్రుల చేత వికేంద్రీకరణ రౌండ్ టేబుల్ మీటింగులు పెట్టారు. దండయాత్ర, శవయాత్ర, రాజకీయ యాత్ర, స్వార్థపరుల యాత్ర, వ్యాపారుల యాత్ర పేర్లతో మేము ఏపీలో లేము అన్నట్టుగా మాట్లాడుతున్నారు. రేపో మాపో ఉత్తరాంధ్ర, రాయల సీమ జేఏసీలు ఏర్పాటు చేసి ఆ రెండు ప్రాంతాలను మా మధ్యాంధ్ర ప్రాంతం పైకి ఉసిగొలిపే పనిలో నిమగ్నమయ్యారు. అమరావతి ఎలా నిర్మాణమైందో, దానికి భూముల్ని రైతులు ఎలా ఇచ్చారో, నాటి అసెంబ్లీ తీర్మానానికి మీరు మద్దతు ఎలా పలికారో, 2019 ఎన్నికలకు ముందు రాజధాని గూర్చి మీరు ఏం చెప్పారనే అంశాలను నేను ప్రస్తావించదల్చుకోలేదు. రాజధాని ఉద్యమం ఎన్ని రోజులుగా జరుగుతోందో, మహిళలు పడే కన్నీటి అవస్థలు ఏమిటో, న్యాయస్థానం ఇచ్చిన తీర్పు, మూడు రాజధానుల బిల్లును వెనక్కి తీసుకోవడం, సీఆర్డీఏ ఒప్పందాన్ని అమలు చేస్తామన్న అఫిడవిట్ దాఖలు, సుప్రీం కోర్టులో పిటిషన్ వంటి విషయాలను కూడా గుర్తు చేయదలుచుకోలేదు. విభజింపబడ్డ రాష్ట్రానికి ఒక రాజధాని ఉంటే చాలు అన్నది రాష్ట్ర ప్రజలందరి కోరిక. అది విజయవాడ,గుంటూరు జంట నగరాల మధ్య ఉంది. గతంలో వలే ఇప్పుడు మీరు మళ్లీ విజయవాడకు రాజధాని భాగ్యం కలగకూడదని కంకణం కట్టుకున్నారు. అధికార బలంతో మూడు ప్రాంతాల మధ్య చిచ్చు రగిల్చారు. ఆ మంటల్లో మొత్తం రాష్ట్రాన్నే తగలబెడుతున్నారు. రాష్ట్రాలను విభజించాలన్నా, కలపాలన్నా కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 3 ద్వారా చేయవచ్చు. ఈ విషయం మీకే బాగా తెలుసు. మీకు 151సీట్ల బలం అసెంబ్లీలోను, 32 మంది ఎంపీలు పార్లమెంట్లోనూ ఉన్నారు. ఆ బలం ఉపయోగించి అసెంబ్లీలో మూడు రాజధానులకు బదులుగా మూడు రాష్ట్రాల బిల్లు పెట్టి కేంద్రానికి పంపి వారిని ఒప్పించండి. తద్వారా మూడు రాష్ట్రాలు చేసిన ఘన చరిత్ర మీ సొంతం అవుతుందని బాలకోటయ్య ఆ లేఖలో పేర్కొన్నారు.

భారత్‌ను పటిష్ఠం చేసిన 'ఆత్మ నిర్భర్ భారత్'

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజాస్వామ్య యుగంలో శాంతియుత మార్గాల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశం ఈ విషయంలో నాయకత్వ పాత్ర పోషిస్తుందని రాష్ట్ర గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ అన్నారు. ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో) నిర్వహిస్తున్న ఉపన్యాసాల పరంపరలో భాగంగా "స్వాతంత్ర్య పోరాటం, ప్రగతిశీల భారతదేశం ఏ75" అనే అంశంపై గవర్నర్ న్యూదిల్లీలోని ఇగ్నో మైదాన్ గర్హిలోని అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్లో శుక్రవారం ప్రసంగించారు. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య సయోధ్య కోసం మన ప్రధాని ప్రయత్నించారని హరిచందన్ వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జరుపుకుంటున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ప్రజలలో దేశభక్తిని పునరుజ్జీవింపజేసిందన్నారు. ఆర్థికంగా, సైనికపరంగా భారత్ బలమైన దేశంగా గర్విస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, సహ ఉప కులపతులు ప్రొఫెసర్ సత్యకం, ప్రొఫెసర్ ఉమా కంజిలాల్, ప్రొఫెసర్ మన్రూప్ సింగ్ మీనా, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఈ, ఐఎస్ఈ అసోసియేషన్ కార్యదర్శిగా ఆంథోని సుందరి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల ఐసీఎస్, ఐఎస్ఈ పాఠశాలల అసోసియేషన్ కార్యదర్శిగా తెలంగాణలోని హైదరాబాద్‌కు చెందిన ఆంథోని సుందరి ఎంపికయ్యారు. ఆమె హైద్రాబాద్ మలక్‌పేటలోని ఆస్మన్ ఘడ్ ప్యాలెస్‌లోని సెయింట్ జోసఫ్ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సుందరి ఎంపికపై విద్యావేత్తలు, పాఠశాలల నిర్వాహకులు అభినందించారు.

సీఎంతో ఐఏఎస్ ప్రొబేషనర్ల భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఐఏఎస్ బ్యాచ్-2021కి చెందిన తొమ్మిది మంది ప్రొబేషనరీ అధికారులు పాలనాపరమైన అవగా హన పెంచుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులను కలిసి వారి సూచనలు, సలహాలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసేలా పనిచేస్తూ, సామాన్యుడికి సైతం అందుబాటులో ఉంటూ ముందుకు సాగా లని సీఎం దిశానిర్దేశం చేస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

సీఈవోతో....: అనంతరం వారు అమరావతి సచివాలయం ఐదో బ్లాక్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాను కలిశారు. ఐఏఎస్ అధికారుల ప్రొబేషన్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా అంశాలపై అవగాహన పెంపొందించేందుకుగాను సీఈవోతో ప్రొబేషన్ అధికారులు పి.ధాత్రిరెడ్డి, స్వరూప్, ప్రఖర్, జైన్, జి.విద్యాధరి, శివన్నారాయణ శర్మ, అశుతోష్, శ్రీవాస్తవ, అపూర్వ భరత్, రాహుల్, మీనా, ప్రశాంత్ కుమార్ తదితరులు భేటీ అయ్యారు. రాష్ట్రంలో కొన సాగుతున్న ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ విధానాన్ని సీఈవో వారికి వివరించారు. సీఈవోతోపాటు రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం తాడి కొండలో ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారుల బృందం పర్యటించింది. ఓటర్ల నమోదు, జాబితా సవరణ ప్రక్రియ వివరాలను తెలుసుకుంది. ఈ పర్యటనలో డిప్యూటీ సీఈవో వెంకటేశ్వరరావు, తాడికొండ తహసీల్దార్ ఫణీంద్రబాబు పాల్గొన్నారు.

'చేనేత' సంక్షోభానికి ప్రభుత్వ విధానాలే కారణం: జింకా చలపతి

విశాలాంధ్ర-ధర్మవరంటౌన్: ప్రభుత్వ అనాలోచిత విధానాల పర్యావసానమే చేనేత పరిశ్రమ సంక్షోభానికి గురైందని, చేనేత కార్మికుల బలవన్మరణాలకు కారణమైందని ఏపీసీకేఎస్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకా చలపతి ఆరోపించారు. శుక్రవారం"ప్రొటెక్ట్ హ్యాండ్లూమ్ సేవ్ హ్యాండ్లూమ్ వీవర్స్' పేరుతో పట్టణ పురవీధుల్లో చేనేత చైతన్య యాత్ర నిర్వహించారు. తొలుత నేతన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఇంటింటా తిరుగుతూ, కరపత్రాలను పంపిణీ చేస్తూ, చేనేత పరిశ్రమను కాపాడుకోవడంపై చేనేత కార్మికులకు అవగాహన కల్పించారు. పట్టణంలో 11 కుటుంబాలు చేనేత పై ఆధారపడి జీవిస్తున్నాయని, కొంతమంది యజమానులు పవర్ లూమ్స్ మగ్గాలు వేసి చేనేత చట్టాన్ని యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా, కలెక్టర్ పట్టించుకోవడం లేదనీ, పవర్లూమ్స్ యూనియన్ లీడర్‌గా వ్యవహరించడం తగదన్నారు. చేనేత చట్టం అమలుకు ఏమాత్రం నోచుకోలేదని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. చేనేత కార్మికులు సంఘటితం కావాల్సిన సమయం ఆసన్నమైనదని, ప్రభుత్వ అధికారుల కళ్లు తెరిపించడానికి, ఈ చేనేత చైతన్య యాత్రలను చేపట్టినట్లు వారు తెలిపారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కోరుతూ రాష్ట్రపతికి పోస్టు కార్డులు కూడా పంపామన్నారు. చేనేతపై జీఎస్టీని రద్దు చేయాలని, ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ధర్మవరంలోనే ఏర్పాటు చేయాలని, ప్రతి చేనేత కార్మికునికి ముద్ర రుణం కింద లక్ష రూపాయలు ఇవ్వాలని, మగ్గం ఉన్న ప్రతి ఇంటికి 150 యూనిట్లు ఉచిత విద్యుతు ఇవ్వాలని, ఆత్మహత్యలు చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా, సిల్క్ సబ్సిడీ పునరుద్ధరణ, అర్హులైన చేనేత కార్మికుల కుటుంబాలకు మూడు సెంట్లు స్థలం ఇచ్చి, ప్రభుత్వమే ఇల్లు నిర్మించి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ యాత్రలు 2023 ఆగస్టు 7 వరకు జరుగుతాయన్నారు. చేనేత కార్మిక సంఘం తాలూకా కార్యదర్శి వెంకటనారాయణ, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యవర్గ సభ్యుడు ఆదినారాయణ, శ్రీధర్, బాల రంగయ్య, గంగాధర, నాగభూషణ, శివ, శ్రీనివాసులు, నాగరాజు, రాజా, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జీ అప్పారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, కార్యదర్శి కేవీవీ సత్యనారాయణను ఉద్యోగుల సంఘం నేతలు కలిసి 40 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఎస్ ఉద్యోగుల పదవీ విరమణ/మరణాంతరం విడుదలవ్వాల్సిన ఎక్యుములేటెడ్ పెన్షన్ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను, సెంట్రల్ సివిల్ సర్వీసెస్ రూల్స్-2021ను అనుసరించి 50శాతం ఉద్యోగుల వాటాకు చెందిన పెన్షన్‌ను ఉద్యోగుల కుటుంబీకులకు విడుదల చేయాలన్నారు. తాము ఈనెలలో 26జిల్లాల్లో పర్యటించి, ఉద్యోగ సంఘాలతో సంయుక్త సమావేశాలు నిర్వహించి, వారితో చర్చించాక ఉద్యోగ సంఘాలతో చర్చించిన అనంతరం, సమస్యల విధివిధా నాలపై సమగ్ర కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్, అడిట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిశంకర్, ప్రధాన కార్యదర్శి అబ్రహామ్, కిశోర్, హరి పాల్గొన్నారు.

ఎన్ని కష్టాలు వచ్చినా ఉక్కు ఉద్యమం ఆగేదేలేదు

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటకమిటి అధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో 603 వరోజు రిలే నిరాహార దీక్షలో సింటర్ ప్లాంట్ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ చైర్మన్ డి ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్లాంటు ప్రభుత్వ రంగంలో కొనసాగే వరకు ఎన్ని కష్టాలు వచ్చినా ఉక్కు ఉద్యమం ఆగేదిలేదని స్పష్టం చేశారు. ఈనెల 18వ తేదీ నుంచి 21 వరకు అనంతపురం దగ్గర్లో జరుగుతున్న భారత్ జూడో యాత్రకు వస్తున్న కాంగ్రెస్ జాతీయ నాయకులు రాహుల్ గాంధీని కలిసి విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకోవాలని పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని విజ్ఞప్తి చేసేందుకు వందలాది మంది ఉక్కు కార్మికులు అనంతపురం వెళ్లడానికి సన్నద్ధమవుతున్నారని తెలిపారు. గత పార్లమెంటు సమావేశాల్లో భారతదేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను లోక్‌సభ, రాజ్యసభల్లో ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లను కలిసి విశాఖ ఉక్కును ఆదుకోవాలని కోరి వినతిపత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో అనివార్య కారణాల వల్ల (కరోనా)రాహుల్ గాంధీ గారిని కలవలేక పోయామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మల్లిఖార్జున్ ఖర్గే, వేణుగోపాల్ , శశి థరూర్, జెడి శీలం తదితర నాయకులు కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని కోరామనిచెప్పారు. రాహుల్ గాంధీని కల్పించే ఏర్పాట్లు చేస్తున్న పీసీసీ అధ్యక్షులు శైలజానాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలో కొనసాగిస్తున్నామని, గనులు కేటాయిస్తామని పార్లమెంటులో ప్రకటనచేసే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు , రామకృష్ణ పరంధామయ్య గుమ్మడి నరేంద్ర,దాసరి శ్రీనివాస్, సత్యనారాయణ ఏ వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, పి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రూ.86 కోట్లతో మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం

ఏడాదిలో పూర్తి: విడదల రజిని

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కానూరి రామచంద్రరావు జింఖానా మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని ఏడాది కాలంలో పూర్తిచేసి ప్రజల కలలను సాకారం చేస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) ఆవరణలో రూ.86 కోట్లతో నిర్మించనున్న కానూరి రామచంద్రరావు జింఖానా మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రానికి మంత్రి రజని శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంసీహెచ్ నిర్మాణం ఆగిపోయిందని అనేక విజ్ఞప్తులు తనవద్దకు వచ్చాయని, అయితే తాను వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత ఎంసీహెచ్ నిర్మాణం పూర్తి చేసేందుకు జింఖాన ప్రతినిధులతో మాట్లాడానని, ముఖ్యమంత్రి జగన్ పేద ప్రజలకు వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని రజని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాడు-నేడు కింద రూ.16కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. జింఖానా సేవలు అభినందనీయమని, డాక్టర్ ఉమా గవిని రూ.20కోట్లు, మొవ్వ వెంకటేశ్వరరావు రూ.20కోట్లతో పాటు అనేకమంది దాతలు ముందుకు వచ్చి విరాళాలను అందించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ పేద ప్రజలకు వైద్యాన్ని అందించడమే ప్రధాన లక్ష్యంగా సీఎం జగన్ చిత్తశుద్ధితోపని చేస్తున్నారని చెప్పారు. తన నియోజకవర్గంలో ఈ ఆసుపత్రి అభివృద్ధి సాధించడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ కరోనా రోగులకు వైద్యులు అందించిన సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రభుత్వ విప్ జంగా కృష్ణమూర్తి జింఖానా సేవలను కొనియాడారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి స్వాగత ఉపన్యాసం చేశారు. జింఖానా ప్రతినిధులు డాక్టర్ బాలభాస్కర్, డాక్టర్ గడిపూడి వేణుగోపాల్‌లను మంత్రి రజిని, ఎమ్మెల్యే ముస్తఫా శాలువాకప్పి ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కేఎస్ లక్ష్మణరావు, నగర మేయర్ శివనాగ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధరరావు, మద్య విమోచన ప్రచార కమిటీ చైర్మన్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయం సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, డీఎంఈ డాక్టర్ వినోద్ కుమార్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్ పోతురాజు సమత పాల్గొన్నారు.

మహా ప్రదర్శనకు తరలిరావాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీపీఐ 24వ జాతీయ మహాసభల సందర్భంగా, ఈనెల 14న నిర్వహించనున్న మహాప్రదర్శనకు హమాలీలు తరలిరావాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం రాయనపాడు డిపో వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, దేశంలో మోదీ ప్రభుత్వం అవలంబిస్తున్న మతోన్మాద కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ యావత్తు కార్మిక వర్గం ప్రజానీకం ఉద్యమించాల్సిన అవసరముందన్నారు. మోదీ విధానాల వల్ల దేశం పెద్ద ప్రమాదంలో ఉందని, ఒకవైపు మతోన్మాద శక్తులు ప్రజలు, దళితులు, మైనార్టీలపై దాడులు నిర్వహిస్తూ మరోవైపు ఆర్థిక విధానాలతో ప్రజల జీవన విధానాన్ని అతలాకుతలం చేస్తున్నారని దుయ్యబట్టారు. సీఎం జగన్, ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని గందరగోళపరుస్తున్నారన్నారు. ఈనెల 14న జరగనున్న మహాప్రదర్శనకు ప్రతి ఒక్క హమాలీ కార్మికుడు తరలిరావాలని కోరారు. వివిధ యూనియన్ నాయకులు శ్రీను, మేస్త్రీలు పాల్గొన్నారు.

సంపాదకీయం

ఎన్నికల కమిషన్‌కు తగని పని

రాజకీయ పార్టీలు చేసే వాగ్దానాలు నెరవేర్చడానికి ఎదురయ్యే ఆర్థిక చిక్కులను తెలియజేస్తూ అఫిడవిట్ ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ప్రతిపాదించింది. ప్రభుత్వం చేసే వాగ్దానాలు అమలు చేయడానికి ప్రభుత్వం పైన పడే భారాన్ని గురించి ఓటర్లకు వివరించాలన్నది ఎన్నికల కమిషన్ ప్రతిపాదనలో భాగం. ఈ విషయం ఎన్నికల కమిషన్ పరిధిలో ఉందా? రాజ్యాంగ సంస్థ ఎన్నికల కమిషన్ పార్లమెంటుకు, రాష్ట్రాల అసెంబ్లీలకు వివక్ష లేకుండా స్వేచ్ఛగా, న్యాయంగా ఎన్నికలు నిర్వహించవలసిన బాధ్యత ఉంది. అంతేకానీ సంక్షేమ కార్యక్రమాలు, ఉచితాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించు కుంటాయి. అసలు సంక్షేమ కార్య క్రమాలు, ఉచితాలు వాగ్దానం చేసి అమలు చేయవలసిన పనిలేని స్థితికి మన దేశం చేరిందా? వాగ్దానాలకు ఎంత ఖర్చు చేయవలసి వస్తుందని ఆయా పార్టీలు వెల్లడించాలన్న అంశాన్ని 2015లోనే మోడల్ కోడ్‌లో ఎన్నికల కమిషన్ చేర్చింది. ఇప్పుడు దాన్నొక విధానంగా రూపొందించి అమలు చేయాలని ఎన్నికల కమిషన్ ప్రతిపాది స్తున్నది. ఇటీవల ఉచితాలు రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని, అవి మంచిది కాదని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన తర్వాత దేశ వ్యాప్తంగా చర్చ నీయాంశమైంది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వమే ఒక నిర్ణయాన్ని తీసు కోవాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయిలో జస్టిస్ ఎన్వీ రమణ కూడా వ్యాఖ్యా నించారు. మోదీ ఉచితాల విషయాన్ని ప్రస్తా వించడం ప్రజల దృష్టిని మళ్లించడానికేగానీ ఉచితాలను నిషేధించా లన్నది ఆయన బలమైన ప్రతిపాదన కాదని జరుగుతున్న పరిణా మాలు తెలియజేస్తున్నాయి. ఇంత ముఖ్యమైన అంశాన్ని పార్ల మెంట్‌లో కనీసం చర్చ లేకుండా ఎన్నికల కమిషన్ ప్రతిపాదించడం ఏమిటి? ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా పని చేయ వలసిన సంస్థ కేంద్ర పాలకుల కనుసన్నల్లో పని చేస్తున్నదన్న విమర్శలు ఇటీవల వెల్లువెత్తాయి. ఎన్నికల కమిషన్‌కు ఉండే పరువు, ప్రతిష్ఠలు దిగ జారాయని, రానురాను ప్రజల నమ్మకం కమిషన్ పట్ల సడలిందని గత కొన్నేళ్లుగా అది అనుసరిస్తున్న పద్ధతులు తెలియజేస్తున్నాయి. ఎన్నికల షెడ్యూలు ప్రకటన నుండి, ఎన్నికలు నిర్వహణ, ఓట్ల లెక్కింపు తదితర అన్ని కార్యకలాపాల పైన విమర్శలు వస్తున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా టిఎన్ శేషన్ పనిచేసిన కాలంలో ఆయా పార్టీలు గడగడలాడాయి. ఆయన నిక్కచ్చిగా, నిజాయితీగా ఎన్నికలు నిర్వహించారన్న పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు కమిషన్ తనకుగాని పనిని తలకెత్తుకున్నదని, ఎవరి ప్రయోజనం కోసం ఇలా వ్యవ హరిస్తోందన్న ప్రశ్న తలెత్తుతోంది. అధికారంలోకి వచ్చిన పార్టీ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక పరిస్థితులను ప్రజల జీవన ప్రమాణాలను పరిగణలోకి తీసుకొని బడ్జెట్ రూపకల్పన చేసుకుంటుంది. అలాగే ఎన్నికల ప్రచారంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు, ప్రాజె క్టుల నిర్మాణం, కొన్ని ఉచితాలను ఎన్నికల ప్రణాళికలో చేరుస్తాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఆయా రాష్ట్రాల్లో వేరువేరుగా ఉంటాయి. అందువల్ల దేశంలో అన్ని ప్రాంతాలను ఒకే విధంగా చూడటం కుదిరే పని కాదు.

ఈ ప్రతిపాదనను మోదీ అధికారంలోకి రాకముందే 2013లోనే వినిమయ వస్తువులను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయవచ్చునని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అయితే ఏఏ వస్తువులు ఉచితంగా ఇవ్వవచ్చు నన్నది నిర్ణయించలేదు. ఇవి నిర్ణయించుకొనేందుకు ఆయా రాజకీయ పార్టీలకు హక్కు ఉందని కూడా సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. మోదీ తన ప్రచార సభల్లో చేసినన్ని వాగ్దానాలు మరెవరూ చేసి ఉండరు, అయితే ముఖ్యమైన వాటితో సహా అత్యధిక వాగ్దానాలు ఆయన నెరవేర్చలేదు. అది వేరే విషయం. ఇక ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ఆర్థిక పరిస్థితులన్నీ తల్లకిందులవు తాయి. తీవ్రంగా నష్టపోయిన రైతులుగానీ, చిన్న, సూక్ష్మ పరిశ్రమలు గానీ ప్రభుత్వ సహాయం లేకపోతే కోలుకోవడం అత్యంత కష్టం. రెండేళ్ల కోవిడ్-19 మహమ్మారి కాలంలో కోట్లాది మంది ఉపా ధులు, ఉద్యోగాలు కోల్పోయారు. వీరికి జీవనం దుర్భరంగా మారింది. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అరకొర సాయం అందించింది. అవి కూడా బియ్యం, గోధుమలు, ఇతర కొన్ని నిత్యావసర వస్తువులు అందించింది. అనేక దేశాలు నగదును సైతం సహాయం చేశాయి. ఇదే కాలంలో బడా సంపన్నులకు రూ.145 కోట్ల రూపాయలను రాయితీలు మోదీ ప్రభుత్వం అందించింది. సంపన్న వర్గాలకు విధించే పన్నును 30 శాతం నుండి 25 శాతానికి తగ్గించింది. ఇవి ఉచితాలు కావా? యుపిలో కోవిడ్ సమయంలో ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం బీజేపీ గెలవడానికి ఉపయోగించింది. బ్యాంకులకు రుణాలను చెల్లించవలసిన బడా పారిశ్రామికవేత్తలు ఎగవేసినా వాటిని ఒక్క కలం పోటుతో రద్దు చేశారు. రద్దు చేసిన పారు బకాయిలు మోదీ పాలనలో 12 లక్షల కోట్లకు పైగా ఉన్నాయని రిజర్వుబ్యాంకు అధికారికంగా ప్రకటించిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. మరి వీటినేమందాం. ఇక దేశంలో మున్నెన్నడూ లేని స్థాయిలో నిరుద్యోగం పెరిగింది. పేదరికం పెరుగుతోంది. ఆర్థిక అసమానతలు కొండలా పెరిగిపోతున్నాయి. పైగా ఉచితాలను నిర్ణయించడం అసాధ్యం. ఒక ప్రాంతంలో ఉన్న పరిస్థితులు మరోచోట ఉండవు. ప్రజలకు ఏమి ఇవ్వాలి, ఏమి ఇవ్వకూడదని రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణ యించుకోవాలి. అందువల్ల ఉచితాలు సహేతుకమా కాదా అని ఎన్ని కల కమిషన్ ఎలా నిర్ణయిస్తుంది. పైగా ఉచితాలు మంచిది కాదని వాదించే 'మేధావులు' క్షేత్ర స్థాయిలో పరిస్థితులను పరిశీలించకుండా, ప్రజల అవసరాలను తెలుసుకోకుండా వ్యాఖ్యానిస్తున్నారని భావించ వలసి ఉంటుంది. ఎన్నికల కమిషన్ కొన్ని మార్గదర్శకాలను విడుదల చేయవచ్చు. ప్రజలకు అందించే సహాయం వల్లనే ప్రభుత్వాల ఆర్థిక పరిస్థితులు దెబ్బ తింటాయని చెప్పేవాళ్లు లక్ష కోట్ల రాయితీలను, బకాయిల రద్దులను గురించి మౌనం వహిస్తున్నారు. ఇదంతా ప్రజలు చెల్లించే పన్నుల నుండి వచ్చే ఆదాయం అన్న విషయం మరవరాదు.

ధైర్యానికి నోబెల్

స్వీయానుభూతి... సహానుభూతి కలగలిస్తే ఏమవుతుంది. మంచి కావ్యం అవుతుంది. మంచి అనుభవం అవు తుంది. అంతకంటే మంచి రసానుభూతి కలుగుతుంది. ఓ చిక్కని ఆనందం అలాంటి వారి మది నిండా నిండి పోతుంది. ఓ సంతృప్తిని ఇచ్చే పని చేశా మని మనసుకు ఊరట కలుగుతుంది. సరే ఈ ఆనందానికి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు వచ్చిందనుకోండి. కళ్ల నుంచి అప్రయత్నంగా నాలుగు కన్నీటి చుక్కలు రాలతాయి. వాటిని చాలా మంది ఆనంద బాష్పాలు అంటారు. అయ్యుండొచ్చు. అలా కూడా అనుకోవచ్చు. కాని నా వరకూ ఆ కన్నీటి చారికలను తృప్తి మిగిల్చిన బాష్పాలుగానే చూస్తాను. ఈ తృప్తే ఫ్రెంచ్ రచయిత్రి యానీ ఎర్నోకు కలిగి ఉండవచ్చు. ఎనిమిది పదుల వయసులో సాహిత్య రంగంలో ఎర్నో చేసిన కృషికి నోబెల్ అవార్డు అందుకుంటున్నారు.

ఇంతకీ యానీ ఎర్నో ఏం చేసారు. ఏం రాసారు. ఊహాజనితమైన సాహి త్యాన్ని సృష్టించి... ఆ కల్లో బతకాలని ఉపదేశించారా... లేదూ సౌందర్యా రాధనకే పెద్ద పీట వేసారా... ఒక కల్పిత గాథకు రంగులద్ది ఇదీ లోకం అని నమ్మించే ప్రయత్నం చేసారా... కాదు... ఇవేవీ చేయలేదు. తాను చూసిన, చూస్తున్న వాస్తవాలను మాత్రమే రచించారు. యూరప్ దేశాల్లో మహిళలు అనుభవిస్తున్న వేదనాభరిత జీవితాలను తన జీవితంగా మలచుకుని సాహిత్య సృష్టి చేశారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలు, వారి జీవితాలు ఎలా ఉన్నాయో తరచి చెప్పారు.

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

అందమైన లోకమని, రంగురంగులుంటాయని భ్రమించి యూరప్ దేశాలకు విహార యాత్రలకు వెళ్లే వారికి, అలా వెళ్లి వచ్చిన వారు అక్కడ తమ అనుభవాలను వివరించాక ఆ దేశాలన్నీ స్వర్గతుల్యమని భావిస్తున్న వారికి బాబోరే మీరు చూసే లోకం కాదు ఇది కాదురా అని తన రచనలతో చెప్పారు యానీ ఎర్నో. ఇక్కడ మరో విషయం ఏమిటంటే యానీ ఎర్నో రచనల కంటే కూడా ఆ రచనా సృష్టిలో ఆమె చూపించిన ధైర్యానికి ఈ నోబెల్ బహుమతి ఇచ్చామన్నారు అవార్డు కమిటీ. అంటే ప్రపంచవ్యాప్తంగా మహద్భుత రచనలు వస్తున్నాయి కాని ధైర్యంతో రాసే రచనలు రావడం లేదనే భావించాలి. ఇక్కడ ధైర్యం అనే మాటకు చాలా విలువుందని అర్థం చేసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా కవులు కానీ రచయితలు, రచయిత్రులు కానీ మొత్తం సమాజం చేత అంగీకృతమయ్యే సాహిత్య సృజనే చేయాల్సిన కాలంలో బతుకుతున్నాం. ఒక రచయిత సృష్టి ఏ వర్గానికి నచ్చకపోయినా... ముఖ్యంగా ఏలికలకు అనుకూలంగా లేకపోయినా ఆ సృజనకారులకు కష్టాలు ప్రారంభమైనట్టే. ప్రపంచవ్యాప్తంగా సృజనకారులు పడుతున్న ఇబ్బం దులు, ఎదుర్కొంటున్న బెదిరింపులు ప్రతినిత్యం ఏదో ఒక చోట వింటూనే ఉన్నాం. చదువుతూనే ఉన్నాం. ఇలాంటి కాలంలో సృజనకారులు తమ రచనల్లో సొబగుల గురించి లేదూ భాషలో ప్రావీణ్యం గురించి చెప్పాలనే ఆలోచన కంటే సమాజంలో ఏ వర్గం నుంచి ఎలాంటి బెదిరింపులు వస్తాయి... ఎవరి నుంచి దాడులు వస్తాయి అనే అంశాన్ని సృజనకు ముందే గ్రహించి రాయాల్సిన దుస్థితి. బహుశా అలాంటి వాటిని లెక్క చేయకుండా ఈ ఫ్రెంచ్ రచయిత్రి యానీ ఎర్నో తన రచనలు చేయడం నోబెల్ బహుమతి కంటే ఇంకా అత్యున్నతమైన బహుమతికి అర్హురాలు. నిజానికి యానీ ఎర్నో ఒక్కరే ఇలాంటి స్థితిలో లేరు. చరిత్రలో అనేకమంది ఉన్నారు. వర్తమానంలో యానీ ఎర్నో, అరుంధతీ రాయ్, సల్మాన్ రష్దీ వంటి వారు ఉన్నారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ఇలాంటి వారి పక్కన మరి కొంతమంది సృజనకారులూ చేరే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

ఓ సాధారణ దిగువ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన యానీ ఎర్నోకు ముందు ఆ కుటుంబంలో సాహిత్య వాతావరణం లేదు. అది యానీ ఎర్నోతోనే ప్రారంభమైంది. ఎర్నో కూడా కథలతోనో, కవిత్వంతోనో, నవలతోనో లేదూ విమర్శతోనో తన సాహిత్య సృష్టి ప్రారంభించలేదు యానీ ఎర్నో తొలి రచన తన ఆత్మకథే. తన 34వ ఏట నవల రూపంలో రాసిన ఆత్మకథ క్లీన్‌డ్ అవుట్ వెలువరించారు. నిజానికి ఆత్మకథలన్నీ ఆరు పదుల వయసు దాటిన తర్వాతే కదా రాయాలి అనే అనుమానాలు అంతటా విస్తరించి ఉన్నాయి. కాని యానీ ఎర్నో మాత్రం తన చుట్టూ జరిగిన ఘటనలు, వాటిని తనకు ఆపాదించుకుని రాసిన ఆత్మకథే ఈ క్లీన్‌డ్ అవుట్. ఎదుటి వారి మనో భావాలను, వేదనలను, ముఖ్యంగా యూరప్ దేశాల మహిళల జీవితాలను తన జీవితానుభవాలుగా మార్చుకుని తన ఆత్మకథగా రాసారు యానీ ఎర్నో. యవ్వన కాలంలో ఉండే అనేకానేక కలలకు, ఇతరేతర వ్యాపకాలకు తన రచనలో స్థానం కల్పించలేదు రచయిత్రి యానీ ఎర్నో. మహాకవి శ్రీశ్రీ అన్నట్లు వ్యధార్థ జీవిత యదార్థ గాథలనే తన రచనగా మలిచారు. అది కూడా ఎక్కడా ఎలాంటి మార్పులకు కానీ, ఊహాలోకంలో విహరించేవి కానీ దరిచేరనివ్వని రచనలు చేశారు. ఇలాంటి రచనల వల్ల భవిష్యత్‌లో నోబెల్ బహుమతి వస్తుందని ఆమె ఆశించి ఉండకపోచ్చు. కాని వీటి వల్ల ఓ వర్గం నుంచో లేదూ మరో సమూహం నుంచో తనకు ఇబ్బందులు వస్తాయని మాత్రం గ్రహించలేనంత రచయిత్రి కాదు యానీ ఎర్నో. ఆ రచన వల్ల యవ్వనకాలంలో ఎలాంటి సవాళ్లను, ఇబ్బందులను ఎదుర్కొన్నారో ఆమె చెబితేనే లోకానికి తెలుస్తుంది. కాని ఎనిమిది పదుల వయసులో ఆనాటి ధైర్యానికి ఆమెకు దక్కిన అత్యున్నత పురస్కారం ఈ నోబెల్. అందుకే ఇది ధైర్యానికి వచ్చిన పురస్కారం అయ్యింది.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు, 9912019929

వ్యర్థాలపై చైనా యుద్ధం

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

జీవాధారాలైన భూజలవాయువులు కలుషిత మయ్యాయి. ప్రపంచమే పెద్ద చెత్తబుట్టయింది. సమాజం వ్యర్థాల ఊబిలో కూరుకుపోయింది. వ్యర్థాల నిర్వహణ పెద్ద సమస్య. సమ్మిళిత ప్రగతిలో చైనా ప్రపంచంలో ముందుంది. వ్యర్థాల ఉత్పత్తి లోనూ ప్రథమ స్థానమే. 145 కోట్ల జనాభాతో వ్యర్థాల నిర్వహణ, పునర్వినియోగానికి పోరాడు తోంది. అందులోనూ మొదటి స్థానంలో నిలిచింది.

అల్జజీరా సాప్తాహిక టెలివిజన్ కార్యక్రమం '101 ఈస్ట్'లో 4 ఏళ్ళ క్రితం చైనా వ్యర్థాల సమస్య, నిర్వహణ వెలుగు చూశాయి. చెత్త చెదారాల నిర్వహణను చైనా ఆధునీకరించింది. ఊటలూరే విశాల పల్లపు ప్రాంతాలతో, అపాయకర పెరళ్ళతో, వ్యర్థాల పునర్వినియోగ కేంద్రాలతో నిర్వహణ ప్రణాళికలు రచించింది. పారిశుద్ధ శ్రామికులకు ప్రత్యామ్నాయ ఉపాధులు కల్పించింది. పర్యావరణ సమస్యలను పరిష్కరించు కుంది. పారిశుద్ధ కార్మికులు గుంపులుగా గుమిగూడి రోజూ దేశ రాజధాని బీజింగ్ నగర వీధులను శుభ్రపరుస్తారు. 2.2 కోట్ల నగరవాసుల వ్యర్థాలను సేకరిస్తారు. వాంగ్ జిందాంగ్ లాంటి చెత్తను సేకరించే వారికి ఉపాధి, కుటుంబానికి జీవనాధారం లభిస్తున్నాయి. వాంగ్, భార్య, 11 ఏళ్ళ మేనల్లుడు మెంగ్సాన్‌తో పాటు నివసిస్తున్నాడు. ఆ పిల్లవాని పోషణకు, చదువుకు ఎన్ని కష్టాలైనా భరిస్తాడు వాంగ్. తాను సేకరించే పాత సీసాలకు వచ్చే డబ్బు వాంగ్ కుటుంబ పోషణకు, మెంగ్సాన్ చదువుకు సరిపోతుంది. అయితే దేశం ప్రకటించిన 'వ్యర్థాలపై యుద్ధం' చెత్తచెదారాలు ఏరుకొని బతికేవారి ఉపాధిని మార్చేస్తోంది. ఈ పారిశుద్ధ సైన్యంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి.

తమ వ్యర్థాలను పునర్వినియోగానికి వీలుగా వేరుచేసి ఉంచమని చైనా వినియోగదారులను ఆదేశించారు. ఒకసారి వాడి పారేసే ప్యాకేజీల పరిమితికి పలు ప్రతిపాదనలు చేశారు. "నగరాలలో సామూహిక వ్యర్థాలను కాల్చివేస్తారు. 2020కు గృహ వ్యర్థాలను కూడా కాల్చివేసే ప్రణాళికను ప్రభుత్వం పూర్తి చేసింది. 2017 మార్చిలో 46 నగరాలలో చెత్త వేర్పాటును తప్పనిసరి చేసింది. ప్రజా వ్యవస్థలు, వ్యాపార సంస్థలు వ్యర్థాలను అపాయకరమైన, వంట వ్యర్థాలు, పునర్వినియోగ పదార్థాలుగా వేరుచేయాలి. 2017 నవంబర్‌కు 12 నగరాలు ఆ మేరకు నిబంధనలు సవరించి చట్టాలు చేశాయి. 24 నగరాలు ఈ కార్యక్రమాల నిర్వహణకు పలు ప్రణాళికలు రచించాయి." అని గృహ నిర్మాణ, పట్టణ, గ్రామీణ అభివృద్ధి శాఖా మంత్రి వాంగ్ మెంఘుయి అన్నారు. టాంగౌ జిల్లా ప్రజాసంస్థలలో, 2,500 రెస్టారెంట్లలో వ్యర్థాల వేర్పాటు పనులు ప్రవేశపెట్టారు. ఈ ప్రదేశాలలో వేరుచేసిన ఆహార పదార్థాల వ్యర్థాలను ప్రత్యేకంగా నిర్మించిన వాహనాలలో పారిశుధ్య కంపెనీలు తీసుకుపోతాయి. ఆహార వ్యర్థాలలో ఇతర వస్తువులను కలిపితే నిర్వాహకులు జరిమానా విధిస్తారు. శిక్షిస్తారు. నివాస సమూహాలు కూడా ఈ పద్ధతులను పాటించేటట్లు ప్రోత్సహించారు. నివాస ప్రదేశాలలో ఈ ప్రక్రియలు అమలు చేసినందుకు ప్రోత్సాహకాలు చెల్లిస్తారు. 2017 అక్టోబర్‌కు షాంఘైలో 40 లక్షల నివాస సముదాయాలు ప్రోత్సాహకాలు పొందాయి. ఆ డబ్బులతో నిత్యావసారాలు సమకూర్చుకున్నాయి. షాంక్సి రాష్ట్రం తైయువాన్ నగరంలో మేధోపర వస్తు వ్యర్థాల నిర్వహణ డబ్బాలను స్థాపించారు. ప్లాస్టిక్ సీసాలు, కాగితం వస్తువులకు వేరువేరు బార్ కోడ్‌లు అతికించి వ్యర్థాల డబ్బాలలో పడేస్తారు. 'చెత్తపోగు చేసేవారు అధిక సంఖ్యలో ఉన్నారు. వారికి చదువు, నైపుణ్యతలు లేవు' అని మహిళా వ్యాపారి లియు జుయెసాంగ్ అన్నారు. ఈమె బీజింగ్ చుట్టూ 5,000 వ్యర్థాల సేకరణ యంత్రాలను స్థాపించారు. వినియోగదారులు ఈ కేంద్రాల్లో సీసాలు జమచేసి, నగదు వసూలు చేసుకుంటారు. దీనితో మధ్య దళారీలను తొలగించారు.

హుబీ రాష్ట్రంలో యాంగ్జ్టే నదీ పరివాహక ప్రాంతాలను శుభ్రం చేస్తున్న కార్మికులు

చైనా, విదేశాల నుండి ప్లాస్టిక్ వ్యర్థాలను అధిక మోతాదులో దిగుమతి చేసుకునేది. వాటిని పునర్వినియోగాలుగా మార్చేది. ప్లాస్టిక్, కాగితాలు, వస్త్రాల ముడిపదార్థాలు, రసాయనాలు మొదలగు 24 రకాల విదేశీ వ్యర్థాల దిగుమతిని చైనా 2017లో నిషేధించింది. 2018 జనవరిలో ప్లాస్టిక్ దిగుమతులు, పునర్వినియోగ ప్రక్రియలపై పరిమితులు విధించింది. పూర్తి నిషేధానికి దారి తీసింది. ఫలితంగా నెదర్లాండ్స్ లాంటి దేశాలు వ్యర్థాల నిర్వహణలో ఇబ్బం దులు ఎదుర్కొన్నాయి. పరిపాలన, ప్రజా భద్రత, పర్యావరణ పరిరక్షణ, నాణ్యతా పర్యవేక్షణ మంత్రిత్వ శాఖలు దిగుమతుల క్రమబద్ధీకరణ, అక్రమ రవాణాల నిరోధంలో కలిసికట్టుగా పనిచేస్తున్నాయి. వ్యర్థాల మార్పు సౌకర్యాలను, నిర్వ హణ పద్ధతులను చైనా మెరుగుపరిచింది. వ్యర్థాలను నిరపాయకర వనరులుగా మార్చుతోంది. మధ్య చైనా రాష్ట్రం హునాన్‌లో వంట వ్యర్థాలను క్రమబద్ధీక రిస్తారు. చితక్కొడతారు. జల్లెడ పడతారు. యంత్రాలతో నొక్కుతారు. వ్యర్థాల నుండి నూనె, నీళ్ళను, అవశేషాలను వెలికితీస్తారు. ఆధునిక పద్ధతులతో వ్యర్థ పదార్థాల నూనెను మిశ్రమ పారిశ్రామిక చమురుగా, బయోడీజల్‌గా మార్చు తారు. వ్యర్థ జలాలను గాలి లేకుండా మరిగించి సామాన్య వ్యర్థాల స్థాయికి చేర్చుతారు. శుద్ధిచేసి సహజ వాయువులుగా మార్చుతారు. ఈ మురుగు వాయువులు విద్యుదుత్పత్తికి ఉపయోగపడతాయి. వ్యర్థాల అవశేషాలను పెంపుడు కీటకాల ఆహారంగా, పశువుల మేతగా వాడతారు. అనగా వంటగది వ్యర్థాలు అపాయరహితంగా ఉపయోగపడుతున్నాయి. మధ్య చైనా రాష్ట్రం హుబీలోని సోంగ్జి సిమెంట్ బట్టీలో గృహ వ్యర్థాలను ఉపయోగించే ప్రాజెక్టును చేపట్టారు. ఈ ప్రాజెక్టులో వ్యర్థాలను మండే పదార్థాలు, మండని పదార్థాలు, లోహాలుగా విడగొడతారు. మండే పదార్థాలను సిమెంట్ తయారీలో ఇంధనా లుగా వాడతారు. మండని పదార్థాలు సిమెంటు ముడిపదార్థాలుగా ఉపయోగ పడతాయి. లోహాలు పునర్వినియోగమవుతాయి. చైనా పట్టణాలు, నగరాలలో ఎలెక్ట్రానిక్ వ్యర్థాలు ఎక్కువ. పారిశ్రామిక, ఘనరూప వ్యర్థాలను పునర్వినియో గాలుగా మార్చుతున్నారు. గ్రామీణ ప్రజలను వ్యర్థాల నిర్వహణలో చైతన్య పరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల జల కాలుష్యాన్ని సమర్థవంతంగా నిర్మూలిస్తు న్నారు. కొన్ని వ్యర్థాలను ఎరువుగా ఉపయోగిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో మానవ విసర్జితాలను ఎరువుగా, మూత్రాన్ని ఎరువుగా, మందుల్లో వాడతారు.

చైనాలో ఎలెక్ట్రానిక్ పరికరాల వ్యర్థాలు

పర్యావరణ, ఆరోగ్య సమస్యలను అధిగమించి, ఆర్థిక, సామాజిక ప్రగతి సాధించాం. 2019 నాటికి వ్యర్థాలన్నిటినీ వనరులుగా మార్చే పథకాలు రూపొం దించామని చైనా పర్యావరణ, పరిరక్షణ అధికారి గుయో జింగే పేర్కొన్నారు.

వ్యాస రచయిత ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, 9490204545

పసలేని ప్రతిపాదన

భారత ఎన్నికల సంఘం ఒక పస లేని ప్రతిపాదన చేసి మీమీ అభిప్రాయాల్ని చెప్పండంటూ పార్టీల అధ్యక్షులకు లేఖలు రాసింది. అదేమిటంటే పార్టీలు ఎన్నికలలో ఇవ్వబోయే హామీలు, ఆ హామీల్ని అమలు చెయ్యబోయే విధివిధానాలు, వాటికై ఎలా నిధులు సమీకరించబోయేదీ, ప్రణాళిక అమలయ్యాక ఏం లాభం కలిగేదీ వివరిస్తూ కమిషన్‌కి ముందస్తుగానే అఫిడవిట్ సమర్పించాలట. తద్వారా ప్రజానీకానికి అలవికాని హామీల బాధ తప్పడంతో బాటు, ప్రభుత్వ ఖజానా స్థితిగతుల పట్ల వాస్తవిక దృక్పథంతో ఎవరున్నారో తెలుస్తుందట. ఎన్నికల సంఘంది విచిత్రమైన కోరిక. ఒకవేళ అమలు చేసినా అందువల్ల వచ్చే ఉపయోగమేమిటో తెలీదు. ఎందుకంటే ఏ పార్టీ అయినా ఒక అభివృద్ధి కార్యక్రమం గురించో, సంక్షేమ విధానం గురించో చెప్పి, అది ఎందుకు తమ ప్రాధమ్యమో చెప్పగలదు. కానీ వాటికి నిధులెక్కడి నుండి వస్తాయో, ఎలా నిర్వహణ చేస్తుందో సవివరంగా చెప్పాలంటే సాధ్యమేనా? పోనీ తెలుసుకుని ఎన్నికల సంఘం ఏమి చేస్తుంది? ఏదైనా ప్రతిపాదన తిరస్కరిస్తుందా? తిరస్కరిస్తే ఏ ప్రాతిపదికన ఆ నిర్ణయం తీసుకుంటుంది? అలా వ్యవహరించేందుకు రాజ్యాంగపరమైన హక్కు ఆ సంఘానికి ఉందా? నిధులు పొందే మార్గాల్ని అంకెల గారడీతో చూపిస్తే అడ్డుకో గలదా? మాట వరసకి ఒక పార్టీ పెద్దగా నిధులు అవసరమయ్యే కార్యక్రమం ప్రక టించి, అధికారం రాగానే నిధుల కోసం ప్రభుత్వ ఆస్తుల్ని అమ్మేస్తానసవచ్చు లేదా అలా అంటే ఓట్లు పడవనుకుంటే పాకిస్తాన్‌ని ఆక్రమించుకుని ఇస్లామాబాద్‌ని అమ్మేస్తాన నవచ్చు. లేదా గెలిచిన తర్వాత ఆ పథకాన్నే ఎత్తేయొచ్చు. ఆ పథకంలో ముందు కనబడని లొసుగులు బయటపడి వద్దనుకోవచ్చు. పనికిరాని పరిజ్ఞానం సేకరించడం ద్వారా ఎన్నికల సంస్కరణలు సాధ్యమౌతాయా? ఆ మాత్రం మంచీచెడు ప్రజానీకానికి తెలియదా? ఇప్పుడు కావాల్సింది లోపరహితంగా పక్షపాత రహితంగా పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ. అది ఆ సంఘం బాధ్యత. అర్హులకు ఓటు గల్లంతవ్వకుండా ఉండడం, దొంగ ఓట్లు పడకుండా చెయ్యడం జరగాలి. ద్వేషపూరిత ప్రసంగాలపై, ఎన్నికల నియమాల అతిక్రమణపై వెంటనే చర్యలుండాలి. డబ్బు, మద్యం ప్రభావాన్ని నియంత్రించాలి. ఎన్నికల హామీలపై నిర్ణయం తీసుకోగల చైతన్యం ప్రజలకు ఎటూ ఉంది. అట్టే బెంగ పెట్టుకోనక్కరలేదు.

అసలు ఏ హామీ ఇవ్వకపోయినా, ఆ ఊసే ఎత్తకపోయినా కార్పొరేట్ పెద్దలకు లక్షలాది కోట్లు రాయితీలు దొరుకుతున్నాయి. అప్పనంగా అదే స్థాయిలో రుణాలు మాఫీ అవుతున్నాయి. ఖజానాకు భారం మిగులుస్తున్నాయి. అలా ఇవ్వబోమని పార్టీల నుండి అఫిడవిట్లు సేకరిస్తే కొంత ఊరట. జరిగేది ఏమీ లేకపోయినా అదో సంతృప్తి అయినా దక్కుతుందేమో!

డా. డి.వి.జి., 9440836931.

విద్వేష రాజకీయాలు - వితండ వాదనలు

ఎం.సి.వెంకటేశ్వర్లు

రాష్ట్ర రాజధానికి భూములిచ్చిన రైతులు "అమరావతి టు అరసవల్లి" కి చేపట్టిన పాదయాత్రపై రాష్ట్ర మంత్రులు, వైసీపీ నాయక గణం విషం గక్కు తున్నారు. ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికై రాజ్యాంగంపై ప్రమాణం చేసి ప్రజాప్రతినిధులుగా, మంత్రులుగా బాధ్యతాయుతమైన స్థానాలలో ఉన్నామన్న ఆలోచనను మరచి చేస్తున్న ప్రకటనలు జుగుప్స కలిగిస్తున్నాయి. రాష్ట్రానికి ఒకే రాజధాని అమరావతి, దానిని మూడు ముక్కలు చేసే అర్హత రాష్ట్ర ప్రభుత్వానికి లేదని హైకోర్టు తీర్పు చెప్పినా చెవిటివాని ముందు శంఖం ఊదిన సామెత అయింది.

దేశ ప్రజలైనా, రాష్ట్ర ప్రజలైనా తమ హక్కుల కొరకు, సమస్యల పరి ష్కారం కొరకు శాంతియుతంగా ఆందోళన చేసే హక్కున్నది. అధికారంలోకి రాకముందు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ఓదార్పు యాత్ర, సంకల్ప యాత్రలు దానిలో భాగమే కదా! ఇన్ని అనుభవాలను కళ్ల ముందు పెట్టుకొని, మంత్రులుగా అపార అనుభవమున్న వారు సైతం "పాదయాత్ర ఆపాలంటే 5 నిమిషాలు చాలు" "ఇది అరసవల్లి పాదయాత్ర కాదు దండ యాత్ర" "ఈ యాత్రను అడ్డుకొని తీరుతాం" అని అహంకారపూరితమైన ప్రక టనలు చూస్తే వీరికి మంత్రులుగా, ప్రజా ప్రతినిధులుగా ఉండే అర్హత ఉన్నదా అని రాష్ట్ర ప్రజలకు సందేహం కలుగుతున్నది. రాజధానికి భూములిచ్చిన రైతాంగాన్ని వీధులపాలు చేయుటే గాక, ఆందోళనను అడ్డుకుంటామనడం ప్రజాస్వామ్యం అవుతుందా?.

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముద్ర ఉండకూడదన్న లక్ష్యంతో జగన్ మోహన్‌రెడ్డి విద్వేష రాజకీయాలకు తెర లేపాడన్నది ముమ్మాటికి నిజం. రాష్ట్రం ఏ ఒక్క రాజకీయ పార్టీది లేదా ఏ ఒక్కరి జాగీరు కాదు. టీడీపీ అయినా, వైసీపీ అయినా ప్రజలిచ్చిన ఓట్లు ద్వారానే పాలనకు వచ్చామన్న విషయాన్ని గుర్తుంచుకుంటే రాష్ట్ర రాజకీయాలు ఆరోగ్యకరంగా ఉంటాయి. ప్రత్యేకించి రాష్ట్ర విభజన జరిగిన పరిస్థితుల్లో రాష్ట్రాభివృద్ధి కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి అన్ని రాష్ట్ర పార్టీల సహకారాన్ని తీసుకోవాలి. ప్రజాభిప్రాయాన్ని మన్నించాలి. ఈ వాస్తవాలన్నింటిని కాలదన్నిన జగన్ మోహన్‌రెడ్డి గత శాసనసభ ఆమోదంతో, అన్ని రాజకీయ పార్టీల అంగీకారంతో, ప్రజా

మద్దతుతో ఏర్పాటు చేసిన అమరావతి రాజధానిని మూడు ముక్కలాటకు దిగజార్చాడు. రాజకీయ విమర్శలు ద్వేషాలు, పోటీగా రాజకీయ పార్టీలకు పరిమితం కావాలి తప్ప రాష్ట్ర పాలనపై పడరాదు. కాని జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ ద్వేషంతో గత ప్రభుత్వ విధానాలను తిరగదోడి అమరావతి రాజధానికి భూములిచ్చిన రైతులను అవమానించటమే కాదు, పోలీసు కేసులు పెట్టించడం, లాఠీలతో కొట్టించడం క్షంతవ్యం కాదు.

రాజధాని విషయంలోను, రైతులపై కక్షపూరితంగా వ్యవహరించడమే గాక తన నిర్ణయాలను సమర్థించుకోవడం కోసం వితండ వాదనలకు పాల్ప డుతున్నారు. డబ్బంతా ఒకేచోట ఖర్చుపెడితే అభివృద్ధి కేంద్రీకరణ జరుగు తుందని, మూడు రాజధానులయితే అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుందని పదేపదే వల్లించడం బోడిగుండుకు మోకాలికి ముడి వేయడమవుతుంది. పాలనా వికేంద్రీకరణ అంటే రాజధానిని మూడు ముక్కలు చేయడం కాదు. అది ప్రజలను మధ్యపెట్టి ప్రాంతీయ విభేదాలను సృష్టించడమే. అభివృద్ధి అనేది పాలకుల విధానాలను బట్టి ఉంటుంది. పాలనలో చిత్తశుద్ధి, దూరదృష్టి ఉంటే అన్ని ప్రాంతాలలో అభివృద్ధి సమతుల్యంగా ఉంటుంది. ఇందుకు రాష్ట్రంలో పారిశ్రామిక, వ్యవసాయ, ఐటి రంగాల అభివృద్ధికి అవసరమైన వనరులపై సమగ్ర సర్వే జరిపి, ఆయా ప్రాంతాలలో లభ్యమయ్యే వనరులను బట్టి పరిశ్రమలు పెడితే అభివృద్ధి జరుగుతుందనేది జగమెరిగిన సత్యం. దానికి తగిన కార్యాచరణను రూపొందించి మూడు ప్రాంతాలలో అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేసి స్వేచ్ఛాయుతమైన అధికారాలిస్తే అది అధికార వికేం ద్రీకరణ అవుతుంది. రాజ్యాంగం 72, 73 సవరణలను అనుసరించి పంచా యతీలకు, ఇతర స్థానిక సంస్థలకు అధికారాలను, బడ్జెట్ నిధులను బదిలీ చేస్తే అధికార వికేంద్రీకరణ జరుగుతుంది. గ్రామీణ అభివృద్ధి జరుగుతుంది.

గ్రామ స్వపరిపాలనకు, చట్టబద్ధ అభివృద్ధి బోర్డులకు పాలక పార్టీలు అంగీకరించవు. అధికార వికేంద్రీకరణ గురించి ధర్మోపన్యాసాలు ఎన్ని ఇచ్చిన బూర్జువా జాతీయ పార్టీలైనా, ప్రాంతీయ పార్టీలైనా అధికారం మొత్తం తమ చేతుల్లోనే పెట్టుకోవాలి, తమకు పోటీ నాయకత్వం రాకూడదు, ప్రత్యామ్నాయ విధానాలు రాకూడదు. పాలనా వికేంద్రీకరణ, అభివృద్ధి వికేంద్రీకరణ అని బాకాలూదడం ప్రజలను మధ్యపెట్టటానికే. దీనికి చంద్రబాబు నాయుడైనా, జగన్ మోహన్‌రెడ్డి అయినా అతీతులు కారు. స్థానిక సంస్థలకు అధికారాలను బదిలీ చేస్తూ రాజ్యాంగం సవరణలు జరిగి మూడు దశాబ్దాలు గడిచినా పూర్తిగా అమలు జరగలేదంటే కారకులు వాళ్లు కాదా?

రాజధాని ఏర్పాటు చంద్రబాబు, జగన్ మోహన్‌రెడ్డి సమస్య కాదు. అది రాష్ట్ర ప్రజలకు సమస్య. ప్రజలందరకు అందుబాటులో ఉండే విధంగా అంటే అటు ఇచ్ఛాపురం నుండి ఇటు హిందూపురమునకు మధ్యలో అమరావతి ఉంటుందన్నది ప్రజలందరకు తెలుసు. రైలు, రోడ్డు, వైమానిక ప్రయాణాలకు అందుబాటులో ఉంటుంది. కృష్ణానది ఒడ్డున ఉన్నది కాబట్టి నీటికి కొరత ఉండదు. ఇప్పటికే రాజధానికి కావలసిన మౌలిక వసతులకు పునాది వేసారు. సుమారు 10,000 కోట్లు ఖర్చుపెట్టి కొన్ని భవనాలు నిర్మించారు. అయినా తాము పట్టుకున్న కుందేలుకు మూడు కాళ్లు అన్నట్లుగా పాలకులు వ్యవహరించడం క్షంతవ్యం కాదు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, మంత్రివర్గ సభ్యులు ద్వేషపూరిత రాజకీయాలు వదిలి అమరావతి రాజ ధాని నిర్మాణానికి పూనుకుంటే రాష్ట్రం బాగుపడుతుంది. లేకుంటే రాష్ట్రాభి వృద్ధి కొన్ని దశాబ్దాల పాటు వెనక్కు వెళుతుంది. ఆ ఘనకీర్తి ఈ ముఖ్యమంత్రికే దక్కుతుంది.

మదరసా, మసీదుపై ఉన్మాదుల దాడి

9మందిపై కేసు నమోదు

కన్నడనాట ఉద్రిక్తత

రాజకీయ పార్టీల ఆగ్రహం

బీదర్: కర్ణాటకలో హిందూ మతోన్మాదులు మరోసారి రెచ్చిపోయారు. మదరసా, మసీదు లక్ష్యంగా విధ్వంసానికి పాల్పడ్డారు. తాళాలు వేసిన గేట్లను పగులగొట్టి లోపలికి దూసుకుపోయారు. హిందూ మతానికి అనుకూలంగా నినాదాలు చేశారు. కాగా, ఈ కేసులో 9మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బీదర్‌లోని మొహమ్మద్ గవాన్ మదరసా, మసీదులోకి కొంతమంది దుండగులు బలవంతంగా చొరబడ్డారు. మసీదు కమిటీ సభ్యుడు మొహమ్మద్ షఫీయుద్దీన్ ఫిర్యాదు మేరకు దుర్గ విగ్రహ నిమజ్జనానికి సంబంధించిన ప్రదర్శన గురువారం వేకువ జామున మసీదు, మదరసా సమీపానికి వచ్చింది. దాదాపు 60 మంది ఉన్మాదులు తాళాలు పగులగొట్టి మసీదు, మదరసాలలోకి దౌర్జన్యంగా చొరబడ్డారు. హిందూమతానికి అనుకూలంగా నినాదాలు చేశారు. మసీదు ఆవరణలో గులాం చల్లారు. అడ్డుకున్న అక్కడి భద్రతా సిబ్బందిని చంపుతామని బెదిరించారు. ఈ వ్యవహారం రాజకీయంగా దుమారం రేపింది. మసీదు, మదరసాలపై దాడిగా రాజకీయ పార్టీలు అభివర్ణించాయి. ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ పురాతన కట్టడాన్ని ధ్వంసం చేయడానికి ఉగ్రవాదులు ప్రయత్నించారని మండిపడ్డారు. 'బీదర్‌లో చారిత్రకంగా గుర్తింపు పొందిన మొహమ్మద్ గవాన్ మసీదు, మదరసాల నుంచి లభించిన వీడియోలను చూశాం. మతోన్మాదులు గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఇలా జరగడానికి బీదర్ పోలీసులు, బీఎస్ బొమ్మై ఎలా అనుమతించారు? ముస్లింల ప్రతిష్ఠను దిగజార్చేందుకు బీజేపీ ఇలాంటి చర్యలను ప్రోత్సహిస్తోంది' అని ఒవైసీ ట్విట్టర్ వేదికగా విమర్శించారు. జిల్లా ప్రధాన కేంద్రంలో శాంతి, సామరస్యతకు విఘాతం కలిగించేందుకు చాలాకాలంగా దుండగులు ప్రయత్నిస్తున్నారని షఫియుద్దీన్ ఆరోపించారు.

మసీదు, మదరసా ఆవరణలో విగ్రహాలు, ఫొటోలు ఏర్పాటు చేస్తున్నారని, మతపరమైన అంశాలను పదేపదే ప్రస్తావిస్తున్నారని మండిపడ్డారు. దేశానికి వ్యతిరేకంగా ఆ దుండగులు నినాదాలు చేశారని, ఇతర సామాజిక వర్గాలను రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. యూఏపీఏ కింద నిందితులను కఠినంగా శిక్షించాలని షఫీయుద్దీన్ డిమాండ్ చేశారు. ఘటన తర్వాత ఉద్రిక్తత తలెత్తకుండా మదరసా చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశామని పోలీసులు చెప్పారు.

అది 'మత అజెండా'లో భాగమే

ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై మండిపడిన కేరళ కాంగ్రెస్

తిరువనంతపురం : రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) అధ్యక్షుడు మోహన్ భగవత్ చేసిన వర్గ ఆధారిత జనాభా అసమతుల్యత వ్యాఖ్యల పై కేరళలో ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలో ద్వేషాన్ని వ్యాప్తి చేయడం అది ఒక 'మత అజెండా'లో భాగమని తెలిపింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వి.డి.సుదీశన్ మాట్లాడుతూ ఈ ప్రచారం కూడా మితవాద సంస్థ కొనసాగిస్తున్న మతపరమైన అజెండాలో భాగమని అన్నారు. 'జనాభా నియంత్రణపై ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడు ప్రసంగం సమాజంలో విద్వేషాలను వ్యాప్తి చేయడానికి, రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజల మధ్య మతపరమైన విభజనలను సృష్టించడానికి రూపొందించిన అజెండాలో భాగమని విలేకరులతో అన్నారు. భగవత్ చేసిన వ్యాఖ్యలను 'నిరాధారం' అని కూడా ఆయన అభివర్ణించారు. గురువారం ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూడా ఆర్‌ఎస్‌ఎస్ అధ్యక్షుడిపై విరుచుకుపడ్డారు. ఆయన విజయదశమి రోజు ప్రసంగం ఎలాంటి వాస్తవాలు లేదా అంకెలపై ఆధారపడలేదని, రాబోయే ఎన్నికలలో లాభపడాలనే లక్ష్యంతో చేసిన 'అబద్ధం' అని తెలిపారు. భగవత్ బుధవారం మాట్లాడుతూ దేశం అన్ని సామాజిక వర్గాలకు సమానంగా వర్తించే విధంగా బాగా ఆలోచించి, సమగ్ర జనాభా నియంత్రణ విధానాన్ని రూపొందించాలని అన్నారు. మైనారిటీలకు ఎటువంటి ప్రమాదం లేదని ఆయన నొక్కి చెబుతూ జనాభా 'అసమతుల్యత' సమస్య పై ధ్వజమెత్తారు. సామాజిక ఆధారిత 'జనాభా అసమతుల్యత' అనేది ఒక ముఖ్యమైన అంశం, దానిని విస్మరించరాదని కూడా ఆయన చెప్పారు.

మోదీకి మూడు పుస్తకాలు బహూకరించిన ఆర్మీ ప్రముఖుడి భార్య

న్యూఢిల్లీ: దేశ విభజనపై తన అనుభవాలతో సహా తన దివంగత భర్త రాసిన మూడు పుస్తకాలను ఆర్మీకి చెందిన ప్రముఖుడి భార్య శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీకి బహూకరించారు. ఉమా సుచ్‌దేవా (90)తో తనకు చిరస్మరణీయమైన పరిచయం ఉందని, ఆమె భర్త కల్నల్ హెచ్‌కే సుచ్‌దేవా (రిటైర్డ్) అనుభవజ్ఞుడైన ఆర్మీ అధికారి అని మోదీ పేర్కొన్నారు. ఆమెతో పాటు ఆమె మేనల్లుడు, ఆర్మీ చీఫ్ మాజీ జనరల్ వేద్ ప్రకాష్ మాలిక్ (రిటైర్డ్) కూడా ఉన్నారు. "ఉమా గారు ఆమె భర్త రాసిన మూడు పుస్తకాల కాపీలను ఇచ్చారు. వాటిలో రెండు గీతతో ముడిపడి ఉన్నాయి. మూడోది 'బ్లడ్ అండ్ టియర్స్' అనే శీర్షికతో కూడినది, బాధాకరమైన విభజన కాలంలో కల్నల్ (రిటైర్డ్) హెచ్‌కె సుచ్‌దేవా అనుభవాలు, ఆయన జీవితంపై దాని ప్రభావం గురించి కదిలే కథనం"అని ప్రధాన మంత్రి ట్వీట్ చేశారు. 'విభజన కారణంగా నష్టపోయిన, మొదటి నుంచి తమ జీవితాలను నిర్మించుకుని, దేశ ప్రగతికి దోహదపడిన వారికి నివాళిగా ఆగస్టు 14ని విభజన భయానక దినోత్సవంగా గుర్తించాలని దేశం తీసుకున్న నిర్ణయంపై మేము చర్చించాం. అవి మానవ దృఢత్వాన్ని ప్రతిబింబిస్తాయి' అని మోదీ అన్నారు. 2021లో ఆగస్టు 14ని దేశ విభజన భయాందోళనల సంస్మరణ దినంగా పాటిస్తామని మోదీ ప్రకటించారు.

మధ్యప్రదేశ్‌లో మోదీ పర్యటనకు ఏర్పాట్లు ముమ్మరం



ఉజ్జయిని (మధ్యప్రదేశ్): 'మహాకాల్ లోక్' ప్రారంభోత్సవం అక్టోబర్ 11న జరగనున్నది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్థానిక పర్యటనకు వస్తున్నందున ఆయన హెలికాప్టర్ ల్యాండింగ్ చేసేందుకు వీలుగా పోలీస్ లైన్ హెలిప్యాడ్‌ను విస్తరిస్తున్న అధికారులు తెలిపారు. రాష్ట్ర రాజధాని భోపాల్‌కు 200 కిలోమీటర్ల దూరంలో రూ.856 కోట్లతో మహాకాళేశ్వర ఆలయ కారిడార్ అభివృద్ధి ప్రాజెక్టు మొదటి దశను మోదీ ప్రారంభించనున్నారు. 'ఉజ్జయినిలోని పోలీస్ లైన్‌లో బహుళ హెలిప్యాడ్‌లు ఉన్నాయి. ప్రధానమంత్రి హెలికాప్టర్ ల్యాండింగ్ కోసం ఒక హెలిప్యాడ్‌ని ఎంపికచేశాం. మెగా ఈవెంట్ రోజున ల్యాండింగ్‌ను సులభతరం చేయడానికి ఎంపికచేయబడిన హెలిప్యాడ్ పరిధిని విస్తరిసుం'అని ప్రధానమంత్రి రాక కోసం చేస్తున్న ఏర్పాట్లకు సంబంధించిన అధికార వర్గాలు తెలిపారు. విశాలమైన హెలిప్యాడ్ నేలపై హెలికాప్టర్‌ను మెరుగ్గా, సురక్షితమైన దిగేందుకు సహాయపడుతుందని ఆయన చెప్పారు. కొన్ని రోజులుగా, పోలీస్ లైన్ క్యాంపస్‌లోని హెలిప్యాడ్ సమీపంలో తవ్విన మట్టిని చదును చేశారు. మోదీ షెడ్యూలు ప్రకారం ఆయన ఇండోర్ విమానాశ్రయంలో దిగి, అక్టోబర్ 11 సాయంత్రం హెలికాప్టర్‌లో ఉజ్జయిని చేరుకుంటారని అధికారులు తెలిపారు. ఆయన తన వాహనశ్రేణిలో మహాకాళేశ్వర ఆలయ సముదాయానికి వెళతారని వారు తెలిపారు. ప్రధానమంత్రి హెలికాప్టర్ పెద్దదిగా ఉండడంతో పాటు ఇతర హెలికాప్టర్లు కూడా ఉండడంతో పోలీస్‌లైన్‌లోని హెలిప్యాడ్‌ను విస్తరిస్తున్నారు. మధ్యప్రదేశ్ గవర్నర్, ముఖ్యమంత్రి కూడా హెలికాప్టర్లలో ఉజ్జయిని చేరుకుంటారని కోర్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు తెలిపారు. దేశంలోని 12 'జ్యోతిర్లింగాలలో' మహాకాళేశ్వర్ ఆలయం ఒకటి. అక్కడ ఏడాది పొడవునా ఎప్పుడూ భక్తులు ఉంటూనే ఉంటారు. మోదీ పర్యటన కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. దీప స్తంభాలపై రంగురంగుల జెండాలతో నగరాన్ని అలంకరించనున్నారు. జెయింట్ కారిడార్‌కు అభిముఖంగా ఉన్న హరిపాతక్ ఫ్లైఓవర్‌ను లైట్లతో అలంకరించారు.

కేరళలో పెట్టుబడులకు నార్వే కంపెనీల ఆసక్తి

జనవరిలో వాణిజ్య సదస్సు: విజయన్

తిరువనంతపురం: రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణ కోసం కేరళలోని లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా వచ్చే ఏడాది జనవరిలో పెట్టుబడుల సదస్సుకు కేరళ ఆతిథ్యం ఇవ్వనున్నది. సదస్సులో ప్రముఖ నార్వే కంపెనీలు పాల్గొంటాయి. ఈ విషయాన్ని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ శుక్రవారం తెలిపారు. కేరళలో పెట్టుబడులు పెట్టాలన్న ఆసక్తి గల నార్వే కంపెనీల భారత ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని విజయన్‌ను ఉటంకిస్తూ ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. సీఎం విజయన్ ప్రస్తుతం యూరప్ పర్యటనలో ఉన్నారు. నార్వే రాజధాని ఓస్లోలో నిర్వహించిన వాణిజ్య సదస్సులో పాల్గొన్న విజయన్...తమ రాష్ట్రంలో పెట్టుబడులకు గల అవకాశాలను వివరించినట్లు సీఎంఓ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఇన్నోవేషన్ నార్వే, నార్వే ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ(ఎన్ఐసీసీఐ), నార్వేజియన్ బిజినెస్ అసోసియేషన్ ఇండియాతో కలిసి భారత్, నార్వే రాయబార కార్యాలయాలు సంయుక్తంగా నిర్వహించిన ఆ సదస్సులో 50 ప్రధాన కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వివరించింది. హైడ్రోజెన్‌ప్రో సీఈఓ ఎరిక్ టొల్‌స్టాడ్, ఎంటీఆర్ సీఈఓ సంజయ్‌శర్మ, తోమ్రా, కాంబీ వంటి ప్రముఖ కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల కార్యకలాపాలు, వ్యాపారాల గురించి వివరించారు. హైడ్రోజన్ ఇంధనం, ఆహార శుద్ధి, మత్స్య, నౌకాయానం, వ్యర్థాల నిర్వహణ వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టడానికి నార్వే కంపెనీలు ఆసక్తి ప్రదర్శించినట్లు సీఎంఓ వివరించింది. ఈ రంగాల్లో కేరళలో పెట్టుబడులకు గల అవకాశాలను ముఖ్యమంత్రి వివరించారని తెలిపింది.

ప్రభుత్వం నిద్రపోతోంది

- **ఆర్థిక వ్యవస్థ అంతా బాగుందనుకుంటోంది**
- **మేల్కొనకుంటే వృద్ధిలో మరింత క్షీణత**
- **కాంగ్రెస్ నాయకుడు చిదంబరం**

న్యూఢిల్లీ : దేశ ఆర్థిక వ్యవస్థ గురించి సంతోషంగా ఉన్నట్లు కనిపించేది ప్రభుత్వం ఒక్కటేనని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం అన్నారు. ఎటువంటి చర్యలు తీసుకోకపోతే భారతదేశ వృద్ధి అంచనా మరింత తగ్గిపోతుందని తెలిపారు. ఉక్రెయిన్‌లో యుద్ధం కారణంగానే రూపాయి పతనం, వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం అనే వాదన పై ఆయన మాట్లాడుతూ 'అందుకే ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందా?. ఇదంతా అమెరికా ఫెడ్ ప్రకంపనల వల్ల జరిగిందా? 2008లో ఎవరైనా అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభం కారణంగా ఇలా జరిగిందని చెప్పగలరా?' అని ప్రశ్నించారు. 'మీరు ప్రభుత్వంలో ఎందుకు ఉన్నారు? మీరు బాహ్య కారకాలతో పాటు అంతర్గత సమస్యలను కూడా ఎదుర్కోవాలి' అని రాజ్యసభ సభ్యుడు ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. పడిపోతున్న రూపాయి విలువ ఇతరుల కంటే మెరుగైనదన్న వాదనను ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరం తిరస్కరించారు. ఇతర కరెన్సీలతో పోల్చి చూస్తే భారతదేశ తలసరి ఆదాయం ఆ దేశాలతో సమానంగా లేదని కూడా ఆయన నొక్కి చెప్పారు. 'మనం బలహీనంగా ఉన్నాం. మనం పేదలం... ఉదాహరణకు పేదరికంలో, మాతా, శిశు మరణాల రేటులో' అని ఆయన ఎత్తి చూపారు. 'మన ఎగుమతి కంటే మన దిగుమతులు చాలా ఎక్కువ. డిజిటల్ ఇండియా కోసం మనం ఉపయోగించే ప్రతి చిప్‌ను ఆచరణాత్మకంగా దిగుమతి చేసుకోవాలి' అని ప్రధాని మోదీ చాలా గొప్పగా చెప్పుకునే కార్యక్రమాలలో ఒకదానిని ఎత్తి చూపారు. 'ప్రశ్న ఏమిటంటే, మీరు ఏమి చేస్తున్నారు? ప్రభుత్వం పూర్తిగా విజయం సాధిస్తుందని నేను చెప్పడం లేదు. కానీ చర్యలు తీసుకోవాలి' అని అన్నారు. 2012, 2013లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలన గురించి మాట్లాడుతూ 'రూపాయి చాలా దారుణంగా పడిపోయింది. కానీ మేము పదవీ విరమణ చేసే సమయానికి (2014లో) దానిని 58.4కి తిరిగి తీసుకువచ్చాం. మేము అనేక చర్యలు తీసుకున్నాం' అని తెలిపారు. మొదటి దశగా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించాలని, ఆపై కరెంట్ అకౌంట్ లోటు, దిగుమతులు, ఎగుమతుల మధ్య వ్యత్యాసాన్ని నియంత్రించాలని ఆయన సూచించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పడిపోతున్నప్పటికీ, ప్రభుత్వం ప్రయోజనం పొందకపోవడం గురించి స్పందిస్తూ, 'ఇంధన ధరలు ద్రవ్యోల్బణానికి మూలం' అని అన్నారు. తక్షణమే పన్ను తగ్గించాలని పిలుపునిచ్చారు. 'ఇంధనం పై పన్ను ప్రభుత్వం తన వనరులను పెంచుకోవడానికి పూర్తిగా స్వార్థపూరితంగా విధించింది. ఇది రాష్ట్రాలతో పంచుకోదు. జీఎస్‌టీ రేట్లు కూడా ఎక్కువే. నేడు ద్రవ్యోల్బణం 7 శాతం, టోకు ద్రవ్యోల్బణం 12 శాతం' అని తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడానికి, 'ముందు మనం మేల్కొనాలి. ప్రభుత్వం నిద్రపోతోంది. లేచి, కళ్లు తెరిచి కాఫీ వాసన చూడాలి' అని ఆయన అన్నారు. మొత్తం వృద్ధి రేటుపై అంచనాలు తగ్గుముఖం పడతాయని చెప్పారు. ఉచిత రేషన్ వంటి పథకాలు 'ఒక నైతిక, చట్టపరమైన బాధ్యత. పెద్ద సంఖ్యలో పేదలు ఉన్నంత వరకు ఇది ఉచితం కాదు. ప్రజల్లో ప్రబలమైన పోషకాహార లోపం ఉంది' అని తెలిపారు.

ఆ ఫ్యాక్టరీలో మందులు ప్రాణాంతకం!

దిగ్భ్రాంతికి గురైన స్థానికులు

సోనిపట్ (హరియాణా): గాంబియాలో 66 మంది చిన్నారుల మృతికి కారణమైనట్లు చెప్పబడుతున్న దగ్గు మందు (సిరప్) ఇక్కడి ఫ్యాక్టరీ (మైడెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్) లో తయారైనట్లు ఫ్యాక్టరీ పరిసరాల్లో నివసించే ప్రజలకు తెలియదు. కుంతి (49) అనే మహిళకు ఈ విషయం చెప్పినప్పుడు దిగ్భ్రాంతికి గురైంది. ఉయ్యాల్లో ఉన్న తన మూడేళ్ల మనవరాలిని అక్కున చేర్చుకుంది. 'దేవునికి ధన్యవాదాలు, మేము ఇక్కడ నుంచి మందులు తీసుకోలేదు' అని తెలిపింది. 'ఫాక్యటరీ వద్ద నిన్న చాలా మంది అధికారులు ఉన్నారు. ఫ్యాక్టరీలో ఏదో జరిగిందని మేము అనుకున్నాం' అని సిమ్మి (25) అనే మరో మహిళ పేర్కొంది. 'ఈ ఫ్యాక్టరీ ఎనిమిది, 10 సంవత్సరాలుగా ఇక్కడ ఉంది. ఇక్కడ నాసిరకం ఉత్పత్తులు తయారవుతున్నాయని మేము ఎప్పుడూ అనుమానించలేదు. అవి భారతీయ మార్కెట్‌లో కూడా అమ్మబడుతున్నాయా? దగ్గు సిరప్ పేరు ఏమిటి?' అని ఆమె ప్రశ్నించింది. అయితే ఈ ఫ్యాక్టరీ నుంచి మందులు ఇతర దేశాలకు మాత్రమే ఎగుమతి చేస్తారని పొరుగువారు ఆమెకు తెలియజేశారు. మైడెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ తయారు చేసిన నాలుగు దగ్గు, జలుబు సిరప్‌లు తీసుకోవడం అత్యంత ప్రమాదకరమని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఓ) హెచ్చరించింది.

పీటీఐ ప్రతినిధి శుక్రవారం ఫ్యాక్టరీని సందర్శించినప్పుడు హరియాణా డ్రగ్ కంట్రోల్ అధికారులు విచారణ కోసం ఫ్యాక్టరీకి వచ్చారు. ఫ్యాక్టరీ అంతటా నిశ్శబ్దం అలుముకుంది. భద్రతా సిబ్బంది ఫ్యాక్టరీలోకి ఎవరినీ అనుమతించడం లేదు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల ప్రాంతాల వారు ఫ్యాక్టరీని చూసేందుకు వస్తున్నారు. 'నేను ఫోన్‌లో గాంబియాలో జరిగిన దాన్ని గురించి చదివాను. ఫ్యాక్టరీకి వెళ్లి చూద్దాం అని నా స్నేహితుడికి చెప్పాను. మేము దీనికి చాలా దగ్గరగా నివసిస్తున్నాం. ఈ విషయం చాలా మందికి తెలియదు' అని సమీపంలోని మరో ఫ్యాక్టరీలో కూలీగా పనిచేస్తున్న భరత్ చెప్పాడు. స్థానికుల్లో విషయంపై పూర్తి అవగాహ లేకపోయినా ఓ టీ దుకాణంలో జరిగిన సంఘటనపై వారు తమ అభిప్రాయాలను వెల్లడించారు. కొన్ని రసాయనాలను ఎక్కువ మోతాదులో కలిపారని, అందుకే పిల్లలు చనిపోయారని తెలిపారు. 'ఈ ఫ్యాక్టరీ దగ్గు సిరప్‌లను ఉత్పత్తి చేస్తుందని నాకు తెలియదు. నేను 10 సంవత్సరాలుగా ఇక్కడ నివసిస్తున్నాను' అని మరొక స్థానికుడు నవ్వుతూ చెప్పాడు.

హరియాణాలోని సోనిపట్‌లో ఉన్న మైడెన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ ఉత్పత్తి చేసిన నాలుగు కలుషిత, నాణ్యతలేని దగ్గు సిరప్‌లు పశ్చిమ ఆఫ్రికా దేశం గాంబియాలో చిన్నారుల మరణాలకు కారణం కావచ్చని డబ్ల్యుహెచ్‌ఓ బుధవారం హెచ్చరించింది. ప్రోమెథాజైన్ ఓరల్ సొల్యూషన్, కోఫెక్స్‌మలిన్ బేబీ కాఫ్ సిరప్, మాకోఫ్ బేబీ కాఫ్ సిరప్, మాగ్రిప్ ఎన్ కోల్డ్ సిరప్ పేరుతో నాలుగు రకాల మందులు ఇక్కడ తయారవుతున్నాయి.

డబ్ల్యూహెచ్‌ఓ అప్రమత్తం చేయడంతో భారత డ్రగ్ రెగ్యులేటర్ దర్యాప్తు ప్రారంభించింది. సంస్థ తయారు చేసిన నాలుగు దగ్గు సిరప్‌ల నమూనాలను పరీక్షల నిమిత్తం కోల్‌కతాలోని సెంట్రల్ డ్రగ్స్ ల్యాబ్‌కు పంపినట్లు హరియాణా ఆరోగ్య మంత్రి అనిల్ విజ్ తెలిపారు.

పిల్లల మృతికి కారణమైన ఆశ్రమాన్ని మూసివేస్తాం

కోయంబత్తూర్: తిర్పూర్‌లో పేద పిల్లలకు ఆశ్రయం కల్పిస్తున్న అనాథాశ్రమా (చిల్డ్రన్స్ హోమ్)న్ని మూసివేస్తున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. ఇక్కడ ఆశ్రయం పొందుతున్న పిల్లల్లో ముగ్గురు బాలురు విషతుల్యమైన ఆహారం తిని మృతిచెందిన పిమ్మట ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

సాంఘిక సంక్షేమశాఖ మంత్రి పి.గీతాజీవన్, సమాచార శాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్ శుక్రవారం బాధిత విద్యార్థినులు చేరిన ఆస్పత్రిని సందర్శించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ... శ్రీవివేకానంద సేవాశ్రమం (ప్రైవేట్ హోమ్)లో పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, సంఘటన జరిగిన నేపథ్యంలో వెంటనే దీనిని మూసివేస్తామని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకుల నిర్లక్ష్యానికి ముగ్గురు బాలురు మృతి చెందారని, మరో 11 మంది మృతి అస్వస్థులయ్యారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. లోపలున్నవారికి బయటి నుంచి తీసుకొచ్చిన ఆహారాన్ని అందించడం చట్ట విరుద్ధమని, అనాథ శరణాలయంలో మిగిలిన వారి బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని గీతాజీవన్ తెలిపారు. వారిని ఈరోడ్ జిల్లాలోని మరో ఆశ్రమానికి తరలించి రాష్ట్రంలోని అన్ని అనాథ శరణాలయాలు, గృహాల స్థితిగతులను సమీక్షిస్తామని మంత్రులు తెలిపారు.

అనాథాశ్రమంలో జరిగిన మరణాలపై అత్యవసర ప్రాతిపదికన విచారణ జరిపించాలని బాలల హక్కుల సంఘం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్సీపీసీఆర్) గురువారం తమిళనాడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరింది. దీనిపై 48 గంటల్లోగా స్పందించాలని కోరింది.

ప్రముఖ నటుడు అరుణ్ బాలి మృతి

ముంబై: టీవీ షో "స్వాభిమాన్" బ్లాక్ బస్టర్ హిట్ "3 ఇడియట్స్"లో పనిచేసిన ప్రముఖ నటుడు అరుణ్ బాలి(79) శుక్రవారం ఉదయం ముంబైలోని సబర్బన్‌లోని తన నివాసంలో మృతి చెందారు. బాలి కుమారుడు అంకుశ్ తన తండ్రి మస్తీనియా గ్రావిస్‌తో బాధపడుతున్నారని, ఇది నరాలు, కండరాల మధ్య కమ్యూనికేషన్ వైఫల్యం కారణంగా ఏర్పడిన ఆటో ఇమ్యూన్ వ్యాధి అని, దీని కోసం ఈ ఏడాది ప్రారంభంలో ఆసుపత్రిలో చేరినట్లు చెప్పారు. తన తండ్రి చికిత్సకు బాగా స్పందించినా, తెల్లవారుజామున 4.30 గంటలకు మరణించాడని అంకుశ్ చెప్పారు. ప్రముఖ చిత్రనిర్మాత లేఖ్ టాండన్ టీవీ షో "దూస్రా కేవల్"తో సూపర్ స్టార్ షారుఖ్ ఖాన్ మామయ్యగా బాలి తన నటనను ప్రారంభించారు. పీరియాడికల్ డ్రామా "చాణక్య", "స్వాభిమాన్", "దేస్ మే నిక్లా హోగా చంద్" వంటి టీవీ షోలకు పనిచేశారు. "కుంకుమ్, ఏక్ ప్యారా సా బంధన్" వంటి వాటిలో కూడా నటించారు. ఆయన ప్రసిద్ధ చిత్రాలలో "సౌగంధ్", "రాజు బన్ గయా జెంటిల్‌మన్", "ఖల్నాయక్", "సత్య", "హే రామ్", "లగే రహో మున్నా భాయ్", "3 ఇడియట్స్", "రెడీ", "బర్ఫీ", "మన్మర్జియాన్", "కేదార్‌నాథ్", "సామ్రాట్ పృథ్వీరాజ్", "లాల్ సింగ్ చద్దా" ఉన్నాయి. అమితాబ్ బచ్చన్, రష్మిక మందన్న నటించిన అతని చివరి చిత్రం "గుడ్‌బై" శుక్రవారం విడుదలైంది. బాలికి ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

పెళ్లి చేసుకోనన్నదని నిప్పుపెట్టాడు

దుమ్కా: జార్ఖండ్‌లోని దుమ్కా జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున 22 ఏళ్ల మహిళకు ఓ వ్యక్తి నిప్పంటించాడని పోలీసు అధికారి తెలిపారు. పెళ్లి ప్రతిపాదనను తిరస్కరించినందుకే ఆ వ్యక్తి ఈ చర్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. జర్ముండి ప్రాంతంలోని బాల్కి గ్రామానికి చెందిన మహిళను కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తరలించారని అధికారి వివరించారు. నిందితుడు, అప్పటికే వివాహితుడు. అతడిని అరెస్టు చేసినట్లు జర్ముండి సబ్ డివిజనల్ పోలీసు అధికారి (ఎస్‌డీపీఓ) శివేందర్ ఠాకూర్ తెలిపారు. జిల్లాలో ఓమైనర్ బాలిక తన అడ్వాన్స్‌ను తిరస్కరించినందుకు ఒక వ్యక్తి చేత నిప్పంటించబడిన వారాల తర్వాత ఈ ఘటన జరిగింది. "బాధితురాలిని వివాహం చేసుకోవాలనుకున్న స్థానిక వ్యక్తి శుక్రవారం ఉదయం ఆమె ఇంట్లోకి ప్రవేశించి, ఆమె నిద్రిస్తున్నప్పుడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆమెను కుటుంబ సభ్యులు ఫూలో జానో మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఆమెను రాజేంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు రెఫర్ చేశారు' అని పోలీసులు తెలిపారు. గత నెల, దుమ్కాలో 14 ఏళ్ల గిరిజన బాలిక చెట్టుకు ఉరి వేసుకుని కనిపించింది. ఆమెను అత్యాచారం చేసి హత్య చేసినట్టు ఆమె తల్లి పేర్కొన్నారు. దుమ్కాలో మైనర్ బాలికలకు సంబంధించిన రెండు ఘటనలు ప్రస్తుతం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్‌తో సహా వివిధ సంస్థలచే విచారణలో ఉన్నాయి.

రూ.120 కోట్ల మెఫెడ్రోన్ స్వాధీనం..

పైలెట్‌తో సహా ఆరుగురి అరెస్ట్

ముంబై: నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ముంబై, గుజరాత్‌లలో రూ.120 కోట్ల పైగా విలువైన 60 కిలోల మెఫెడ్రోన్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ఎయిర్ ఇండియా మాజీ పైలట్‌తో సహా ఆరుగురిని అరెస్టు చేసినట్లు సీనియర్ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లోని నావల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌కు అందిన నిర్దిష్ట సమాచారం ఆధారంగా ఈ చర్య తీసుకున్నట్లు ఎన్‌సీబీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంజయ్ సింగ్ విలేకరులకు తెలిపారు. "సమాచారం అనుసరించి, దిల్లీలోని ఎన్‌సీబీ ప్రధాన కార్యాలయం, దాని ముంబై జోనల్ యూనిట్ అధికారులు అక్టోబర్ 3న జామ్‌నగర్‌లో దాడి చేసి 10 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నారు" అని ఆయన చెప్పారు. ఎన్‌సీబీ బృందం జామ్‌నగర్‌లో ఒకరిని అరెస్టు చేయగా, ముంబై నుంచి మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సింగ్ తెలిపారు. 'గురువారం, ఎన్‌సీబీ బృందం దక్షిణ ముంబైలోని ఫోర్ట్ ప్రాంతంలో ఎస్‌బీ రోడ్‌లో ఉన్న ఒక గోడౌన్‌పై దాడి చేసి 50 మెఫెడ్రోన్‌లను స్వాధీనం చేసుకుంది" అని ఆయన చెప్పారు. ఆ తర్వాత, డ్రగ్ నిరోధక సంస్థ కార్టెల్ కింగ్‌పిన్‌తో సహా ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసింది. నిందితులలో ఒకరైన సోహైల్ గఫార్ మహీదా ఎయిర్ ఇండియా మాజీ పైలట్ అని ఆయన చెప్పారు. మెఫెడ్రోన్, 'మియావ్ మియావ్' లేదా ఎండీ అని కూడా పిలుస్తారు, ఇది నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద నిషేధించబడిన సింథటిక్ ఉద్దీపన, సైకోట్రోపిక్ పదార్థం.

ఐసీయూలోనే ములాయం... పరిస్థితి విషయం

లక్నో/గురుగ్రామ్: సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకులు ములాయం సింగ్ యాదవ్ ఇంకా ఐసీయూలోనే ఉన్నారని, ఆయన పరిస్థితి విషమంగానే ఉందని మేదాం ఆస్పత్రి వైద్యులు శుక్రవారం తెలిపారు. ఆయనకు మందులు ఇస్తున్నామని ఆస్పత్రి హెల్త్ బులిటెన్‌లో పేర్కొంది. సమాజ్‌వాదీ పార్టీ కార్యాలయం కూడా ఇదే విషయాన్ని తెలుపుతూ ట్వీట్ చేసింది. ఆ ట్వీట్‌ను ఆస్పత్రిన తన హెల్త్ బులెటిన్‌లో పంచుకుంది.

కేరళ బావిలో పడిన పులి క్షేమంగా వెలికితీత



వాయ్‌నాడ్(కేరళ): వాయ్‌నాడ్ జిల్లాలోని పుతియిడం వద్ద శుక్రవారం ఓ ఇంటి బావిలో పడిన చిరుతపులిని వన్యప్రాణి అధికారులు, స్థానికులు గంటల తరబడి శ్రమించి రక్షించారు. పశువైద్యుడు దూరంగా ఉండటంతో చిరుతపులికి రక్షించే మిషన్ కొన్ని గంటలు ఆలస్యమైందని, అయితే సాయంత్రానికి దాదాపు 30 అడుగుల లోతున్న బావి నుంచి చిరుతను విజయవంతంగా బయటకు తీసినట్టు పేర్కొన్నారు. చిరుతను వన్యప్రాణి విభాగం అధ్వర్యంలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించామని, అది తిరిగి ఆరోగ్యం, బలాన్ని పుంజుకున్న తర్వాత అడవుల్లోకి వదలనున్నట్లు అటవీ అధికారులు వివరించారు. అనేసార్లు మోటారు వేసినా నీరు బయటకు రాకపోవడంతో శుక్రవారం ఉదయం తన కుటుంబసభ్యులతో కలిసి బావిలోకి చూశామని ఇంటి యజమాని జోస్ తెలిపారు. తమ బావిలో చిరుత పులిని చూసి షాక్ అయ్యామని, ఆ జంతువు నీటి పంపులను పాడు చేసిందని.. అందుకే నీళ్లు రాలేదని చెప్పారు. బావి పైన కవరింగ్ నెట్ ఉన్నప్పటికీ, జంతువు ప్రమాదవశాత్తు అందులో పడిపోయిందని డీఎఫ్ఓ మార్టిన్ లోవెల్ తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న నిపుణులు ఇటీవల ఇడుక్కిలో దారితప్పిన పులిని ట్రాప్ చేసే మిషన్‌లో భాగంగా అక్కడికి వెళ్లడంతో మిషన్ కాస్త ఆలస్యమైందని ఆయన చెప్పారు. చిరుతపులి ప్రస్తుతం ఆరోగ్యంగా ఉందని అధికారి తెలిపారు.

అదంపూర్ ఆప్ అభ్యర్థి ఖరారు

చండీగఢ్: వచ్చే నెలలో జరిగే అదంపూర్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికకు ఆప్ అభ్యర్థిగా సతేందర్ సింగ్‌ను బరిలోకి దిగనున్నారు. ఈ మేరకు ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుశీల్ గుప్తా శుక్రవారం వెల్లడించారు. ఇంతకు ముందు బీజేపీలో ఉన్న సతేందర్‌సింగ్ గత నెలలో దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సమక్షంలో హిసార్‌లో ఆమ్ ఆద్మీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాను పార్టీ సిద్ధాంతాలకు ప్రభావితమయ్యానని, అదంపూర్ అభివృద్ధికి కృషి చేస్తానని సింగ్ చెప్పారు. సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కుల్దీప్ బిష్ణోయ్ రాజీనామా చేయడంతో అదంపూర్‌కు ఉప ఎన్నిక అవసరమైంది. కాగా ఉప ఎన్నికకు అభ్యర్థిని ప్రకటించిన ప్రధాన పార్టీలలో ఆప్ మొదటిది. బిష్ణోయ్ ఆగస్టు 4న బీజేపీలో చేరారు. గత ఐదు దశాబ్దాలుగా తన కుటుంబానికి గట్టి పట్టున్న ఈ నియోజకవర్గంలో హరియాణా మాజీ ముఖ్యమంత్రి దివంగత భజన్ లాల్ చిన్న కుమారుడు బిష్ణోయ్‌కు ఉప ఎన్నిక అగ్నిపరీక్షగా మారనుంది. బీజేపీ తన అభ్యర్థిని ఇంకా ప్రకటించనప్పటికీ గురువారం బిష్ణోయ్ మాట్లాడు తూ... అదంపూర్ నియోజకవర్గ ప్రజలు తన కుమారుడు భవ్యను పోటీ చేయాలని కోరుకుంటు న్నారని తెలిపారు. పార్టీకి ఈ విషయం తెలియజేసినట్లు చెప్పారు. నయోలి ఖుర్ద్ (హిసార్) గ్రామానికి చెందిన ఆప్ అభ్యర్థి సతేందర్ సింగ్ 2014లో కాంగ్రెస్ టికెట్‌పై అదంపూర్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి చవి చూశారు.

సీపీఐ మహాసభలకు తరలిరండి

దోనేపూడి శంకర్, కోటేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ జాతీయ మహాసభల ప్రచారంలో భాగంగా విజయవాడ నగరం సింగ్‌నగర్ కృష్ణా హోటల్ సెంటర్‌లో స్కై బెలూన్‌ను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దోనేపూడి శంకర్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఎగురవేశారు. అనంతరం దోనేపూడి శంకర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన జరిగే భారీ ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయటానికి ప్రజలు తరలి రావాలని కోరారు. ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న ఈ మహాసభలకు తెలంగాణ ముఖ్య మంత్రి కేసీఆర్, తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ సహా దేశ వ్యాప్తంగా అనేకమంది అగ్రనాయకులు హాజర తున్నారని తెలిపారు. విజయవాడ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కేవీ భాస్కరరావు, ఎల్. శివకుమార్, స్థానిక నాయకులు ఎన్.లక్ష్మీనారాయణ, ఎస్‌కే సుభానీ, కె.ఆదినారాయణ, సీహెచ్ గురవయ్య, తమ్మిన దుర్గ, స్థానిక యువకులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలు...

ప్రజానాట్యమండలి సన్నద్ధం

బ్రోచర్ ఆవిష్కరించిన నేతలు

విశాలాంధ్ర-విజయవాడ: భారత కమ్యూనిస్టు పార్టీ 24వ జాతీయ మహాసభల గౌరవార్థం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి నిర్వహణలో ఈనెల 13 నుండి 17వ తేదీ వరకు విజయవాడలో జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్ర నాయక్, చిన్నం పెంచలయ్యతో కలిసి ఆవిష్కరించారు. విజయవాడ దాసరి భవన్‌లో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రజా చైతన్యానికి సాంస్కృతిక రంగం ఎంతో కీలకపాత్ర పోషిస్తున్న దన్నారు. పాలకుల దుర్నీతిపై ప్రజలను చైతన్యపరచటానికి ఎంతగానో ప్రజాకళలు దోహదపడతాయని తెలిపారు. తెలుగు రాష్ట్రాలలో సామాజిక, రాజకీయ రంగాలలో ప్రజా కళాకారులుగా పేరొందిన ఎంతోమంది కళాకారులను విజయవాడలో జరిగే కళా ఉత్సవాలకు ఆహ్వానిస్తున్నామన్నారు. 13వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు లెనిన్ సెంటర్లో జరిగే ఆట, పాట, మాట, కళాకారుల ధూమ్ ధామ్ కార్యక్రమంలో ప్రముఖ ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పాల్గొని సాంస్కృతిక సంబరాలను ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనేకమంది కళాకారులు పాల్గొంటారన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సందేశమిస్తారని పేర్కొన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు, గాయకులు వందేమాతరం శ్రీనివాస్, నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న), సినీ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, బుర్ర సాయిమాధవ్, అజయ్ ఘోష్, మాదాల రవి, ధవళ సత్యం, చైతన్య ప్రసాద్, బాబ్జి, అల్లం గోపాల్‌రావు తదితరులతోపాటు అనేకమంది ప్రజా కళాకారులు పాల్గొంటారన్నారు. జగ్గరాజు గారి బృందంతో అంబేద్కర్ నాటకం, రాజకీయ భాగవతం నృత్య గేయ రూపకం, తెలంగాణ ప్రజానాట్యమండలి వారిచే తెలంగాణ సాయుధ పోరాట వీరగాథ ఒగ్గు కథ, చంద్ర రాజేశ్వరరావు ఒగ్గు కథ, గుంటూరు వారిచే ఓహో ఓహోమ్ నాటికతో పాటు అభ్యుదయ గేయాలకు నృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మణిపూర్ రాష్ట్రాలకు చెందిన కళాకారులు హాజరుకానున్నారని చెప్పారు. ప్రజానాట్యమండలి కార్యక్రమాలు తొలిరోజు లెనిన్ సెంటర్‌లో, మిగిలిన కార్యక్రమాలు రైల్వే స్టేషన్‌కు దగ్గర్లో ఉన్న హనుమంతరాయ గ్రంథాలయ హాలులో జరగనున్నాయని వివరించారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.రవీంద్రనాథ్, ప్రజానాట్య మండలి నాయకులు ఆర్.పిచ్చయ్య, ఎస్కే నజీర్, లంక దుర్గారావు, దోనేపూడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలకు

విశాలాంధ్ర రూ.50వేల విరాళం

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విజయవాడలో ఈనెల 14న ప్రారంభం కానున్న సీపీఐ 24వ జాతీయ మహాసభల కోసం ఉమ్మడి కర్నూలు జిల్లా విశాలాంధ్ర పాత్రికేయులు విరాళంగా రూ.50వేల నగదును సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్యకు అందజేశారు. సీఆర్ భవన్‌లో సీపీఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన రామచంద్రయ్య, గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డికి విశాలాంధ్ర బ్రాంచి మేనేజర్ కె.నాగరాజు, బ్యూరో ఇన్‌చార్జి శ్రీనివాసులుగౌడ్, పాత్రికేయులు దస్తగిరి, రఘురామయ్య, మల్లికార్జున, రమేశ్ ఈ మొత్తాన్ని అందచేశారు. సీపీఐ జిల్లా సమితి తరుపున విశాలాంధ్ర పాత్రికేయులకు రామచంద్రయ్య, గిడ్డయ్య అభినందనలు తెలిపారు.

మల్లుపెద్ది దంపతుల రూ.50వేల విరాళం

విశాలాంధ్ర - చల్లపల్లి : కృష్ణాజిల్లా వక్కలగడ్డ గ్రామానికి చెందిన మల్లు పెద్ది బోసు - రత్నకుమారి దంపతులు రూ.50వేలు విరాళం అందించారు. మహాసభ ప్రచార నిమిత్తం వక్కలగడ్డ వచ్చిన సీపీఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు ద్వారా అవనిగడ్డ నియోజకవర్గం శాఖకు రూ. 30వేలు, మహిళా సమాఖ్య జిల్లా శాఖకురూ.20వేలు అందజేశారు. మహాసభలు విజయవంతానికి తమ వంతు సహకారంగా విరాళాల అందించిన బోసు, రత్నకుమారిలకు నార్ల ధన్యవాదాలు తెలిపారు. గ్రామంలో జరిగిన ప్రచార కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు టి తాతయ్య, అడ్డాడ ప్రసాదబాబు, నాయకులు వెలగపూడి ఆజాద్, నాగార్జున, మలుపెద్ది అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పెన్నిధి, సంక్షేమానికి అర్థం కల్పించిన

ఎస్‌ఆర్ శంకరన్ ధన్యజీవి

మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ నివాళి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పేద ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించి తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు, ఐఏఎస్ గాంధీగా అన్ని వర్గాల ప్రజలతో కీర్తించబడిన ఎస్‌ఆర్ శంకరన్ చిరస్మరణీయులని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ కొనియాడారు. అమరజీవి ఎస్‌ఆర్ శంకరన్ 12వ వర్ధంతి సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) అధ్వర్యంలో విజయవాడ ఐక్యతాభవన్‌లో ఆయన కాంస్య విగ్రహానికి జల్లి విల్సన్ పూలమాలలేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం జల్లి విల్సన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లోనూ కలెక్టరుగా బాధ్యతలు నిర్వహించడంతోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, వివిధ రంగాల్లో సమర్థవంత సేవలందించారన్నారు. అణగారిన వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక వివక్షతకు గురికావడాన్ని సహించలేని శంకరన్... పాలకులను ఒప్పించి, మెప్పించి చాలా సంక్షేమ పథకాల రూపకల్పనకు ప్రేరణగా నిలిచారని గుర్తు చేశారు.

సంక్షేమానికి అర్థం కల్పించిన మహామేధావి, కృషీవలుడు శంకరన్ అని అభివర్ణించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం తన జీవితాంతం కృషి చేసిన శంకరన్ ప్రజలకు ఆదర్శంగా నిలిచిపోతారని పేర్కొన్నారు.

జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే నిర్వహించాలి: జల్లి విల్సన్

ఎస్‌ఆర్ శంకరన్ జయంతి, వర్ధంతులను ప్రభుత్వమే ఏటా నిర్వహించాలని జల్లి విల్సన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు ఇప్పటికే విజ్ఞప్తులు అందజేశామన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీ ఎస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బుట్టి రాయప్ప, విజయవాడ నగర సమితి అధ్యక్షుడు సంగుల పేరయ్య, నగర నాయకులు కాళ్ల చిన్నప్ప, లింగాబత్తిన శివకుమార్, పాశం ఆంజనేయులు, జల్లి చిన్నారావు, రాహేల్‌బాబు, కాళ్ల విజయ్, ఐక్యతా భవన్ అధికారులు, కోచింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశంలో ఆందోళనకర వాతావరణం: గెహ్లాట్

జైపూర్: 'దేశ పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. మత సామరస్యానికి విఘాతం కలుగుతోంది' అని రాజస్థాన్ సీఎం, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ గెహ్లాట్ విమర్శించారు. భారత్ జోడో సేతు పేరుతో నిర్మించిన 2.8 కిలోమీటర్ల రోడ్డును గురువారం సాయంత్రం గెహ్లాట్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర దేశవ్యాప్తంగా సానుకూల సందేశం పంపిందని చెప్పారు. 'భారత్ జోడో యాత్ర శాంతి, సమైక్యత సందేశం ఇచ్చింది. దేశంలో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి ముప్పు పొంచి ఉంది. మత సామరస్యం ఇబ్బందుల్లో పడింది. ఇలాంటి పరిస్థితుల్లో భారత్ జోడో సేత దేశవ్యాప్తంగా సానుకూల సందేశం పంపింది' అని గెహ్లాట్ అన్నారు. విద్వేషానికి స్వస్తి పలకడం, సోదరతత్వాన్ని పెంపొందించడమే కాంగ్రెస్ పార్టీ భారత్ జోడో యాత్ర ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. భారత్ జోడో సేతు రోడ్డును రూ.250 కోట్లతో నిర్మించినట్లు తెలిపారు.

'భారత్ జోడో యాత్ర'కు విశేష స్పందన

పాదయాత్రలో రాహుల్‌తో గౌరీ లంకేశ్ తల్లి, సోదరి

చిట్టనహళ్లి (కర్ణాటక): కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర'కు కర్ణాటకలో విశేష స్పందన లభిస్తోంది. ఈ యాత్ర శుక్రవారం 30వ రోజుకు చేరుకోగా, కర్ణాటకలోని మాండ్య జిల్లా నాగమంగళ సమీపంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, పార్టీ కార్యకర్తలు పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్రలో రాహుల్ గాంధీతో పాటు సామాజిక కార్యకర్త, దివంగత గౌరీ లంకేశ్ తల్లి, సోదరి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ భారత్ జోడో యాత్ర లంకేశ్ లాంటి వారి గొంతుక అని, దానిని ఎప్పటికీ మూయించలేమని అన్నారు. 'సత్యం కోసం గౌరీ నిలిచారు. భారత్ జోడో యాత్ర వారి స్వరం. ఇది ఎప్పటికీ నిశ్శబ్దం కాదు' అని ఆయన లంకేశ్ తల్లి చేయి పట్టుకుని వారి కుటుంబ సభ్యులతో కలిసి నడుస్తున్న చిత్రాన్ని పంచుకుంటూ గాంధీ ట్విట్టర్‌లో రాశారు. సెప్టెంబర్ 8న కన్యాకుమారి నుంచి 3,570 కి.మీల పొడవునా భారత్ జోడో యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్ర ఇప్పటివరకు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కేరళ, కర్ణాటకలో వందల కిలోమీటర్లు ప్రయాణించింది. అంతకుముందు గురువారం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ పక్కన నడిచారు. సోనియాతో పాటు మహిళా ఎమ్మెల్యేలు అంజలి నింబాల్కర్, రూపకళ, లక్ష్మీ హెబ్బాల్కర్ పాల్గొన్నారు. కాంగ్రెస్ వారసుడు తన తల్లికి షూ లేస్‌లు కట్టడం గురువారం రోజు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

కాంగ్రెస్ బలోపేతానికి దోహదం: జైరాం రమేశ్

శుక్రవారంతో నెల రోజులు పూర్తి చేసుకున్న భారత్ జోడో యాత్ర నుంచి 'నిజమైన' రాహుల్ గాంధీ బయటకు వస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. మాండ్య జిల్లాలో యాత్ర సందర్భంగా పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఇది ఎవరూ చేయని సుదీర్ఘమైన పాదయాత్రగా అభివర్ణించారు. ఇది కాంగ్రెస్ మానసికంగా బలపడటానికి సహాయపడుతుందని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికను 'సైడ్ షో' అని, యాత్రను ప్రధాన కార్యక్రమంగా కూడా ఆయన అభివర్ణించారు. 'ఇది కాంగ్రెస్ పార్టీ పరివర్తన, ఇది నిజమైన రాహుల్ గాంధీ బయటకు రావడాన్ని చూపిస్తుంది. కొత్త రాహుల్ గాంధీ అని నేను చెప్పను. కానీ నిజమైన రాహుల్ గాంధీని చూస్తున్నారు' అని జైరాం రమేశ్ తెలిపారు. 'మేము రోడ్లపై, వీధుల్లో ఉన్నాం. మేము బీజేపీతో పోరాడుతున్నాం. మేము యుద్ధాన్ని వారి శిబిరానికి తీసుకువెళుతున్నాం. సమస్యలను లేవనెత్తుతున్నాం. ఇప్పుడు బీజేపీ మాపై స్పందిస్తోంది. యాత్ర గొప్ప సహకారం అని నేను భావిస్తున్నాను. ఇది ఎన్నికల కంటే మానసికమైనది' అని కాంగ్రెస్ నాయకుడు అన్నారు.

ప్రభుత్వ రంగంలో కేపీఐలు వద్దు

కేంద్ర కార్మిక సంఘాల డిమాండు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ వ్యవస్థను నాశనం చేసేందుకు కేంద్రప్రభుత్వం కంకణం కట్టుకున్నదని కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూల) ఐక్యవేదిక విమర్శించింది. 2024 నాటికి అన్ని వ్యవస్థలనూ ప్రైవేటు పరం చేయాలని దూకుడు ప్రదర్శిస్తోందని దుయ్యబట్టింది. ఒకదాని తర్వాత ఒకటిగా వ్యవస్థపై కేంద్రం పంజా విసురుతుండటానికి వివరణ లేకుండా పోయిందని వ్యాఖ్యానించింది. ఎయిర్ ఇండియా, పవన్ హన్స్, ఎల్ఐసీ ఐపీఓ, బ్యాంకుల విలీనాలు, విద్యుత్ రంగం చివరకు ప్రభుత్వ రంగ సాధారణ బీమా కంపెనీలను లక్ష్యంగా చేసుకుందని శుక్రవారం ఒక ప్రకటనలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీతో పాటు స్వతంత్ర సమాఖ్యలు, సంఘాలు పేర్కొన్నాయి. ప్రభుత్వ రంగ బీమా కంపెనీల్లో కీలక పనితీరు సూచికల వర్తింపునకు కేంద్రప్రభుత్వం యత్నిస్తోందని ప్రకటన పేర్కొంది. ఇది ఏకపక్షంగా, రాజ్యాంగ - చట్టవిరుద్ధంగా అమలు చేస్తోందన్నది. పరిశ్రమ, ఉద్యోగులు, ఏజెంట్లు, సర్వేయర్లు, విలువైన కస్టమర్లు, పౌరుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుందని తెలిపింది. రాజ్యాంగ-చట్టవిరుద్ధమైన నివేదికను కంపెనీల బోర్డు అనుసరించడానికి ప్రాధాన్యత ఇస్తూ కేపీపీ ప్రక్రియ అమలుకు డీఎఫ్ఎస్, జీఐపీఎస్ఏ పూనుకోవడం దురదృష్టకరమని కార్మిక సంఘాలు పేర్కొన్నాయి. కన్సల్టెంట్ల తుది నివేదికపై పూర్తిస్థాయిలో భాగస్వాములతో చర్చలు జరిపిన తర్వాతే కేపీఐల అమలు జరగాలని అప్పటి వరకు దానినిఅమలు చేయరాదని డిమాండు చేసింది. డీఎఫ్ఎస్ అధికారులు కొందరు స్వల్ప కాలంలోనే నివేదికలు సమర్పించేలా కన్సల్టెంట్లపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రకటన తెలిపింది. డీఎఫ్ఎస్ అధికారులు తమకు నచ్చినట్లు వ్యవహరిస్తున్నారని పేర్కొంది. ఓరియంటల్ బీమా కంపెనీ లి చైర్మన్-ఎండీ అంజన్ దే, సుచితా గుప్తా, జీఐపీఎస్ఏ చైర్‌పర్సన్, చైరపర్సన్ ఎన్ఐసీఎల్‌కు అనేక మెమోరాండాలను జీఐపీఏఐఏ నాయకత్వం దేశవ్యాప్తంగా ఉన్న ఆయా ప్రాంతీయ ఇంచార్జిల ద్వారా పంపింది. అయినప్పటికీ డీఎఫ్ఎస్, జీఐపీఎస్ఏ మేనేజ్‌మెంట్ దూకుడుగానే వ్యవహరిస్తోంది. సెప్టెంబరు 28న ఓరియంటల్ బీఆ కంపెనీలో మధ్యాహ్నం భోజనం వేళల్లో దేశవ్యాప్తంగా ప్రదర్శనలను జీఐఈఏఐఏ సభ్యులు నిర్వహించారు. అలాగే, సెప్టెంబరు 16న నేషనల్ ఇన్సూరెన్ కంపెనీలో చేశారు. అక్టోబరు 7న యూఐఐలోనూ కేపీఐ ప్రక్రియ అమలుకు విరుద్ధంగా నిరసనలు జరిగాయి. ఈ క్రమంలో జేఎఫ్‌టీయూ, జీఐఈఏఐఏ పోరాటానికి కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. కేపీఐలపై తగిన విధమైన కార్యచరణ లేనంత వరకు అమలు చేయొద్దు అని డిమాండు చేశాయి.

మహాపాదయాత్రకు అనూహ్య స్పందన

- అమరావతి మహిళలకు నీరాజనాలు, హారతులు
- రథం వెంబడి ప్రజల అడుగులు
- పార్టీలకతీతంగా మద్దతు

విశాలాంధ్ర-భీమవరం: అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలని అమరావతి పరిరక్షణ సమితి అధ్వర్యంలో అమరావతి నుంచి అరసవల్లి వరకు రాజధాని రైతులు తలపెట్టిన మహాపాదయాత్రకు భీమవరం నియోజకవర్గంలో అనూహ్య స్పందన వచ్చింది. హోరు వానను సైతం లెక్క చేయకుండా రైతులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం మహా పాదయాత్ర భారీ వర్షంలో భీమవరం పట్టణంలో ప్రవేశించింది. అడుగడుగునా ప్రజలు పాదయాత్రలోని మహిళలపై పూల వర్షం కురిపించి సంఘీభావం ప్రకటించారు. జై అమరావతి, ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అంటూ చేసిన నినాదాలతో భీమవరం హోరెత్తిపోయింది. మహా పాదయాత్ర జేపీ రోడ్డు, అంబేద్కర్ సెంటర్, పీపీరోడ్డు, కొత్త బస్టాండ్ మీదుగా డప్పు వాయిద్యాలతో, బాణా సంచా నడుమ ఉత్సాహంగా సాగింది. శుక్రవారం వీరవాసరంలో చేరుకోవడంతో16 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తయింది. అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ నాయకులు ఏ.శివారెడ్డి, స్వరాజ్యరావు, గద్దె తిరుపతిరావు, రాయపాటి శైలజ, కొలికపూడి శ్రీనివాస్, బుజ్జి తిరుపతిరావు, ఆకుల ఉమామహేశ్వరరావు, మాజీ మంత్రులు పితాని సత్యనారాయణ, పీతల సుజాత, ఎమ్మెల్యే మంతెన రామరాజు, ఎమ్మెల్సీలు పొందువ్వ శ్రీను, అంగర రామ్మోహనరావు, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కలవపూడి శివ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రాజధానులు పేరుతో జగన్ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడని, ప్రాంతాల మధ్య చిచ్చు రేపాడని విమర్శించారు. ఉన్న రాజధాని అభివృద్ధి చేయలేని జగన్ మూడు రాజధానులు అంటూ ఊరేగడం సిగ్గు చేటని, అమరావతే ఏకైక రాజధానిగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పాదయాత్రను కొనసాగిస్తామని అమరావతి పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. సీపీఐ సంఘీభావం: రాష్ట్రం నడిబొడ్డునున్న అమరావతే మన రాజధాని అని మూడు రాజధానుల ఆలోచనలను విరమించుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. భీమవరంలో ప్రవేశించిన మహా పాదయాత్రకు పెదఅమిరంలో సీపీఐ శ్రేణులు స్వాగతం పలికి సంఘీభావం తెలిపారు. మూడు రాజధానులంటూ వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న ప్రకటనలు మానుకోవాలని కోనాల హితవు పలికారు. రాష్ట్ర ప్రజలంతా అమరావతినే కోరుకుంటున్నారని, అభివృద్ధి వికేంద్రీకరణ కోరుతున్నారని పాలన వికేంద్రీకరణ కాదని చురకలంటించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర సమితి సభ్యులు సికిలే పుష్పకుమారి, సీపీఐ నాయకులు ఎం.లక్ష్మీపతి, మల్లుల శ్రీనివాసరావు, వైవీ ఆనంద్, ఆకుల రాము, నాగిరెడ్డి శాంతమూర్తి పాల్గొన్నారు.

అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలి

రైతుల మహా పాదయాత్రకు సంపూర్ణ మద్దతు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-తణుకు: అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలని, మూడు రాజధానుల పేరుతో ప్రాంతాల మధ్య చిచ్చు రగల్చడం సరికాదని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయం వంక సత్యనారాయణ స్వరాజ్య భవన్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ అధ్వర్యంలో ఒకే రాష్ట్రం, ఒకే రాజధాని అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ మూడు రాజధానుల పేరుతో మూడు ప్రాంతాల ప్రజల మధ్య చిచ్చు పెట్టడం జగన్‌కు తగదని, చిత్తశుద్ధి ఉంటే వెనుకబడిన ప్రాంతాలకు నిధులు కేటాయించి అభివృద్ధి వికేంద్రీకరణ జరపాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి జగన్ శాశ్వత అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా కేవలం మూడు రాజధానుల పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను మధ్య పెడుతూ మోసం చేస్తున్నారని విమర్శించారు. శాంతియుతంగా అమరావతి రైతులు చేస్తున్న పాదయాత్రను అడుగడుగున అడ్డుకునేందుకు అధికార పార్టీ మంత్రులు, నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అమరావతి నుంచి అరసవల్లి దేవస్థానం వరకు జరిగే పాదయాత్రలో అధికార పార్టీ యంత్రాంగం ఘర్షణలు పెట్టేందుకు కుట్ర చేస్తోందని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి పాదయాత్రను విజయవంతం చేయాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లాలో పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ పెద్ద ఎత్తున పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, ఉత్తరాంధ్రకు నూతన పరిశ్రమలు, రాజధాని నిర్మాణం కోసం నిధులు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. టీడీపీ తణుకు పట్టణ నాయకులు తాతపూడి మారుతీరావు మాట్లాడుతూ, జగన్ అభివృద్ధి కార్యక్రమాలు చేయకుండగా ఆర్థికంగా తన కుటుంబ సభ్యుల ఆస్తులు పెంచుకోవడం తప్ప, రాష్ట్ర అభివృద్ధిపై ఆలోచన చేయడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రామారావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రాజధాని అమరావతికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని ఎవరు ఎన్ని కుట్రలు చేసినా చివరకు రైతులు విజయవంతం అవుతారని ఆకాంక్షించారు. సీఐటీయూ నాయకులు కామన మునిస్వామి మాట్లాడుతూ మూడు రాజధానులకు తాము వ్యతిరేకమని, రాజధాని అమరావతి ఒకటే ఉండాలని తమ పార్టీ నిర్ణయం మేరకు రైతుల పాదయాత్రకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్న అందరితో కలిసి పని చేస్తామని తెలిపారు. సీపీఐ తణుకు పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు మాట్లాడుతూ, సీపీఐ మూడు రాజధానులకు వ్యతిరేకంగా మొదటి నుంచి ఒకే రాష్ట్రం ఒకే రాజధాని పేరుతో ఉద్యమంలో అగ్రభాగాన ఉంటోందని, రాజధాని రైతుల పాదయాత్ర సంపూర్ణ మద్దతుతో పాటు ప్రత్యక్షంగా పాల్గొంటున్నామని తెలిపారు. సీపీఎం నాయకులు ప్రతాప్ మాట్లాడుతూ, రాజధాని ప్రాంత రైతుల పాదయాత్రకు మద్దతు తెలపడంతో పాటు ఘనంగా స్వాగతం పలుకుతామని, చివరి వరకు వారి వెంట ఉంటామని తెలిపారు. న్యాయవాది కౌరువెంకటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీలు జెండాలు వేరైనా ప్రధాన అజెండాగా అమరావతి రాజధానిగా జరుగుతున్న ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ ఉద్యమంలో తాము ప్రత్యక్షంగా పాల్గొంటామన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కదలి పురుషోత్తం, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుందర్, సీపీఐ తణుకు పట్టణ నాయకులు బొద్దాని మురళి, గుబ్బల వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు కిలారి భగత్, నక్క శీను, బొబ్బిలి జయకుమార్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పీ పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దిర్సిపో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



"హేతువు ఎప్పుడూ ఉంటుంది. కానీ అది ఎల్లప్పుడూ హేతుబద్ధంగా ఉండకపోవచ్చు.
కారల్ మార్క్స్

CPI 24th PARTY CONGRESS 2022 October 14-18 VIJAYAWADA

సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022 విజయవాడ

అరుణ తారలు

ఆర్ఎన్ఐ తిరుగుబాటుకు

మార్గదర్శి ఎన్కే కృష్ణన్

ప్రముఖ కమ్యూనిస్టు, కార్మిక నాయకుడు ఎన్కే కృష్ణన్ (1913 ఏప్రిల్ 12 - 1992 నవంబరు 24) ప్రతిభాశీలి. అంతర్జాతీయ వ్యవహారాల్లో నిపుణుడు. అనేక ప్రపంచ సమావేశాలలో సీపీఐకి ప్రాతినిధ్యం వహించారు. విద్యార్థి దశలోనే రాజకీయాలలో ప్రవేశించారు. అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించారు. నారాయణ కల్యాణ్ కృష్ణన్ (ఎన్కే కృష్ణన్) 1913 ఏప్రిల్ 12న కేరళలోని కొచ్చిన్ రాచరిక రాష్ట్రంలోని నడవరాంబ గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. కృష్ణన్ పాఠశాల, కళాశాల రోజులలో ప్రథమ స్థానంలో నిలిచిన అత్యుత్తమ విద్యార్థి. ఆయన కీట్స్ నుంచి షెల్లీ, షేక్స్పియర్ వరకు ఆంగ్ల రచయితల సాహిత్యాన్ని చదివారు. సంస్కృతం, కర్ణాటక సంగీతం, టెన్నిస్‌పై అయనకి ఆసక్తిని ఉండేది. 1930లో మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజిలో గణిత శాస్త్రంలో ఎంఎలో చేరారు. కళాశాలలో విద్యార్థులు 1929లో హెచ్వి కామత్ నేతృత్వంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఎంఏ పూర్తి అయిన తర్వాత ఐసీఎస్ కోసం సిద్ధమవుతున్న ఆయనను తల్లిదండ్రులు ఉన్నత చదువుల కోసం ఇంగ్లండ్‌కు పంపారు. లండన్ స్కూల్ ఆఫ్ ఎకనా మిక్స్‌లో చేరారు. ప్రిన్సిపాల్ కమ్యూనిస్టు వ్యతిరేక ధోరణి కారణంగా కృష్ణన్ కాలేజి మారారు. కమ్యూనిస్టు అనుకూల ప్రొఫెసర్ హైమన్ లెవీ వద్ద హైడ్రోడ్ ఎకనమిక్స్ చదివారు. వారిద్దరూ బాగా కలిసిపోయారు. కమ్యూనిస్టు అభిప్రాయాల కారణంగా కృష్ణన్ ఐసీఎస్ పూర్తిచేయలేకపోయారు. వేల్స్‌లో పక్షం రోజుల పర్యటన సందర్భంగా బొగ్గు గని కార్మికులు దుర్భర పరిస్థితులను గమనించి చలించి పోయారు.

1930ల మధ్యలో యూరప్, ఇంగ్లండ్లో ఫాసిస్ట్ వ్యతిరేక తిరుగుబాటు ఉవ్వెత్తున జరుగుతున్న కాలం. కృష్ణన్ చాలా మంది కమ్యూనిస్టులను కలుస్తూ మార్క్సిస్ట్ సాహిత్యం

అధ్యయనం చేశారు. బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీతో పరిచయం ఏర్పడి, అందులో క్రియాశీలంగా మారారు. మేధావులు, ఆర్థికవేత్తలు, శాస్త్రవేత్తలు, చరిత్రకారులతో పరిచయం ఏర్పర్చుకున్నారు. కమ్యూనిస్టు, కార్మిక నేతగా ఆయన అనేక సంవత్సరాలు జైలు జీవితం అనుభవించారు. ఇంగ్లండ్‌లో 1935లో పట్టాభిషేకదినంనాడు సీపీజీబీ పేపర్, డైలీ వర్కర్ పత్రిక విక్రయిస్తుండగా ఆయనను అరెస్టు చేశారు. రెండవ ప్రపంచ యుద్ధం ముంచుకొస్తున్నందున, జూన్ 1939లో కృష్ణన్ భారతదేశానికి బయలు దేరారు. మైఖేల్ కారిట్ ఆయనకు బ్రిటీష్ పార్టీ నుంచి సీపీఐకి కొన్ని పార్టీ పత్రాలను, నివేదికలను అందించారు. భారత్ వచ్చిన తరువాత కృష్ణన్ పీసీ జోషిని కలిసి చాలాసేపు మాట్లాడారు.

1940లో డీపి సమ్మె సందర్భంగా తంబిట్కర్, పాట్కర్, ఎంబీ షహీద్, పార్వతీ బాయి, భోగ్లే ఇతర నాయకులతో ఎన్కేకి పరిచయం ఏర్పడింది. కృష్ణన్ ఇతరులను మొదట అత్యంత భయంకరమైన బైకుల్లా జైలుకు పంపారు. అక్కడి నుంచి నాసిక్‌కు తరలించారు. జైలులో సర్దేశాయి, కృష్ణన్ కార్యదర్శులుగా పార్టీ కమిటీని ఏర్పాటు చేశారు.

కమ్యూనిస్టు లతో చాలా సత్సంబంధాలు ఉన్న 200 మందికి పైగా కాంగ్రెస్ డిటెన్యూలు కూడా అక్కడ ఉన్నారు. 1942 ఏప్రిల్ 28న ఎన్కే జైలు నుంచి విడుదల య్యారు. ఏఐఎస్ఎఫ్, బీఎస్‌యు (బాంబే స్టూడెంట్స్ యూనియన్) కార్యకలాపాలకు సహాయం చేశారు. మద్రాసు ప్రావిన్స్‌లో పార్టీ పునర్వ్యవస్థీకరణ బాధ్యత తీసుకు న్నారు. 1942 జూన్‌లో పార్వతి, ఎస్. రామకృష్ణన్, పరమేశ్వరన్‌తో పాటు దక్షిణ ప్రాంత ఏఐఎస్ఎఫ్ సమా వేశాన్ని నిర్వహించడంలో సహాయం చేయడానికి కృష్ణన్ సేలం వచ్చారు. కృష్ణన్, పి.సుబ్బరాయన్‌కు పీసీ జోషి ప్రాంతీయ కమిటీ పునర్వ్యవస్థీకరణ బాధ్యత అప్పగించారు. సుబ్బరాయన్ రాజకీయాలు, సంగీతం, సైన్యం, కమ్యూనిస్టు ఉద్యమం మొదలైన వాటితో సహా దేశానికి విశిష్ట సేవలు అందించారు. ఆయన భార్య రాధాబాయి సెంట్రల్ అసెంబ్లీలో మొట్టమొదటి మహిళగా ఎన్నిక య్యారు. డాక్టర్ సుబ్బరాయన్ మద్రాసు ముఖ్యమంత్రి అయ్యారు. పార్వతి, మోహన్ వారి పిల్లలు. కృష్ణన్, పార్వతి 1942 డిసెంబర్ 7న బొంబాయిలోని రాజ్‌భవన్‌లో వివాహం చేసుకున్నారు. 1946లో ఆర్ఎన్ఐ తిరుగుబాటుకు మార్గ నిర్దేశం చేయడంలో ఎన్కే చురుకుగా పాల్గొన్నారు. 1947 జనవరిలో మధురై కుట్రకేసులో దాదాపు 100 మంది అగ్రశ్రేణి కమ్యూనిస్టు లను అరెస్టు చేశారు, హోంమంత్రి అయిన డాక్టర్ సుబ్బరాయన్ (పార్వతి తండ్రి) వద్ద ఉన్న ఎన్కే పోలీసులు తెల్లవారుజామున 2 గంటలకు అరెస్టు చేశారు. కేరళలో అజ్ఞాత వాసం తరువాత, ఎన్కే 1953 మేలో కోయంబత్తూర్‌లో స్థిరపడ్డారు, పారిశ్రామిక కార్మికులను, ముఖ్యంగా జౌళిరంగ కార్మికులను సంఘటితం చేశారు. 1964లో ఆయన ఢిల్లీలోని సీపీఐ ప్రధాన కార్యాల యానికి మారారు. 1970 నుంచి నాలుగేళ్ల పాటు రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. 1969లో మాస్కోలో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు మహాసభ సన్నాహక సభలో సీపీఐ ప్రతినిధి బృందం సభ్యునిగా పాల్గొన్నారు. అనేక దేశాల కమ్యూనిస్టు పార్టీల మహాసభలకు హాజరయ్యారు. - మోదుమూడి మురళీకృష్ణ

వై.ఈశ్వరరెడ్డి

ప్రజా ఉద్యమనేత

నిరాడంబరం, విశిష్ట వ్యక్తిత్వం..అంకితభావం..ఔన్నత్యం కొందరు నాయకులకే సొంతం, అటువంటి వారిలో ఒకరు కడపజిల్లా ప్రజాఉద్యమనేత వై.ఈశ్వరరెడ్డి. ఆయన ప్రముఖ పార్లమెంటేరియన్ కూడా.

స్వాతంత్ర్య సమరయోధులు, కమ్యూనిస్టు నాయకులు అయిన ఎద్దుల ఈశ్వరరెడ్డి కడప జిల్లా పెద్దపసుపుల గ్రామంలో 1915లో జన్మించారు. కడపజిల్లాలో యువజన సంఘాలు ఏర్పాటుచేసి ప్రజా కార్యక్రమాలు నిర్వహించడంలో ఈశ్వరరెడ్డిది అందెవేసినచేయి. వీరి తండ్రి, పినతండ్రి సమష్టి కుటుంబానికి 600 ఎకరాల భూమి, ఆరు మిద్దెలు, 12 కాండ్ల ఎద్దులు ఉండేవి. పినతండ్రి మల్లారెడ్డి 1923లో కాకినాడలో జరిగిన కాంగ్రెస్ మహాసభకు హాజరై గాంధీకి ఒక తులం బంగారం విరాళంగా అందచేశారు. ఈశ్వరరెడ్డిపై చిన్నతనంలోనే జాతీయోద్యమ ప్రభావంపడింది.

ఈ దశలోనే ఆయన దేశభక్తి భావాలు పుణికిపుచ్చుకున్నారు. 1936లో అనంతపురం కాలేజీలో డిగ్రీ ఉత్తీర్ణులయ్యారు. పెద్దపసుపుల గ్రామంలో కాపులు పెడకంటి, మోటాటి అనే రెండు తెగలుగా విడిపోయారు. చదువు పూర్తయిన అనంతరం స్వగ్రామం తిరిగి వచ్చిన ఈశ్వరరెడ్డి ఈ రెండు తెగల యువకులను కలిపి మిత్రమండలిపేర ఒక యువజన సంస్థను ఏర్పాటు చేశారు.

వై.ఈశ్వరరెడ్డి

1937లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరపున ఈశ్వరరెడ్డి ప్రచారం చేశారు. 1938లో ఈశ్వరరెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. 1940లో ఏటుకూరి బలరామమూర్తి రాయలసీమ జిల్లాకు కమ్యూనిస్టుపార్టీ ఆర్గనైజర్‌గా వచ్చారు. బలరామమూర్తి పెద్దపసుపుల గ్రామం వెళ్లి కారల్‌మార్క్స్ సిద్ధాంతాలను, సమాజ పరిణామ సిద్ధాంతాలను, సోషలిస్టు భావాలను బోధించడంతో ఈశ్వరరెడ్డి అత్యంత ప్రభావితులయ్యారు. తిరిగి రాజకీయ రంగంలో క్రియాశీలపాత్ర పోషించారు. 1941లో చెన్నూరులో జాతీయ కాంగ్రెస్ ప్రారంభించిన వ్యక్తి. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. జైలులో ఉండగానే కమ్యూనిస్టుపార్టీ చేపట్టిన ఫాసిస్టు వ్యతిరేక ప్రజాయుద్ధ నినాదానికి సంపూర్ణమద్దతు తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ప్రారంభించిన రహస్యపత్రిక 'స్వతంత్ర భారత్'ను పంచే కార్యక్రమం చేపట్టారు. 1942లో ముక్తేవి మాధవాచారి కడపజిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ఆర్గనైజర్‌గా వచ్చారు. 1940 జులై నుంచి 1942 ఆగస్టు వరకు ఏటుకూరి బలరామమూర్తి, 1943 రెండవ అర్థభాగంలో ఆరునెలలు మాధవాచారి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో పాల్గొన్నారు. 1944లో విజయవాడలో జరిగిన అఖిల భారత రైతు మహాసభకు ఈశ్వరరెడ్డి ఆయన మిత్రులు హాజరయ్యారు. 1943 నుంచి జిల్లా రైతు ఉద్యమంలో పాల్గొన్నారు.

1949-52 మధ్య కమ్యూనిస్టు పార్టీపై తీవ్ర నిర్బంధ విధానం అమలు జరుగుతున్న క్రమంలో ఈశ్వరరెడ్డి తమ స్వగ్రామంలో అజ్ఞాతవాసంలో ఉండగా ఆయనను, ఇతర కామ్రేడ్స్‌ను అరెస్టు చేసేందుకుగాను 1949 సెప్టెంబరు 28వ తేదీన పోలీసులు దాడి చేశారు. ఈశ్వరరెడ్డిని విడిపించుకోవడానికి ప్రజలు పోలీసులపై రాళ్లతో దాడిచేసి వారి కళ్లల్లో కారం కొట్టి విడిపించుకున్నారు.

ఈ దాడుల్లో కామ్రేడ్ వెంకట కొండారెడ్డి మృతి చెందారు. 1952లో జరిగిన ఎన్నికల్లో ఈశ్వరరెడ్డి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. మొత్తం నాలుగు పర్యాయాలు ఈశ్వరరెడ్డి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. కడపజిల్లా జాతీయోద్యమంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రముఖపాత్ర వహించిన ఈశ్వరరెడ్డి 1986లో మృతిచెందారు.

- రొమిలా

గిరిజనం గుండెచప్పుడు

దేముడు

ఆయన నిరాడంబరతకు మారుపేరు. గిరిజనం అభ్యున్నతిని కాంక్షించిన మహోన్నత నేత గొడ్డేటి దేముడు. చింతపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి రెండుసార్లు సీపీఐ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కొండంత ఔదార్యం, ఔన్నత్యం కలిగి, ఇసుమంతైనా ద్వేషం, స్వార్థం లేని గిరిజనం గుండె చప్పుడుగా, ప్రజల మధ్య సాధారణ వ్యక్తిగానే జీవించారు. ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించేవారు. 1994, 2004లలో దేముడును మన్యం ప్రజలు ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు సాగిస్తూ గిరిజనం గుండెల్లో చెరగని ముద్రవేశారు.

గొడ్డేటి దేముడు 1965 జనవరి 1న జన్మించారు. తల్లి ఎర్రయమ్మ, తండ్రి మల్లయ్య. కమ్యూనిస్టు సిద్ధాంతాలకు, ఆశయాలకు నిబద్ధులైన ఆయన గిరిజన ప్రాంత సమస్యలపై పోరాడుతూ గిరిజనాన్ని పోరాటాలకు సంసిద్ధం చేశారు. 28 ఏళ్ల వయసులోనే శాసనసభ్యుడిగా ఎన్నికై రికార్డు సృష్టించారు. గిరిజన వాణిని అసెంబ్లీలో వినిపించారు. ఆయన చిత్తశుద్ధే ఆయనకు గుర్తింపునిచ్చింది. మన్యం వాసుల సంక్షేమమే లక్ష్యంగా పని చేసిన దేముడు అజాతశత్రువుగా నిలిచారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న చిత్తశుద్ధి ఎమ్మెల్యేగా ఉండేటప్పుడు కూడా పాటించేవారు. అంకితభావంతో సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. వ్యక్తిగత ప్రయోజనాలను తృణప్రాయంగా పరిగణించి ప్రజాసేవే జీవిత లక్ష్యంగా భావించారు. జీవితంలో ప్రజాభిమానం తప్ప దేముడు ఆర్జించింది శూన్యం. సరైన ఇల్లు కూడా లేదు. ఆర్టీసీ బస్సుల్లో తిరుగుతున్న ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పార్టీ ఒక జీపు ఇచ్చింది. అయితే దాన్ని 2009లో ఓడిపోయినప్పుడు తిరిగి పార్టీకి ఇచ్చేశారు.

చట్టసభల మేట

మావోల ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కూడా ఆయన ధైర్యంగా సందర్శించేవారు. చింతపల్లి నియోజకవర్గ పరిధిలో బాక్సైట్ ఎక్కువగా ఉంది. వాటిని తీయడానికి సీపీఐ, మావోలు కూడా అంగీకరించేవారు కాదు. మావోయిస్టులు ప్రభుత్వాన్ని, ప్రజాప్రతినిధులను భయపెట్టేవారు. అధికార పార్టీ నాయకులైతే గ్రామాలు వదిలి పట్టణాలకు వెళ్లేవారు. కొన్ని సందర్భాలలో మావోలు చర్చలకు పిలిచేవారు. కానీ దేముడు ఎన్నడూ ఆందోళన పడలేదు. అవసరమైనప్పుడు వారితో చర్చలకు సైతం సిద్ధపడేవారు. తాను నియోజకవర్గంలో తిరిగేటప్పుడు కొన్ని సందర్భాలలో సెక్యూరిటీని కూడా తీసుకువెళ్లే వారు కాదు. ప్రజల కోసం పని చేసేటప్పుడు మావోయిస్టులు కూడా ఏమీ చేయరన్న ఆత్మవిశ్వాసం కలిగిన నేత దేముడు. సిపిఐ నిర్ణయాలకు కట్టుబడ్డ దేముడు తాను జీవించి ఉన్నంతవరకు బాక్సైట్ నిల్వల తవ్వకానికి వ్యతిరేకంగా నిలబడ్డారు. ఈయన ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు అప్పటి ముఖ్యమంత్రులు (ఎన్టీఆర్, చంద్రబాబు, రాజశేఖరరెడ్డి) కూడా వెనుకాడేవారు కాదంటే ఈయన మాటమీద ఎంత గౌరవముందో, నిబద్ధత ఉందో అర్థమవుతుంది. చింతపల్లిలో డిగ్రీ కళాశాల, కస్తూరిభా పాఠశాల, కేడీపేటలో జూనియర్ కాలేజీ ఆయన హయాంలోనే మంజూరయ్యాయి. సప్పర్ల, దారకొండ, జర్రెల, లంబసింగి, కోరుకొండ, బలపం తదితర గ్రామాల్లో ఆస్పత్రులు కూడా ఈయన హయాంలోనే ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య అధ్యక్షుడిగా, జాతీయ గిరిజన సమాఖ్య ఉపాధ్యక్షుడిగా, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా పలు బాధ్యతలు చేపట్టారు. నిత్యం ప్రజా సమస్యలపై గ్రామాల్లో తిరుగుతుండడం వల్ల ఆయన ఆరోగ్యం దెబ్బతింది. అనారోగ్యంతో చికిత్స పొందుతూ దేముడు 2015 అక్టోబర్ 26న తుదిశ్వాస విడిచారు.

గిరిజన రైతాంగ

మహోజ్వల పోరాటం

విశాఖ జిల్లా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకత్వాన మొఖాసాదార్లకు, అటవీ అధికారులకు వ్యతిరేకంగా ఏజెన్సీ ప్రాంత గిరిజన రైతాంగ చారిత్రాత్మక పోరాటాలు జరిగాయి. అల్లూరి సీతారామరాజు మన్యం తిరుగుబాటు స్మృతులతో ఉత్తేజం పొందిన గిరిజనులు భూమి కోసం, భుక్తి కోసం ప్రాణాలకు తెగించి మొఖాసాదారులు, ముఠాదారులు, అటవీ అధికారులను ఎదిరించి తమ హక్కులను సాధించుకున్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన సీతఖండి, కొమ్మిక, నిమ్మగడ్డ, కరక, జమ్మవరం, మైదాన ప్రాంత చీడిక, కరక మొఖాసాదారులు, కేశవరం భూ ఆక్రమణదారుడు సుమారు 3000 ఎకరాలకు పైగా భూములను కలిగి ఉన్నారు. మొఖాసాదారులు ఎవరూ స్థానికంగా నివాసముండరు. వారి ప్రతినిధులుగా పన్నులు వసూలు చేయడానికి ముఠాదారులను ఏర్పాటు చేసుకు న్నారు. సాగు రైతుల నుండి అధిక పన్నులు వసూలు చేయడమేగాక వారిని పశువుగా చూసేవారు. వారి చేత వెట్టి చాకిరీ చేయించుకునేవారు. కరువు కాటకాలు వచ్చి పన్నులు కట్టలేకపోతే నిర్దాక్షిణ్యంగా వ్యవహరించేవారు.

అల్లూరి సీతారామరాజు పోరాటం సందర్భంగా బ్రిటీష్ వాళ్లు దమనకాండకు భయపడి పారిపోయారు. ఫారెస్టు అధికారులు, నాటి పోలీసులు వారి ఇండ్లను తగులబెట్టి నిరాశ్రయులను చేశారు. తరువాత ఆ గ్రామాలను రిజర్వు ఫారెస్టుగా మార్చి వారికి నిలువ నీడ లేకుండా చేశారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్యం అనంతరం 1948 ఎస్టేట్ రద్దు, 1956 లో ఈనాందారీ రద్దు చట్టాలు వచ్చినా మొఖాసాదారులు ఆ చట్టాలలోని లొసుగులను ఆధారం చేసుకొని సాగుదారులను బేదఖలు చేయడానికి పూనుకున్నారు. ఈనాందారీ రద్దు చట్టం ప్రకారం సాగుదారుకు 2/3 వ వంతు భూమి, ఈనాందారుకు 1/3వ వంతు భూమి చెందాలి. కాని మొఖాసాదారులు భూములను తమ స్వాధీనంలోకి తీసుకోవడానికి రౌడీలను ఉపయోగించి రైతులపై దాడులు చేయించారు. దీంతో ఏజెన్సీ ప్రాంత గిరిజనులు రగిలిపోయారు. భూమిని రక్షించుకోవడం, వడ్డీ వ్యాపారుల నుండి విముక్తికి, గిరిజనుల హక్కుల కొరకు పోరాడటానికి సంసిద్ధులయ్యారు.

పోరుబాట

కమ్యూనిస్టు పార్టీ నాయకులు మేకా సూరిబాబు, దేముడు గిరిజనోద్యమానికి అండగా నిలబడ్డారు. కొయ్యేరు మండలం సీతఖండి, నిమ్మగడ్డ మొఖాసా భూ పోరాటాలు హింసాత్మకంగా మారాయి. గదబ, కొండ దొర తెగల గిరిజనులు సుమారు 500 ఎకరాలను సాగు చేసుకుంటున్నారు. ఆ భూమి విప్లవ రచయితల సంఘ నాయకుడు రాచకొండ విశ్వనాథశాస్త్రి కుటుంబానికి చెందినది. ఆయన కర్రసాముతో గిరిజనులపై దాడి చేయగా సాగుదార్లు ప్రతిఘటించడంతో కాలికి బుద్ధి చెప్పారు. మరురోజు మందీ మార్బలంతో వచ్చారు. వారి

అనుచరుడు తుపాకీతో కాల్చగా యాత అప్పన్న అనే గిరిజనుడు చనిపోయాడు. అయినా గిరిజనులు బెదిరి పోలేదు. వెనుకంజ వేయలేదు. కర్రలు, రాళ్లు, బాదులు చేతికందిన ప్రతి ఆయుధాన్ని తీసుకొని మొఖాసాదారుల రౌడీలను వెంబడించి తరిమారు. చివరకు దిగివచ్చి కమ్యూనిస్టు పార్టీ నాయకుల రాజీ ప్రతిపాదనలతో భూమిని గిరిజనులకు అప్పగించక తప్పలేదు. అదే విధంగా నిమ్మగడ్డ మొఖాసాకు చెందిన 660 ఎకరాల భూమి అమ్మకాలు కొనుగోళ్లతో చేతులు మారినా మేకా సూరిబాబు, చుక్కల రాజారావు చొరవతో గిరిజనులకు రావలసిన భూమిని దక్కించుకున్నారు.

జమ్మవరం 700, కొమ్మిక 500, కరక 500 మొత్తం 1700 ఎకరాలను ఆ ప్రాంతాల గిరిజనులైన గదబ, భగత, కొండదొర, పిటిజి తెగల ప్రజలు సాగు చేసుకుంటున్నారు. ఆ మొఖాసాదారు అనుయాయులు దాడులు చేసి సాగుదార్లను గెంటివేయడానికి ప్రయత్నించగా గిరిజనులు ప్రతిదాడులకు దిగారు. ఆ ప్రాంతం మొత్తం రణరంగంగా మారింది. అయినా గిరిజనులు ఏమాత్రం వెనుకంజ వేయలేదు. తీవ్ర ఘర్షణలు జరిగాయి. పోలీసులు కేసులు పెట్టారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు సూరిబాబును వదలలేదు. రెవిన్యూ అధికారులు మొఖాసాదారుకు అనుకూలంగా ఉన్నారు. అయినా గిరిజనుల పట్టుదల, కమ్యూనిస్టు పార్టీ కృషి ఫలితంగా గిరిజనులకు రావలసిన 2/3 వ వంతు భూమిని సాధించుకున్నారు.

మొఖాసాదార్లకు, అన్యాక్రాంతంగా భూములు కాజేయడానికి కుట్రలు, కుతంత్రాలు చేసిన దోపిడీ దారులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన గిరిజనులకు ఫారెస్టు అధికారుల వేధింపులు, దౌర్జన్యాలు, కేసులు తప్పలేదు. పుల్లరి వసూళ్లు, జరిమానాలకు వ్యతిరేకంగా, పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములను డిఫారెస్టు చేసి పట్టాలివ్వాలని, చింతపల్లిలో గిరిజనులు నిరాహార దీక్షలు చేపట్టారు. గిరిజనులు చేపట్టిన నిరాహార దీక్షలకు ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో ప్రజలు ఎర్రజెండాలు చేబూని అండగా నిలబడ్డారు. సిపిఐ శాసనసభ్యులు పూల సుబ్బయ్య, కె.గోవిందరావు, సిపిఐ జిల్లా నాయకత్వం చేసిన కృషితో పోడు భూములకు పట్టాలు, పుల్లరి రద్దు, జరిమానాలు ఉపసంహరణతో గిరిజనోద్యమం విజయం సాధించింది. విశాఖ జిల్లా ఏజెన్సీ ఏరియాలో జరిగిన సమరశీల గిరిజన పోరాటం నేటి కమ్యూనిస్టు ఉద్యమానికి మార్గదర్శకం. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలకు శిరోధార్యం.

- ఎం.సి.వెంకటేశ్వర్లు

రేకొండ నుంచి అసెంబ్లీ దాకా...!

చాడ వెంకటరెడ్డి

భారత కమ్యూనిస్టు పార్టీతో నా అనుబంధం గురించి సంక్షిప్తంగా రాయడం సాధ్యం కాదు. ఎందుకంటే సగం జీవితం పోరాటాలమయమే అయినప్పటికీ, రేకొండ నుంచి అసెంబ్లీ దాకా నా ప్రస్థానంలో కొన్ని ప్రధానాంశాలను మాత్రమే స్పృశించగలను. చాడ లచ్చవ్వ, తిరుపతిరెడ్డి నా తల్లిదండ్రులు. 1950 జూన్ 30న కరీంనగర్ జిల్లా రేకొండలో జన్మించిన నాకు అక్కడే ప్రాథమిక విద్యాభ్యాసం సాగింది. ఆ తర్వాత పర్లపెల్లిలో 9వ తరగతి చదువు మొదలుకాగా, కరీంనగర్‌లోని మల్టీపర్పస్ హైస్కూల్‌లో పూర్తయింది. నేను హిందీపండిట్‌ను. మాధ్యమ, ఉత్తమ, విశారద, భూషణ్, విద్వాన్ అనే ఐదు దశలు పూర్తిచేసుకొని బీఈడీతో సమానమైన ప్రచారక్‌ను సైతం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో గల దక్షిణ భారత హిందీ ప్రచారసభలో పూర్తిచేసుకున్నాను. 1970-71లో ఇది పూర్తయింది.

1975 నా జీవితాన్ని మలుపు తిప్పింది. ఆ ఏడాది సీపీఐ సభ్యత్వం తీసుకొని రేకొండ శాఖ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. 1981లో రేకొండ సర్పంచ్‌గా, 1982లో పొన్నలూర్ తాలూకా కార్యదర్శిగా, కరీంనగర్ జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎన్నికయ్యాను. 1984లో తణుకు మహాసభలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా తీసుకున్నారు. 87లో చిగురుమామిడి మండల పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాను. ఇక 1992లో పార్టీ జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాను. 95లో చిగురుమామిడి జెడ్‌పీటీసీ సభ్యునిగా ఎన్నికయ్యాక, 2001లో తిరిగి మండల పరిషత్ అధ్యక్షునిగా ఎన్నికై, మండలంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాను. 2004 అసెంబ్లీ ఎన్నికల్లో ఇందుర్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి, సీపీఐ శాసనసభాపక్ష నేతగా ఎన్నికై

అనుబంధం

ఐదేళ్లు ఆ బాధ్యతలు నిర్వర్తించాను. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఏడాదికే సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా ఎన్నికైన నన్ను చెన్నై మహాసభల్లో జాతీయ కౌన్సిల్‌కు తీసుకున్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ కె.నారాయణ ఉన్నప్పుడే నేను కె.రామకృష్ణతో కలిసి సహాయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించాను. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై, 2022 వరకూ కొనసాగాను. 2015లో పుదుచ్చేరి మహాసభల్లో పార్టీ నాయకత్వం నన్ను జాతీయ కార్యవర్గానికి తీసుకున్నది. పోరాటాల విషయానికొస్తే, 1990 మార్చిలో హుస్నాబాద్ లాకప్‌డెత్, అక్టోబరులో చిగురుమామిడి లాకప్‌డెత్ పోరాటాలు అభేద్యంగా సాగాయి. కరీంనగర్ కలెక్టరేట్‌ను కనీవినీ ఎరుగనిరీతిలో ముట్టడించాం. శ్రీరాంసాగర్ వరద కాల్వ కోసం పాద యాత్ర, జాతాలు చేపట్టాం. ఈ ఉద్యమం సందర్భంగా చేపట్టిన కరీంనగర్ టౌన్ దిగ్బంధనం చారిత్రాత్మకంగా నిలిచింది. శాసనసభ్యునిగా, సభాపక్షనేతగా రాయలసీమ కరువు, ఆంధ్రాప్రాంతంలో వరదలు వంటి సమస్యలపై అసెంబ్లీ సాక్షిగా పోరాడాం. ప్రజాసమస్యలపై ఎన్నో రిప్రజెంటేషన్‌లు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా సీఎం రిలీఫ్‌ఫండ్‌ను మంజూరు చేయించిన ఎమ్మెల్యేల్లో టాప్-7లో నిలిచి ప్రజల మన్ననలు పొందాను. నిజానికి ఇది సీపీఐ ఘనతే. ముదిగొండ దేవాదాయ భూముల వ్యవహారంపై ఏడు రోజుల దీక్ష చేపట్టి బాధితులకు న్యాయం చేయడానికి కృషి చేశాను. విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఛైర్మన్‌గా, ప్రజానాట్య మండలి ఇన్‌ఛార్జిగా బహు ముఖ పాత్ర నిర్వహించడం నా జీవితంలో సంతృప్తినిచ్చింది. రేకొండ నుంచి అసెంబ్లీ దాకా నా ఉద్యమ ప్రస్థానంలో ఓసారి వెనుదిరిగి చూసుకుంటే, పార్టీతో నా అనుబంధం అనన్య సామాన్యమైనదే నని అనిపిస్తుంది. పార్టీ కార్యకర్తల తోడ్పాటును, ప్రజల ఆదరాభిమానాలను ఎన్నటికీ మర్చిపోలేను. విజయవాడలో జరుగుతున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలు కచ్చితంగా పార్టీకి మేలిమలుపు అవుతాయని ఆశిస్తున్నాను.

- చాడ వెంకటరెడ్డి,
సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యులు

మోదీకి ఆందోళనే లేదు

ఖాళీ నినాదాలు, ఉత్త వాగ్దానాల్లో మునిగిపోయారు

వృద్ధి అంచనా తగ్గించే ప్రపంచ బ్యాంకు నివేదికపై కాంగ్రెస్

న్యూదిల్లీ : దేశ వృద్ధి అంచనా దిగజారిందన్న ప్రపంచ బ్యాంకు నివేదిక నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ శుక్రవారం కేంద్ర ప్రభుత్వం విమర్శలు గుప్పించింది. కోవిడ్ మహమ్మారి సమయంలో భారత్‌లో పేదల సంఖ్య మరింత పెరిగిందని, కానీ ప్రధాని నరేంద్ర మోదీ ఆందోళన చెందడం లేదని, ఇప్పటికీ ఖాళీ నినాదాలలో మునిగి పోయారని ఆరోపించింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి భారత ఆర్థిక వ్యవస్థ 6.5 శాతం వృద్ధి రేటును ప్రపంచ బ్యాంక్ గురువారం అంచనా వేసింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాటే ఇక్కడ ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాని మోదీ వైఫల్యాల కారణంగా కోవిడ్ మహమ్మారి సమయంలో దాదాపు 5.6 కోట్ల మంది భారతీయులు తీవ్ర పేదరికంలోకి నెట్టబడ్డారని ప్రపంచ బ్యాంక్ గత సాయంత్రం నివేదిక వెల్లడించిందని శ్రీనాట్ చెప్పారు. 'నిపుణుల అభిప్రాయం ప్రకారం, భారతదేశంలో పేదరికం గురించి ప్రపంచ బ్యాంకు అంచనాలు వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితి కంటే తక్కువగా ఉన్నాయి. కోవిడ్ మహమ్మారి సమయంలో దాదాపు 27 నుంచి 30 కోట్ల మంది భారతీయులు కడు పేదరికంలోకి నెట్టబడ్డారని కొందరు ఆర్థికవేత్తలు విశ్వసిస్తున్నారు' అని ఆమె తెలిపారు. పేదరికం పెరుగుతుందనే భయంతోనే కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీ పేదలకు నేరుగా డబ్బు అందజేయాలని ప్రధాని మోదీకి, ఆయన

ప్రభుత్వానికి సూచించారని ఆమె వివరించారు. 'కాంగ్రెస్ పార్టీ చేసిన సూచనలను వారు శ్రద్ధ వహించి ఉంటే, ఆర్థిక పరిస్థితి ఇంత దారుణంగా ఉండేది కాదు. లక్షలాది మంది రోజువారీ కూలీలు ఇంటికి నడవాల్సిన అవసరం ఉండేది కాదు. లక్షలాది ఎంఎస్ఎంఈలను మూసివేయాల్సిన అవసరం వచ్చేది కాదు. దాదాపు ఆరు కోట్ల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యంలోకి నెట్టబడేవారు కాదు' అని ఆమె అన్నారు. భారతదేశం అంచనా వేసిన జీడీపీ వృద్ధి రేటును ఈ సంవత్సరం మూడవసారి తగ్గించాలనే ప్రపంచ బ్యాంకు నిర్ణయం ఒక్కటే కాదని, మూడీస్, ఫిచ్, ఆసియా అభివృద్ధి బ్యాంకు వంటి అనేక ఇతర సంస్థలు కూడా అదే విధంగా అంచనాను తగ్గించాయని ఆమె అన్నారు. 'ఇప్పుడు మోదీ ప్రభుత్వ స్వభావాన్ని బట్టి, ఇది భారతదేశానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ కుట్రగా భావించబడవచ్చు. ప్రపంచ బ్యాంకుకు వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా విరుచుకుపడవచ్చు' అని తెలిపారు. డాలర్‌కు రూపాయి చారిత్రాత్మక కనిష్ఠ స్థాయి 82.33కి చేరిందని, ఈ ఏడాది ప్రారంభం నుంచి 100 బిలియన్ డాలర్ల విలువైన విదేశీ మారక నిల్వలు క్షీణించాయని, కరెంట్ ఖాతా లోటు, ద్రవ్య లోటు వంటి జంట లోటు సమస్యలు పెద్దగా పెరుగుతున్నాయని, వాణిజ్య లోటు రెండింతలు పెరిగిందని ఆమె అన్నారు. ఎగుమతులు దాదాపు 3.5 శాతం, తయారీ ఉత్పత్తుల విక్రయాలు 10 శాతం తగ్గాయని చెప్పారు. ఈ తక్కువ వినియోగం పెట్టుబడిని మరింత మందగించేలా చేసిందని, ఎంఎస్ఎంఈలు మూతపడి, నిరుద్యోగం పెరిగిందని వివరించారు. ఇవన్నీ అధిక ధరలతో అగ్రస్థానంలో ఉండటం పేదలను ఎక్కువగా ప్రభావితం చేస్తోందని, అధిక ద్రవ్యోల్బణం కారణంగా ఆర్‌బీఐ రేట్లు నాలుగు రెట్లు పెంచిందని, ఇది ఈఎంఐలను అధికమై, రుణాలు ఖరీదైనవిగా మారాయని అన్నారు. 'కానీ ప్రధాని మోదీ ఆందోళన చెందలేదు. అతను ఇప్పటికీ ఖాళీ నినాదాలు, తప్పుడు వాగ్దానాలలో మునిగిపోయాడు. ఆయన చేస్తున్నదంతా, మొదట ఆలూ-సోనా, ఇప్పుడు డ్రోన్ల ద్వారా బంగాళాదుంపలను ఎత్తడం' అని అన్నారు. ప్రధాన మంత్రి అసమర్థత, ఉదాసీనత కారణంగానే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆమె ఆరోపించారు. ముడి చమురు బ్యారెల్‌కు 116 డాలర్ల నుంచి 91 డాలర్లకు పడిపోయినప్పుడు, పెట్రోల్, డీజిల్ ధరలను ఎందుకు తగ్గించలేదని ప్రధాని మోదీకి ప్రశ్నలు సంధించారు. 'సీఎన్‌జీ ధరను రూ.6, పీఎన్‌జీ ధరను రూ.4కు ఎందుకు పెంచారు. అది పేదలపై ప్రభావం చూపలేదా' అని ప్రశ్నించారు. 130 రైళ్లకు చార్జీలు పెంచారని, ప్లాట్‌ఫారమ్ టికెట్ల ధరలను 200 శాతం పెంచారని, ఇది పేదలపై ప్రభావం చూపలేదా అని ఆమె అన్నారు. 'ఆటా, పాల ధరలు మండిపోతున్నాయి. ఇది పేదలపై ప్రభావం చూపలేదా? 116 దేశాల జాబితాలో భారతదేశం 101వ స్థానంలో ఉంది. ప్రజలు ఆకలితో కష్టపడకుండా చూసుకోలేమా? ఇది పేదలపై ప్రభావం చూపలేదా? 135 కోట్ల మంది ఉన్న దేశంలో 80 కోట్ల మంది ప్రజలు ఉచిత రేషన్ తీసుకోవడానికి ఎందుకు నిస్సహాయంగా ఉన్నారు? వారిని ఈ స్థాయికి తీసుకొచ్చిందెవరు?' అని శ్రీనాటే ప్రశ్నించారు. 'వాస్తవానికి గౌతమ్ అదానీని అతని 643వ స్థానం నుంచి ప్రపంచంలోని రెండవ అత్యంత సంపన్న వ్యక్తిగా చేసినందుకు మీరు అభినందనలకు అర్హులు. మీరు కార్యాలయానికి వచ్చినప్పుడు? మీరు పేదల పట్ల ఈ శ్రద్ధలో కొంత భాగాన్ని మాత్రమే చూపినట్లయితే, మన ప్రజలు కడు పేదరికంతో కష్టాలు పడేవారు కాదు' అని ఆమె అన్నారు.

విజయవాడ రైల్వే స్టేషన్‌కు మహర్దశ

పీపీపీ పద్ధతిలో 16 స్టేషన్ల అభివృద్ధికి రైల్వే నిర్ణయం

న్యూదిల్లీ: విజయవాడ రైల్వే స్టేషన్‌కు మంచి రోజులు రానున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ భాగ స్వామ్యంలో బెజవాడ స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలని రైల్వేశాఖ నిర్ణయించింది. దేశంలో 16 రైల్వే స్టేషన్ల అభివృద్ధికిగాను ప్రభుత్వ, ప్రైవేట్ భాగ స్వామ్యం(పీపీపీ) పద్ధతిని ఉపయోగించు కోవాలని యోచిస్తోంది. ఆ రైల్వే స్టేషన్లలో విజయవాడ, నిజాముద్దీన్, పాత దిల్లీ, ఆనంద్ విహార్ ఉన్నాయి. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ) విధానం కింద న్యూదిల్లీ, సీఎస్‌టీ స్టేషన్ల పునరుద్ధరణ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. 'ఎక్కడ అవకాశం ఉంటుందో అక్కడ పీపీపీకి సంబంధించిన మార్గాల కోసం మేము అన్వేషి స్తున్నాం. టెండర్ పత్రాల వివరాలను రూపొంది స్తున్నాం. ప్రైవేట్ పెట్టు బడులు ఆకర్షించడానికి గాను వివిధ అవకాశాలను పరిశీలిస్తున్నాం' అని ఓ అధికారి చెప్పారు. పీపీపీ పద్ధతిలో పూనె, కోయంబత్తూరు, బరోడా, భోపాల్, బెంగళూరు సిటీ రైల్వే స్టేషన్లను పునరుద్ధరి స్తున్నామని వివరించారు. ఈ 16 రైల్వే స్టేషన్ల అభివృద్ధికిగాను రూ.10 వేల కోట్లు అవసరమవు తాయని ఆయన చెప్పారు. ఈపీసీ పద్ధతి కింద మొత్తం ప్రాజెక్టుకు ప్రభుత్వమే నిధులు అంద జేస్తుంది. ఓ కంపెనీ ఈ పనులన్నీ చేపడుతుంది. పీపీపీ పద్ధతి ప్రకారమైతే ప్రాజెక్టుకు అయ్యే వ్యయం పంపిణీ జరుగుతుంది. ఇందులో ప్రభుత్వం కొంత, ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులు కొంత పెట్టుబడి పెడతారు. న్యూదిల్లీ స్టేషన్, ఛత్రపతి శివాజీ మహరాజ్ టెర్మినస్, అహ్మదాబాద్ స్టేషన్లను ఈపీసీ పద్ధతిలో అభివృద్ధికి కేంద్ర కేబినెట్ గతవారం ఆమోదం తెలిపింది. ప్రయాణికులపై అదనపు భారం మోపాలని ప్రభుత్వం కోరుకోవడం లేదని అధికారి తెలిపారు. ఈపీసీ పద్ధతి కింద 47 స్టేషన్లకు సంబంధించిన టెండర్లకు ఆమోదం లభించింది. 32 స్టేషన్ల అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. పీపీపీ పద్ధతి కింద యూజర్ చార్జీల పేరుతో ప్రయాణికులపై రైల్వే అదనపు భారం వేయదు. ప్రైవేట్ భాగస్వాములు మాత్రం తమ పెట్టుబడు లను పూర్తిగా తిరిగి వసూలు చేసుకుంటారు.

డీఎంకే అధ్యక్ష పదవికి స్టాలిన్ నామినేషన్

చెన్నై: అధికార డీఎంకేలో అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఇక్కడి పార్టీ ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయాన్ని సందర్శించిన స్టాలిన్... అక్టోబర్ 9న ఇక్కడ జరిగే పార్టీ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉన్న కీలక పదవికి సంబంధించిన పత్రాలను సమర్పించారు. ఈ కార్యక్రమానికి పార్టీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి దురైమురుగన్, కోశాధికారి టి.ఆర్.బాలు, పార్లమెంటు సభ్యులు కనిమొళి, ఎ.రాజాతో పాటు డీఎంకే యువజన విభాగం కార్యదర్శి, శాసన సభ్యుడు ఉదయ నిధి స్టాలిన్, అనేక మంది సీనియర్ నాయకులు హాజరయ్యారు. అన్నా అరివాలయం చేరుకోవడానికి ముందు స్టాలిన్ దివంగత ముఖ్యమంత్రులు సి.ఎన్.అన్నాదురై, ఎం.కరుణానిధి స్మారక చిహ్నాలను సందర్శించారు.

'మతం మారినా ఎస్సీ హోదా'

- పరిశీలనకు కమిషన్ ఏర్పాటు చేసిన కేంద్రం
- రెండేళ్లలో నివేదిక ఇవ్వాలని ఆదేశం

న్యూదిల్లీ: దళిత క్రిస్టియన్లు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదా ఇచ్చే అంశం వచ్చే మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆ అంశంపై అధ్యయనం కోసం కమిషన్ ఏర్పాటు చేసింది. ఇప్పటివరకు ఉన్న రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం హిందు, బౌద్ధ, సిక్కు మతాల్లోని వారిని మాత్రమే ఎస్సీలుగా గుర్తిస్తు న్నారు. కేంద్రం ఏర్పాటు చేసిన కమిషన్‌కు సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కేజీ బాలకృష్ణన్ నేతృత్వం వహించనుండగా, కమిషన్‌లో సభ్యులుగా 1981వ బ్యాచ్ హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ రవీందర్ కుమార్ జైన్, యూజీసీ సభ్యురాలు ప్రొఫెసర్ సుష్మా యాదవ్‌ను నియమిస్తూ కేంద్రం గురువారం నోటిఫికేషన్ జారీచేసింది. ఈ కమిషన్ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెండేళ్లలో నివేదిక సమర్పించాలని గడువు విధించింది. కమిషన్ దిల్లీ కేంద్రంగా పనిచేస్తుందని స్పష్టం చేసింది. "ఇతర మతాల్లోకి మారినవారిని సైతం ఎస్సీలుగా గుర్తించాలంటూ ఇటీవలి కాలంలో చాలా డిమాండ్లు వచ్చాయి. ఈ వాదనలను కొన్ని వర్గాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ సంక్లిష్ట అంశంపై సామాజిక, రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. దీనికున్న ప్రాధాన్యం, సున్నితత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఎస్సీ హోదా వర్తింపజేసే అంశంలో మార్పులు చేర్పులు చేయాలంటే కమిషన్స్ ఆఫ్ ఎంక్వయిరీ యాక్ట్ 1952 కింద కచ్చితత్వంతో కూడిన అధ్యయనం చేయడంతో పాటు, విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరం ఉంది. అందువల్ల ఆ చట్టంలోని సెక్షన్ 3కింద ఉన్న అధికారాలను ఉపయోగించి ఇప్పుడు 'కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ'ని ఏర్పాటు చేస్తున్నాం" అని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది.

కమిషన్‌కు అప్పగించిన విధివిధానాలు

చారిత్రకంగా తాము ఎస్సీలమని చెప్పుకుంటూ, రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద రాష్ట్రపతి ఉత్తర్వుల్లో పొందుపరిచిన మతాల్లోకి కాకుండా ఇతరమతాల్లోకి మారిన వారికి ఎస్సీ హోదా ఇవ్వడంపై గురించి అధ్యయనం చేయడం, అలాంటి వారిని ఇప్పుడున్న ఎస్సీల జాబితాలో చేరిస్తే ఎస్సీలపై చూపే ప్రభావం గురించి పరిశీలించడం, ఎస్సీలు ఇతర మతాల్లోకి మారడంవల్ల సంస్కృతి, సంప్రదాయాలు, సామాజిక పరిస్థితులు, హోదాపరమైన వివక్ష, పేదరికాల్లో వస్తున్న మార్పులు ఏంటి? అలాంటి వారికి ఎస్సీ హోదా కల్పించడంవల్ల తలెత్తే ప్రభావాలేంటి? అన్న అంశంపై అధ్యయనం చేయడం. ఇంకా ఏవైనా అంశాలపై అధ్యయనం చేయాల్సి ఉన్నట్లు కమిషన్ భావిస్తే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి, దాని అనుమతితో ఆ అంశాలపైనా అధ్యయనం చేపట్టడాన్ని కమిషన్ ప్రధాన బాధ్యతగా అప్పగించారు.

ఈడీ విచారణకు డీకే హాజరు

న్యూదిల్లీ/బెంగళూరు: నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు డీకే శివకుమార్ శుక్రవారం న్యూదిల్లీలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. శివ కుమార్‌తో పాటు ఆయన సోదరుడు, కాంగ్రెస్ ఎంపీ డీకే సురేష్‌కు నోటీసులు ఇచ్చిన ఈడీ అధికారులు... కచ్చితంగా దిల్లీలోని కార్యాలయానికి వచ్చి విచారణ ఎదుర్కొనాలని నోటీసివ్వడంతో డీకే బ్రదర్స్... ఏపీజే అబ్దుల్ కలామ్ రోడ్డులోని ఈడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. రాహుల్ గాంధీ చేపట్టి భారత్ జోడో యాత్ర ప్రస్తుతం కర్ణాటకలో కొనసాగుతోంది. రాహుల్ పాదయాత్ర విజయవంతం చేసేందుకు శివకుమార్ అన్నీ తానై చూసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27వ తేదీన దిల్లీ వచ్చి విచారణ ఎదుర్కోవాలని ఈడీ నోటీసు పంపింది. ఈడీ కార్యాలయానికి వెళ్లే ముందు డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ... దిల్లీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని తమకు నోటీసులు ఇచ్చి రాజకీయ కక్ష సాధింపులు సాగిస్తున్నారని తెలిపారు. న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని, విచారణకు హాజరు కావడానికి మాకు సమయం ఇవ్వాలని మనవి చేసినా ఈడీ అధికారులు పట్టించుకోలేదని తెలిపారు.

చిరుకూ సెంటిమెంట్ వర్కవుటైంది: థమన్

హైదరాబాద్: మెగాస్టార్ చిరంజీవి, మోహన్ రాజా కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం 'గాడ్‌ఫాదర్'. అక్టోబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా దూసుకెళుతోంది. సినిమాకి వచ్చిన పాజిటివ్ టాక్‌తో చిత్రబృందం సంతోషంగా ఉంది. ఇక ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది సంగీతం.మెగాస్టార్ కోసం థమన్ ప్రాణం పెట్టేశాడు అనేలా టాక్ వినబడుతున్న నేపథ్యంలో.. థమన్ కూడా సోషల్ మీడియా వేదిగా తన సంతోషాన్ని తెలియజేస్తున్నారు. అంతేకాదు, మీడియాతో కూడా ఈ సక్సెస్‌పై ముచ్చటించారు. ఆయన మాట్లాడుతూ.. మెగాస్టార్ విషయంలో కూడా నా సెంటిమెంట్ వర్కవుట్ అయింది. ముందుగా ఈ సినిమాని ఇంత పెద్ద సక్సెస్ చేసిన ప్రేక్షకులందరికీ థ్యాంక్స్. నాకు ఫస్ట్ హీరో హిట్ సెంటిమెంట్ ఉంది. నేను తొలిసారి కలిసి పనిచేసిన హీరోలందరి సినిమాలు బ్లాక్ బస్టర్స్ సాధించాయి. మహేష్-దూకుడు, రవితేజ-కిక్, ఎన్టీఆర్-బృందావనం, పవన్ కల్యాణ్-వకీల్ సాబ్, బాలకృష్ణ-అఖండ... ఇలా అన్నీ బ్లాక్‌బస్టర్స్. ఇప్పుడు మెగాస్టార్ చిరంజీవితో నేను చేసిన తొలి సినిమా 'గాడ్ ఫాదర్' కూడా బ్లాక్ బస్టర్ కావడం సెంటిమెంట్ కొనసాగినట్లయింది. చిరంజీవికి మ్యూజిక్ చేయడం అంత తేలికైన విషయం కాదు. ఆయనలో చాలా లేయర్స్ ఉంటాయి. అవన్నీ అందిపుచ్చుకోవడం అంత ఈజీ కాదు. నేను, దర్శకుడు మోహన్ రాజా ఏడాది పాటు చాలా కష్టపడ్డాం. మ్యూజిక్‌కి స్కోప్ లేని సినిమాలో మ్యూజికల్‌గా హైప్ తీసుకురావడం ఒక పెద్ద సవాల్‌గా తీసుకున్నాం. సినిమా చూసిన ప్రేక్షకులు సంగీతం గురించి గొప్పగా మాట్లాడుతుంటే చాలా ఆనందంగా ఉంది." అని తన ఆనందాన్ని థమన్ షేర్ చేసుకున్నారు.

ఒకే పాత్రతో బాపు శిష్యుడి చిత్రం

హైదరాబాద్: తొలి సినిమానే ప్రయోగాత్మక చిత్రంగా చేయడానికి ధైర్యం కావాలి. ప్రముఖ దర్శకుడు బాపు అనేక సినిమాలకు సహాయ దర్శకుడిగా పనిచేసిన కాకర్ల శ్రీనివాసు ఇప్పుడిటువంటి ప్రయత్నమే చేస్తున్నారు. తొలి సినిమానే తనకు ఎంతో స్పెషల్ కావాలని.. 'హలో మీరా' కథపై కసరత్తులు చేసి.. ప్రేక్షకులు వినూత్న అనుభూతిని పొందేలా ఆవిష్కరిం చబోతున్నారు. లూమియర్ సినిమా బ్యానర్‌పై జీవన్ కాకర్ల సమర్పణలో డా.లక్ష్మణరావు దిక్కల, వరప్రసాదరావు దుంపల, పద్మ కాకర్ల ఈ ప్రయోగాత్మక చిత్రాన్ని నిర్మించారు. కేవలం ఒకే ఒక పాత్రతో సినిమాను నడిపించి థ్రిల్ చేయనుండటం ఈ చిత్రం ప్రత్యేకత. తాజాగా ఈ చిత్ర ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సస్పెన్స్ డ్రామా థ్రిల్లర్‌గా కథ మొత్తం కూడా మీరా అనే పాత్ర చుట్టూనే తిరుగుతూ.. ప్రేక్షకులకు అనుక్షణం సీట్ ఎడ్జ్ థ్రిల్ ఇస్తుందని నిర్మాతలు చెబుతున్నారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రధాన పాత్ర అయిన మీరాను చూపిస్తూ కథలోని యాంగిల్ ఏంటనేది స్పష్టం చేశారు.

కొరటాలతో బాలకృష్ణ చిత్రం?

హైదరాబాద్: 'అఖండ'వంటి బ్లాక్‌బస్టర్, 'అన్‌స్టాపబుల్' వంటి టాక్ షోలతో దూసుకుపోతున్న బాలకృష్ణ, ప్రస్తుతం గోపీచంద్ మలినేనితో ఎన్‌బీకే-107, అనిల్ రావిపూడితో ఎన్‌బీకే-108 చిత్రాలకు పచ్చ జెండా ఊపిన విషయం తెలిసిందే. గోపీచంద్ మలినేనితో చేసే చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. త్వరలోనే అనిల్ రావిపూడి చిత్రం సెట్స్‌పైకి వెళ్లబోతోంది. ఈ రెండు చిత్రాలే కాకుండా.. మరో సెన్సేషనల్ కాంబినేషన్‌లో బాలయ్య చిత్రం ఓకే అయినట్లుగా టాలీవుడ్ సర్కిల్స్‌లో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాని నిర్మించబోయేది ఎవరో కాదు.. యంగ్ నిర్మాత సూర్యదేవర నాగవంశీ అని అంటున్నారు. ఇటీవల 'స్వాతిముత్యం'చిత్ర ప్రమోషన్స్‌లో నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ.. తమ బ్యానర్‌లో భవిష్యత్‌లో ఎవరెవరితో సినిమాలు చేయబోతున్నాడో తెలిపాడు. అందులో బాలకృష్ణ పేరు కూడా చెప్పారు. ఆయన ఎప్పుడైతే బాలకృష్ణ పేరు చెప్పాడో.. ఇక నెటిజన్లు డైరెక్టర్‌ని సెట్ చేసే పనిలో పడ్డారు. అందులో భాగంగా వచ్చిందో.. లేదంటే నిర్మాతల సైడ్ నుంచే ఏదైనా లీక్ అయిందో తెలియదు కానీ.. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో బాలయ్య-కొరటాల కాంబినేషన్‌లో త్వరలో సినిమా అంటూ తాజాగా వార్తలు వైరల్ అవుతున్నాయి. ఇక కొరటాల శివ విషయానికి వస్తే.. 'ఆచార్య' తర్వాత యంగ్ టైగర్ ఎన్టీఆర్‌తో చేయబోతున్న చిత్రం విషయంలో ఇంకా అయోమం కొనసాగుతూనే ఉంది. ఎన్‌టీఆర్30'గా తెరకెక్కాల్సిన ఈ చిత్రం..

వందేభారత్ రైలు ప్రమాదంపై దర్యాప్తు ముమ్మరం

గేదెల యజమానులపై కేసు

ముంబై/అహ్మదాబాద్: వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురి కావడం సంచలనం రేపింది. కాగా.. ప్రమాదానికి కారణమైన గేదెల యజమానులపై కేసు నమోదైంది. గుజరాత్‌లోని రైల్వే రక్షకదళం (ఆర్‌పీఎఫ్) పశువుల యజమానులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించింది. అయితే గేదెల యజమానులను రైల్వే పోలీసులు ఇంతవరకు గుర్తించలేక పోయారని, అందుకోసం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆర్‌పీఎఫ్ అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లోని వాత్వా- మణినగర్ రైల్వే స్టేషన్ల మధ్య వందే భారత్ రైలుకు అడ్డొచ్చిన గేదెల యజమానుల (గుర్తు తెలియని వారు)పై ఆర్‌పీఎఫ్ కేసు నమోదు చేసిందని పశ్చిమ రైల్వే సీనియర్ ప్రతినిధి (అహ్మదాబాద్ డివిజన్) జితేంద్ర కుమార్ జయంత్ పీటీఐకి తెలిపారు.

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

ప్రమాదానికి గురైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

ఇంజన్ ముందు భాగాన్ని ముంబైలో యుద్ధ ప్రాతిపదికన రిపేర్ చేశారు. 100 కిలోమీటర్ల వేగంతో రైలు ప్రయాణం చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. వాస్తవానికి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గంటలకు 150 కిలోమీటర్ల వేగంతో ప్రయాణం చేస్తుంది. అయితే దెబ్బతిన్న భాగాలను తొలగించారు. మళ్లీ కొత్త విడి భాగాలను అమర్చారు. ఎలాంటి సమస్య లేకుండా వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ముంబై నుంచి గాంధీనగర్ ప్రయాణం చేస్తోందని పశ్చిమ రైల్వే ప్రకటించింది. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్‌కు మరమ్మతులు చేసిన టెక్నీషియన్లను ఉన్నతాధికారులు అభినందించారు.

ప్రధాని ప్రారంభించిన వారానికే...

ప్రధాని మోదీ అట్టహాసంగా ప్రారంభించిన వారానికే ఈ రైలు ప్రమాదానికి గురికాడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైలు వేగంగా వెళ్తున్న క్రమంలో గేదెల గుంపు అడ్డం రావడంతో లోకో పైలట్ హఠాత్తుగా బ్రేక్ వేయడంతో ఇంజన్ ముందు భాగం దెబ్బతింది. అయితే ఈ ప్రమాదం నుంచి ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ముంబై సెంట్రల్ నుంచి గుజరాత్ లోని గాంధీనగర్‌కు వస్తున్న సమయంలో వాత్వా స్టేషన్ దగ్గర గురువారం ఉదయం 11.15 గంటలకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఇంజన్ ముందు భాగం మాత్రమే ధ్వంసం కాగా అడ్డొచ్చిన నాలుగు గేదెలు మృతి చెందాయి.

మరో ప్రమాదం... ఆవును ఢీకొట్టిన వైనం

గాంధీనగర్-ముంబై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గుజరాత్‌లోని ఆనంద్ స్టేషన్ సమీపంలో శుక్రవారం ఆవును ఢీకొట్టింది, ఫలితంగా రైలు ముందరి భాగానికి స్వల్పంగా నష్టం వాటిల్లిందని అధికారి తెలిపారు. ఒక రోజు ముందు, కొత్తగా ప్రారంభించబడిన సెమీ-హై స్పీడ్ రైలు నాలుగు గేదెలను ఢీకొట్టింది. దీంతో రైలు ముందరి భాగమైన కోన్‌ను మార్చవలసి వచ్చింది. తాజా ఘటనలో రైలు ముందరి కోన్ ప్యానెల్‌పై చిన్న పగులు తప్ప పెద్దగా నష్టం జరగలేదని రైల్వే అధికారి తెలిపారు. శుక్రవారం ఈ ఘటన ముంబైకి 432 కి.మీ దూరంలోని ఆనంద్ సమీపంలో మధ్యాహ్నం 3.48 గంటలకు జరిగింది. 'రైలు ముందు భాగం చిన్న పగులు ఏర్పడింది' అని పశ్చిమ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సుమిత్ ఠాకూర్ ధ్రువీకరించారు. ప్రయాణీకు లందరూ సురక్షితంగా ఉన్నారని తెలిపారు.

టీమిండియా విజయాలకు బ్రేక్

పాకిస్తాన్ చేతిలో ఘోర పరాజయం!

సిల్హెట్: మహిళల ఆసియాకప్ 2022 టోర్నీలో భారత జట్టు జైత్రయాత్రకు బ్రేక్ పడింది. హ్యాట్రిక్ విజయాలతో పూర్తి ఆధిపత్యం చెలాయించిన హర్మన్ ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టుకు పాకిస్తాన్ ఊహించని షాకిచ్చింది. శుక్రవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ మహిళలు 13 పరుగులతో భారత్‌ను ఓడించారు. గత మ్యాచ్‌లో తమ కంటే బలహీనమైన థాయ్‌లాండ్ చేతిలో ఓడిన పాక్ మహిళలు.. పటిష్ఠమైన భారత్‌ను ఓడించి నేలకు కొట్టిన బంతిలా బౌన్స్ బ్యాక్ అయ్యారు. భారత బ్యాటర్లలో ఒక్కరు కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ మహిళలు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 137 పరుగులు చేశారు. పాక్ జట్టులో నిదా దార్(37 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 56 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. కెప్టెన్ బిస్మా మరూఫ్(35 బంతుల్లో 2 ఫోర్లతో 32) కీలక ఇన్నింగ్స్ ఆడింది. భారత బౌలర్లలో దీప్తి శర్మ(3/27) మూడు వికెట్లు తీయగా.. పూజా వస్త్రాకర్ (2/23) రెండు వికెట్లు పడగొట్టింది. రేణుక సింగ్(1/24) ఓ వికెట్ తీసింది. అనంతరం లక్ష్య చేధనకు దిగిన భారత్ అమ్మాయిలు 19.4 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌటయ్యారు. వికెట్ కీపర్ రిచా ఘోష్(13 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 26), దయాలన్ హేమలత(22 బంతుల్లో 3 ఫోర్లతో 20) టాప్ స్కోరర్లుగా నిలిచారు. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (17)తో పాటు కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్(12), తెలుగు అమ్మాయి సబ్బినేని మేఘన(15) దారుణంగా విఫలమయ్యారు. ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శన కనబ ర్చిన జెమీమా రోడ్రిగ్స్ (2) కూడా తీవ్రంగా నిరాశపరిచింది. పాక్ బౌలర్లలో నష్రా సంధు మూడు వికెట్లు తీయగా.. నిదార్ దార్, సదియా ఇక్బాల్ రెండేసి వికెట్లు తీశారు. ఐమన్ అన్వర్, టుబా హస్సన్ చెరో వికెట్ పడగొట్టారు. ఈ టోర్నీలో మొత్తం నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత అమ్మాయిలు మూడు విజయాలతో పాయింట్స్ టేబుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. పాక్ సైతం మూడు విజయాలతో రెండో స్థానంలో నిలిచింది. లీగ్ దశ ముగిసిన తర్వాత టాప్-4లో నిలిచిన జట్ల మధ్య సెమీఫైనల్ మ్యాచ్‌లు జరగనున్నాయి. వీటిలో గెలిచిన జట్ల మధ్య ఫైనల్ జరగనుంది.

వరల్డ్‌కప్ జట్టు ఎంపిక కష్టమే: లక్ష్మణ్

బెంగళూరు: వచ్చే ఏడాది వన్డే వరల్డ్‌కప్‌నకు జట్టు ఎంపిక సెలక్టర్లకు కత్తిమీద సాముగా మారనుందని హైదరాబాదీ వెటరన్ బ్యాటర్, నేషనల్ క్రికెట్ అకాడమీ అధిపతి వీవీఎస్ లక్ష్మణ్ జోస్యం చెప్పారు. ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌కు లక్ష్మణ్ స్టాండ్ ఇన్ కోచ్‌గా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. యువ క్రికెటర్లు అద్భుతంగా ఆడుతుండటంతో సెలక్టర్ల ఆప్షన్లు కఠినతరంగా మారనున్నాయని లక్ష్మణ్ విశ్లేషించాడు. "బ్యాకప్ కోచ్‌గా ఇప్పటి వరకు బాగానే ఉంది. ఈ విధానం ఐర్లాండ్ సిరీస్ నుంచి ప్రారంభించారు. రాహుల్ ద్రవిడ్ టీ20 ప్రపంచ కప్‌నకు పూర్తిస్థాయిలో సేవలు అందించేలా వెసులుబాటు లభిస్తోంది. మావద్ద సరిపడినంత మంది మంచి క్రికెటర్లు ఉన్నారు. వారంతా భవిష్యత్తు సిరీస్‌లను దృష్టిలో పెట్టుకొని సిద్ధమవుతున్నారు. వారి మధ్య మంచి పోటీ ఉంది. 2023 వన్డే ప్రపంచ కప్‌నకు సరైన జట్టును ఎంపిక చేయడం సెలక్టర్లకు కష్టతరం కానుంది. ఒక్కసారి ప్రధాన ఆటగాళ్లు తిరిగి వస్తే అవకాశాలు పరిమితం అవుతాయని యువ ఆటగాళ్లకు తెలుసు. వారు బాగా ఆడుతున్నారు. వారికి ఇది ఒక మంచి అవకాశం. బాగా ఆడిన వారినే ఎంపిక చేస్తున్నప్పుడు.. మంచి ప్రదర్శనతో అవకాశాలను సజీవంగా ఉంచుకోవచ్చు" అని వీవీఎస్ లక్ష్మణ్ పేర్కొన్నారు. దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ధావన్ నేతృత్వంలోని మరో భారత జట్టు మాత్రం వన్డే సిరీస్‌లో శుభారంభం చేయలేకపోయింది. బౌలింగ్‌లో సగం ఇన్నింగ్స్ వరకు పైచేయి సాధించినా.. బ్యాటింగ్‌లో ఆరంభ తడబాటును అధిగమించి మెరుగైన స్థితికి చేరుకున్నా.. ఆఖర్లో పట్టు విడవడంతో ఓటమి తప్పలేదు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.